# స్వాతంత్ర్య సమరశీలి - చెన్నమనేని లలితాదేవి

డా. చెన్నమనేని పద్మ

సముద్రాల ప్రచురణలు
హైదరాబాద్

స్వాతంత్ర్య సమరశీలి -
చెన్నమనేని లలితాదేవి

రచయిత్రి :
డా. చెన్నమనేని పద్మ

మొదటి ముద్రణ :
సెప్టెంబర్ : 2018

ప్రతులు : 500

వెల : **రూ. 100/-**

పుస్తకాలకు :
సముద్రాల ప్రచురణలు
**డా. సిహెచ్. పద్మ**
16-10-27/93 (51/2 RT), మునిసిపల్ కాలనీ
మలక్‌పేట్, హైదరాబాద్ - 500 036
Ph : **040 - 24555264, 9849750854**
**E-mail : chpadma898@gmail.com**
ఇంకా ప్రముఖ పుస్తకాల దుకాణాలు

ముద్రణ :
శ్రీ ఉదయ్ ప్రింటర్స్
D.No. 3-5-170 / 1 / 8 / 1 / A
నారాయణగూడ, హైదరాబాద్
ఫోన్ :040 – 64511385

# అంకితం



**దీనజనుల పాలిట కల్పతరువు**
**స్వర్ణభారతంకై తపించిన సత్యశోధకుడు**
**తెలుగు చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం**
**తరలిపోయిన మలగని సంతకం**

**కీ. శే. చెన్నమనేని రాజేశ్వరరావు**
**జనహృదయనేత**

## పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

**POTTI SREERAMULU TELUGU UNIVERSITY**

Public Gardens, Hyderabad - 500 004

**Accredited by NAAC**



**ఆచార్య యస్వీ సత్యనారాయణ**

ఉపాధ్యక్షులు

ఫోన్ : 040 – 2323 4815

సెల్ : 94901 89824

ఫ్యాక్స్ : 040 – 2323 6911

ఇ–మెయిల్ : vc@teluguuniversity.ac.in


తేది : 19–9–2016

# స్ఫూర్తిదాయక జీవితం

హైదరాబాదు సంస్థాన విమోచనోద్యమం ఒక ఒడవని కథ, ఉజ్వల ఇతిహాసం. ఇందులో ఒక్కొక్క వీరయోధుడి జీవితం ఒక్కొక్క విశిష్ట అధ్యాయం. అలాగే వారి జీవన సహచరి అనుభవాల, జ్ఞాపకాల సంచయం మరో ఉప అధ్యాయం. నిజాం నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రజాపోరాటం ప్రపంచ ప్రసిద్ధి చెందింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎందరో కవులను, కళాకారులను, చిత్రకారులను ప్రభావితం చేసింది. "తెలంగాణ" అన్నమాట విశ్వవ్యాపితంగా ప్రతిధ్వనించింది. తిరుగుబాటు బావుటాగా నిలిచింది. ఈ చారిత్రాత్మక పోరాటానికి సంబంధించి ఎన్ని గ్రంథాలు వెలువడినా, ఎన్ని పరిశోధనలు జరిగినా ఇంకా జరగాల్సింది ఎంతో ఉంది. ఇదొక తరగని జ్ఞాపకాల గని. తవ్వినకొద్దీ ఎన్నో వినూత్న అంశాలు వెలుగుచూస్తూనే ఉంటాయి.

మట్టి మనుషులను మహావీరులుగా, సామాన్య ప్రజలను మాన్యులైన మహానాయకులుగా రూపొందించిన మహాపోరాట ఇతిహాసంలో మాన్యులు చెన్నమనేని రాజేశ్వరరావు దంపతుల జీవితం ఒక విలక్షణమైన అధ్యాయం. ఇందులో ప్రధాన



పాత్రధారి చెన్నమనేని రాజేశ్వరరావు గారి అనుభవాలు, జ్ఞాపకాలు "సత్యశోధన" పేరిట ఒక అపురూపమైన ఆత్మకథ గ్రంథం ఇప్పటికే వెలువడింది. నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా ఉంది.

చెన్నమనేని రాజేశ్వరరావుగారు పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే ఆర్య సమాజంతోనూ, ఆంధ్ర మహాసభతోనూ అనుబంధం కలిగి ఉన్నారు. పదవ తరగతి చదువుతున్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. అప్పటి జాతీయోద్యమ నాయకురాలు శ్రీమతి అరుణా ఆసఫలీ అభినందనలు పొందారు. తర్వాత క్రమంగా అఖిల భారత విద్యార్థి సంఘంతోనూ, రాచరిక వ్యతిరేక విమోచనోద్యంతోనూ పెనవేసుకుపోయారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తి చేసుకోగానే **(1944)** గౌరవనీయులు గొర్నేని రాంగోపాల్ రావు గారి పెద్దకూతురు లలితాదేవితో వీరి వివాహం జరిగింది. అప్పుడామె వయస్సు పదహారు ఏండ్లు. ఆమె స్కూల్ విద్యార్థిని. పెళ్లి సందర్భంగానే ఆమెతో మాట్లాడుతూ తన రాజకీయ భవిష్యత్తు గూర్చి, ఆనాటి అస్థిర రాజకీయాలు, సామాజిక, సాంస్కృతిక పరిస్తితుల గూర్చి చెన్నమనేని రాజేశ్వరరావు ఆమెకు (లలితాదేవికి) వివరించారు. అలాగే సహధర్మచారిణిగా ఆమె సహాయ సహకారాలు తనకు ఎంత అవసరమో విశదీకరించారు. ఆయన మాటలు విన్న లలితాదేవి కంగారు పడలేదు, ఆందోళన చెందలేదు. "ధర్మపత్నిగా ఎల్లవేళలా భర్త వెంట ఉండడమే తనకు సంతోషం ... సౌభాగ్యం" అని ఆమె వాగ్దానం చేసింది. ఈ వాగ్దానాన్ని చెన్నమనేని వారు అస్తమించేదాకా నిలబెట్టుకున్న ధీశాలి లలితాదేవి. **88** సంవత్సరాల వయసులోనూ భర్త అనుభవాలను, జ్ఞాపకాలను స్మరించుకుంటూ ప్రశాంత జీవనాన్ని కొనసాగించిన ధన్యజీవి లలితాదేవి.

చెన్నమనేని రాజేశ్వరరావు గారితో పాటు భారత స్వాతంత్రోద్యమంలోనూ, హైదరాబాదు సంస్థాన విమోచనోద్యమంలోనూ వెంట నడిచిన ఉద్యమ సహచరి శ్రీమతి చెన్నమనేని లలితాదేవి. పోరాట ప్రస్థానంలో అరణ్య, అజ్ఞాతవాసాలు అనుభవించింది. అష్టకష్టాలు పడింది. భర్తతో పాటు మారుపేర్లతో, మారువేషాలతో సంక్లిష్టమైన, ప్రమాదకరమైన జీవితాన్ని గడిపింది. అనేకమంది సన్నిహిత సహచరులు రాలిపోతున్న

విషాదవార్తలు విని కరిగి కన్నీరైంది. దళాలు పురోగమిస్తున్న వీరోచితగాథలు విని పులకించిపోయింది. కష్టాలను, నష్టాలను, విషాదాలను, విజయాలను సమపాళ్ళలో అనుభవించిన స్థితప్రజ్ఞ శ్రీమతి లలితాదేవి.

ఆమె జీవితం, వ్యక్తిత్వం నేటితరానికి తెలియజేయాలనే సదాశయంతో డా. చెన్నమనేని పద్మ "స్వాతంత్ర్య సమరశీలి చెన్నమనేని లలితాదేవి" అనే గ్రంథాన్ని రూపొందించారు. అయితే కేవలం లలితాదేవి గారి జీవిత విశేషాలకు పరిమితం కాకుండా, 1940, 50 దశకాల నాటి హైదరాబాదు సంస్థానంలోని సామాజిక స్థితిగతులు, జాతీయోద్యమకాలం నాటి మహిళా ఉద్యమాలు, భారత కమ్యూనిస్ట్ పార్టీ నిర్వహించిన వీరోచితమైన పాత్రను, విమోచనోద్యంలోని విభిన్న దశలను డా. పద్మ వివరించారు. లలితాదేవి గారికి అనేకమంది ఆనాటి ఉద్యమకారులతో ఉన్న అనుబంధాన్ని పరిచయం చేశారు. పోరాట విరమణానంతరం చెన్నమనేని రాజేశ్వరరావు గారు అనుసరించిన పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను గురించి, ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో లలితాదేవిగారు నిర్వహించిన క్రియాశీల పాత్రను గురించి ఈ గ్రంథం సంక్షిప్తంగానే అయినా సమగ్రంగా ఆవిష్కరించింది.

ఒక ఉద్యమకారుడి విజయం వెనుక జీవన సహచరిగానూ, ఉద్యమ సహచరిగానూ అతని భార్య నిర్వహించగలిగే ఉదాత్తమైన పాత్రను ఈ గ్రంథం నేటి తరానికి తెలియ జేస్తున్నది. నిన్నటితరం అనుభవించిన బాధలు, మోసిన బాధ్యతలు, నిర్వహించిన పాత్ర నుండి మన తరం నేర్చుకోవాల్సిన అనేక ఆదర్శనీయమైన అంశాలను వ్యక్తం చేస్తున్న ఒక ప్రామాణికమైన పాఠ్యగ్రంథంలాగా ఈ పుస్తకాన్ని రూపొందించిన డా. చెన్నమనేని పద్మకృషి అభినందనీయం.

(ఎస్వీ సత్యనారాయణ)

**(ఆచార్య ఎస్వీ సత్యనారాయణ)**

❋ ❋ ❋



# ఆత్మీయ స్పందన

మహిళల పాత్రలేని జాతీయ విముక్తి పోరాటాలు, విప్లవోద్యమాలు ఏవీలేవు. చరిత్ర ప్రసిద్ధి గాంచిన వీర తెలంగాణ విప్లవ పోరాటంలోనూ మహిళల పాత్ర మహోన్నతమైనది.

'స్త్రీ చేయగల సాహసానికి పరిమితి లేదు' అని అంటూ సుందరయ్య గారు రాసిన తెలంగాణ సాయుధ పోరాట గ్రంథంలోని వీర నారీమణుల గాథలు గుర్తుకు వస్తాయి.

జమిందారుల వంశంలో పుట్టి అల్లారుముద్దుగా పెరిగిన లలితాదేవి, కమ్యూనిస్ట్ అయిన రాజేశ్వరరావు గారిని వివాహం చేసుకొని ఆస్తిపరుడైనప్పటికి పేదలు, రైతులు, బడుగు వర్గాల తరపున నిలబడి, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం నడిపిన రాజేశ్వరరావుతో, భీకర నిర్బంధం తాండవిస్తున్న ఆనాటి పరిస్థితుల్లో, పార్టీ రహస్య కేంద్రాలలో ఉండి అవసరమైన పనులు చేస్తూ ఇతర కార్యకర్తలకు ఆశ్రయం ఇస్తూ, భర్తకు ఎంతో సహకారాన్ని అందించారు.

ప్రభుత్వదాడులు తీవ్రమైనప్పుడు, రాజేశ్వరరావు జైలులో నిర్బంధించ బడినప్పుడు కూడా ఇద్దరు చిన్నపిల్లలతో ఎంతో మనో నిబ్బరంతో లలితాదేవి వ్యవహరించిన తీరు నన్ను ఇప్పటికీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

లలితాదేవి డెన్‌లను నిర్వచించిన తీరు, హైదరాబాద్‌లోనూ, చాందా క్యాంప్‌లోను ఆమె వ్యవహరించిన తీరు అమోఘం.

ఆయుధాలను ట్రైన్‌లో చాందా నుండి హైదరాబాద్‌కు చేరవేయడంలో ఆమె చూపిన సాహసం నేటి యువతకు ఆదర్శం.

స్నేహశీలి, మృదుస్వభావి, బంధుప్రీతి కలిగిన లలితాదేవి ఎప్పుడూ ఎంతో ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరిస్తూ ప్రేమను పంచేవారు. జ్ఞాపకాలను తట్టిలేపితే కన్నీటి ఊట ఉబికి వచ్చే జీవితాలను అనుభవించిన మేము తడిసిన జ్ఞాపకాలను అపురూపంగా నెమరువేసుకునేవాళ్లం ఎప్పుడు కలిసినా.

సంస్కరణోద్యమం, జాతీయోద్యమం, కమ్యూనిస్ట్ ఉద్యమం, నక్సల్బరీ ఉద్యమం, రాజకీయ జీవితాలతో ముడిపడి ఉన్న జీవితం ఆమెది. ఈమె స్త్రీల పోరాట పటిమకు, వేదనకు కూడా ప్రతినిధి.

రహస్య కేంద్రాలలో ఉన్నప్పుడు డబ్బుకు ఇబ్బందుకు ఏర్పడినప్పుడు తన ఒంటిపైన నగలు అమ్మివేసి కుటుంబాన్ని పోషించారు. 70 సంవత్సరాల వైవాహిక జీవితంలో అతి విశాలమైన కుటుంబాన్ని గుంబనంగా చూసుకుంటూ భర్త సుదీర్ఘ రాజకీయ జీవితంలోనూ లలితాదేవి ఎప్పుడూ స్థితప్రజ్ఞలోనే ఉన్నారు.

కష్టాలకి కృంగిపోవటం, సుఖాలకు ఉప్పొంగడం లాంటివి ఎప్పుడూ లేవు.

కుటుంబ అవసరాలు, మారిన పరిస్థితుల దృష్ట్యా చురుకైన రాజకీయ పాత్ర పోషించకపోయినా ఆశయాలు మరిచిపోకుండా 75 సం. వైవాహిక జీవితాన్ని అర్థవంతంగా పూర్తిచేసుకున్నారు.

రాజకీయ జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ఎంతటి సంక్లిష్టమైన సవాళ్ళు ఎదురైనా మనిషి వాటిని ఎదుర్కొని నిలడాలని లలితాదేవి జీవితం యువతకు ప్రత్యేకించి మహిళలను ఉత్తేజపరుస్తుందని ఆశిస్తున్నాను.

ఒక మహిళగా నా తోటి సహచరి లలితాదేవి గురించి వ్రాయటం చాలా ఆనందంగా ఉంది. ఉద్యమాలూ, స్త్రీల చరిత్ర గురించి అధ్యయనం, పరిశోధన చేసేవారు ఈ పుస్తకం తప్పక చదవాలి. విలువైన పుస్తకం.

లలితాదేవి జీవిత చరిత్రను వ్రాసిన రచయిత్రి శ్రీమతి చెన్నమనేని పద్మకు నా హృదయపూర్వక అభినందనలు.

**ఎస్.కె. సుగుణ**

స్వాతంత్ర్య సమరయోధురాలు

❊ ❊ ❊



# Foreword

What makes ordinary men and women,extraordinary is when they had to face very difficult circumstances and come out of them with grit and courage, Smt. Lalitha story is one such. In the erstwhile Princely State of Hyderabad, eighty percent of the land was in the hands of less than 5% of the population. The Land holders were called Paighas, Samsthanams, Jagirdars, Deshmukhs, Sardeshmukhs, Desais, Sardesais, Makhtedars and Zamindars. These people had various executive powers and some had magisterial powers. All these people used to collect land revenues which was the main source of income for the Nizam. The revenue was shared between the big land holders and the Nizam. All the crops were dependent on rains. Rest of the population who used to cultivate lands of the big land holders were share croppers, tenants or their servants. 90% of the population lived in poverty thereby making them docile to the inhuman demands of the big land owners. The land owners used all sorts of inhuman and cruel methods to collect the revenue from the peasantry, even when the crops failed. In such circumstances, taking inspiration from Marx and Lenin, a communist movement was started in India. In Telangana, it was headed by Sri. Ravi Narayan Reddy, Sri. Baddam Yella Reddy etc.

Sri. Ch. Rajeshwar Rao as a young man in 1940's joined the movement. He married his first cousin Smt. Lalitha in the year 1944. While rest of India was liberated on August 15$^{th}$ 1947, Hyderabad was still a Princely State under the Nizam. The communist organized a guerilla warfare across Telangana to fight against the big land owners and distributed land to the tillers. The communist movement was brutally crushed by the inhuman police of the Nizam. The communists had also to face Razakars a private army created by Ittehadul Muslimeento fight along with the Jagirdars for the creation of a separate Hyderabad State. In those circumstances, Sri. Ch. Rajeshwar Rao went underground and participated in the movement. Smt. Lalitha stood by her husband in those extremely difficult times wherever he went. She never complained about the difficulties of underground life nor decided to go to her parent's place. Wherever the movement took her, from Hyderabad to Chanda in Maharashtra, she went along. During the underground movement, living in disguises, the family with two small children had to face lot of hardship and penury. She also gave her gold ornaments to her husband so that they could continue underground life. Eventually, she was also Jailed. Now read the story of how an ordinary woman became an extraordinary woman.

**P.Varaprasad Rao**



## ముందుమాట

ఉద్యమ చరిత్రలు ఉద్యమ స్థితిగతులను తెలుపుతాయి. అందులో పాల్గొన్న వ్యక్తుల జీవితాలు, అనుభవాలు తెరవెనకనే ఉండిపోతాయి. నిజానికి ఆ వ్యక్తుల జ్ఞాపకాలే ఆ కాలాన్ని సజీవంగా చిత్రించగలవు. ఆ ఉద్దేశ్యంతోనే లలితాదేవి జ్ఞాపకాలను తెరవెనుక నుండి బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేశాను.

చిన్నప్పటినుండి ఆనాటి కమ్యూనిస్ట్ ఉద్యమాలు, ఆ కాలం మనుషులు, అప్పటి సంగతులు, అమ్మమ్మ తాతయ్యల ద్వారా వినేదాన్ని. అవి ఎంతో ఆసక్తిని కలిగించేవి. రజాకర్లు గ్రామాలపై దాడులు చేసినప్పుడు వారు పడ్డ కష్టాలు, పోలీసుల దురాగతాలు, వారిని గ్రామ రక్షక దళం ఎదుర్కొన్న విధం ఎంతో ఆసక్తిగా చెప్పేవారు. అందుకే చిన్ననాటి నుండి ఉద్యమ జీవితాలపై ఆసక్తి పెరిగింది.

వీరి జీవితాలలో ఉన్న వైవిధ్యం, సామాజిక, రాజకీయ చైతన్యంలో వారు గడిపిన కాలం, సంఘ పరిస్థితులు, చదువులేని, చదువురాని మహిళల్లో ఉన్న తెగువ, ధైర్యం, ఆవేశం నన్ను ఆలోచింప చేసేవి. ఎన్నో ఒడిదుడుకులు అనేక మలుపులతో కూడిన వారి జీవితాలు నేటి తరానికి ఆసక్తికరంగా ఉంటుంది అని ఆశిస్తాను. ఆనాటి చరిత్ర, అనేక సాహస స్త్రీల పరిచయం. వీరితో కలిసి పనిచేసిన ఎందరో (అ) సామాన్యులు ఈ పుస్తకంలో కనిపిస్తారు.

ఆ కాలాన్నీ, ఆ మనుషులనూ ఎప్పటికీ స్మరించుకునేలా చేయాలి ఈ పుస్తకం. ఎందరో జీవితాలలో వీరి కథ కూడా మిళితమైనందున వారి గురించి కూడా రాయడం న్యాయమేమో అనిపించింది. లలితాదేవి వ్యక్తిగత కుటుంబ వివరాలు పార్టీ కార్యక్రమాలతో మిళితమై వుంటాయి. అందుకే అవి సమకాలీన ఉద్యమకారులకు కూడా ఆసక్తికరంగా ఉండ గలవని నమ్ముతున్నాను.

మహిళా సంఘాల ఏర్పాటు, మహిళల ఉద్యమాలు, వారు చూపిన సాహసం, చేసిన త్యాగాలు వింటుంటే చాలా ఉత్తేజభరితంగా ఉంటాయి. కొత్త ఆలోచనలకు ప్రేరణ కలిగిస్తాయి. లలితాదేవి మారుతున్న కాలాన్ని అనుసరించి మారే ప్రయత్నం చేశారు. వీరు నేటి యువతరానికి స్ఫూర్తి దాయకులు, మహిళా సమాజానికే గర్వకారకులు.

నేటి యువతలో వీరి జీవిత చరిత్ర గొప్ప జీవిత లక్ష్యాన్ని ఏర్పరచుకోవటానికి ప్రేరణ కలిగిస్తుందని ఆశిస్తాను.

**చెన్నమనేని పద్మ**



## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | **ఉపోద్ఘాతం** | 13 - 23 |
| | మహిళా ఉద్యమాలు | |
| | జాతీయోద్యమ కాలంలో మహిళా ఉద్యమాలు | |
| | హైదరాబాద్ సంస్థానంలో ఆనాటి పరిస్థితులు | |
| 2. | **జననం - బాల్యం - విద్యాభ్యాసం** | 24 - 29 |
| | కమ్యూనిస్ట్ సాహిత్య ప్రభావం | |
| | తల్లిదండ్రుల ప్రభావం | |
| 3. | **ఆంధ్ర మహాసభలు - స్త్రీల సభలు** | 30 - 36 |
| 4. | **వివాహం - రాజేశ్వరరావు గారి ప్రభావం** | 36 - 48 |
| 5. | **దేశ స్వాతంత్ర్యం - పార్టీలో కీలక పరిస్థితులు** | 48 - 49 |
| 7. | **హైదరాబాద్ సంస్థానంలో రాజకీయాలు - రాజేశ్వరరావు గారి పాత్ర** | 49 - 53 |
| 8. | **కమ్యూనిస్ట్ పార్టీ నిర్వహించిన కొన్ని కార్యక్రమాలు** | 54 - 57 |
| | దస్తరాలు కాల్చివేసే కార్యక్రమం | |
| | గ్రామ రక్షణ దళాలు | |
| | గ్రామ రక్షణ దళాల నిర్వహణ | |
| | రహస్య స్థావరాల నిర్వహణ | |
| | గెరిల్లా పోరాట ఎత్తుగడల శిక్షణ | |
| 9. | **స్త్రీల చైతన్యం** | 58 - 60 |
| | మహిళల పాత్ర | |
| | మహిళా శిక్షణా తరగతులు | |
| | మహిళల సమయస్ఫూర్తి | |
| 10. | **లలితాదేవి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం** | 61 - 62 |
| 11. | **రహస్య జీవితం** | 65 - 89 |
| | సిటీ కాలేజ్ సంఘటన | నవాబు గారి కబాబులు |

| | | |
|---|---|---|
| సబ్జి మండి స్థావరం | కల్పన జననం | |
| 1953లో జైలు జీవితం | శాసనసభ్యులుగా | |
| రైతాంగ పోరాటాలు | అడ్వకేట్‌గా | |
| ఆకునూరు - మాచిరెడ్డి పల్లి దురంతాలు | 1967లో ఎన్నికలలో విజయం | |
| 1969 జైలు జీవితం | రమేష్ సెన్స్ సంస్థ | |
| రమేష్ రాజకీయ ప్రవేశం | | |
| తెలంగాణా అమర వీరుల స్మారక ట్రస్ట్ | | |

**12. ఆర్థికరంగ నిపుణుడు హనుమంతరావు గారితో అనుబంధం** 89 - 91

**13. కుటుంబంతో అనుబంధం** 91 - 100

| | |
|---|---|
| రాధమ్మగారితో స్నేహం | అత్తమామలతో |
| సంతానంతో | సోదర సోదరీమణులతో |

**14. ఇతర ఉద్యమకారులు** 107 - 135

| | |
|---|---|
| అణభేరి ప్రభాకరరావు | మగ్దుం మొహియుద్దీన్ |
| ఆరుట్ల కమలాదేవి | మల్లు స్వరాజ్యం |
| దేవులపల్లి శ్రీరంగమ్మ | కొండపల్లి కోటేశ్వరమ్మ |
| కె.ఎల్. మహేంద్ర | టి.బి. విఠల్‌రావు |
| రాజ్ బహదూర్ గౌర్ | జ్ఞానకుమారి హెడా |
| అహల్యాబాయి | బ్రిజ్ రాణిగౌర్ |
| కొండవీటి ఇందిరమ్మ | ఎస్.కె. సుగుణ |
| సంగం లక్ష్మీబాయి | కల్పనాదత్ |

**15. ఆనాటి కష్టాలు** 135 - 137

**16. కుటుంబాల అగచాట్లు** 138

**17. నేటి తరానికి సందేశం** 139

**18. ఆధార గ్రంథాలు** 140


* * *



# స్వాతంత్ర్య సమరశీలి - చెన్నమనేని లలితాదేవి

## ఉపోద్ఘాతం

**మహిళా ఉద్యమాలు :**

తెలంగాణా ప్రాంతంలో మహిళా జనజీవన పురోగమన కార్యక్రమాలు స్థానిక ప్రభువులు బ్రిటీష్ పాలన వ్యతిరేక సామాజిక విముక్తి ఉద్యమంలో భాగంగా సాగాయి.

నైజాం వ్యతిరేక పోరాటంలో భాగంగా సాగిన గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహిళా సభలు మొదలైన ఉద్యమాల్లో స్త్రీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనడంతో పాటు బాల్య వివాహాలు, బహు భార్యాత్వం మొదలైన సమస్యలకు వ్యతిరేకంగా ఉద్యమించటంతో పాటు స్త్రీ విద్యావ్యాప్తికి వితంతు వివాహాలు జరిపించడానికి ఉద్యమాలు కృషిచేసాయి. ఈ ఉద్యమాలు సమాజ సమస్యలతో పాటు స్త్రీల సమస్యలను జోడించి పనిచేసాయి.

**జాతీయోద్యమ కాలంలో మహిళా ఉద్యమాలు :**

18వ శతాబ్దంలో దేశంలో పెరిగిన బాలికల పాఠశాలల్లో విద్యావంతులైన మహిళలు సామాజిక, రాజకీయ రంగంలో ప్రవేశించడంతో భారతదేశంలో మహిళా సంఘాల ఆవిర్భావం, మహిళా హక్కుల చైతన్యం మొదలైంది. అఖిలభారత స్థాయిలో 1905లో భారత మహిళా పరిషత్ (BMC) 1897లో స్త్రీల సామాజిక సభ LSC ఆవిర్భవించాయి. 1897 నుంచే తెలుగుదేశంలో కూడా మహిళా సంఘాలు ఏర్పాటయ్యాయి. 1905లో గుంటూరులో మహిళా సంఘం, 1905లో విశాఖపట్నంలో 15 మంది సభ్యులతో శ్రీ భారతీ సమాజం, హైదరాబాద్‌లో నవజీవన మహిళా మండలి ఈవిధంగా దేశంలో, నగరాలలో, పట్టణాలలో, జిల్లాలలో అనేక మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. 1906లో అఖిల భారత ముస్లిం కాన్ఫరెన్స్, 1917లో శ్రీమతి అనిబిసెంట్ నాయకత్వాన భారత మహిళా సంస్థలు, 1927లో అఖిల భారత మహిళా మహాసభ ఏర్పడ్డాయి. దీనిలోనే కమ్యూనిస్ట్ మహిళలు పనిచేసేవారు. వీరు సంఘంతో విభేదించి

ఆంధ్ర మహిళా సంఘాలను స్థాపించుకొని స్త్రీలకు ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇవ్వడం, రాజకీయ చైతన్యం కోసం తరగతులు నిర్వహించడంతో పాటు శ్రామిక వర్గ మహిళల సమీకరణ కూడా ప్రారంభించారు.

తెలంగాణాలో సాయుధ రైతాంగ పోరాటంలో భాగంగా సాగిన మహిళా ఉద్యమం ఆనాటి భారత కమ్యూనిస్ట్ పార్టీ స్త్రీ విముక్తి పట్ల నిబద్ధత ప్రకటించుకుని మహిళా సంఘాలను నిర్మించింది.

జాతీయోద్యమంలో కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన రైతాంగ పోరాటాలయిన సాయుధ రైతాంగ పోరాటాల్లో స్త్రీలు గణనీయంగా పెరిగారు.

అఖిల భారత మహిళా కాన్ఫరెన్స్ నైజాం వ్యతిరేక ఉద్యమంలో భాగంగా గ్రంథాలయాల స్థాపన నుంచి ఆంధ్ర మహాసభలతో పాటుగా ఆంధ్ర మహిళా సభ కూడా నిర్వహించే స్థాయికి పెరిగింది.

రైతాంగ పోరాటాలు ఉధృతంగా సాగిన తెలంగాణా పోరాటం, బెంగాల్‌లో జరిగిన పోరాటాలు, కేరళ, పంజాబ్ రాష్ట్రాల నాయకత్వంలో సాగిన పోరాట ప్రాంతాల్లో బలమైన మహిళా సంఘాలు ఏర్పడ్డాయి.

చైనా, రష్యా, వియత్నాం దేశాలలోని విప్లవోద్యమంలో స్త్రీల పాత్ర ఆయా ఉద్యమాల్లో స్త్రీల సమస్యల ప్రాతినిధ్యం, ఏంగిల్స్ మార్క్స్, మావో, లెనిన్ తదితరుల రచనలు ప్రపంచ దేశాల స్త్రీవాద ఉద్యమాల అధ్యయనంతో పాటు సమకాలీన భారతీయ సమాజంలో ఒక పక్క విద్య, ఉద్యోగ అవకాశాలు పెరగడంతో మహిళలలో చైతన్యం పెరిగింది.

తెలంగాణ అంతటా జరిగిన రైతాంగ పోరాటాల్లో ప్రజా వెల్లువ, ప్రజా పంథా విజయాన్ని స్పష్టం చేసింది. అన్ని ఉద్యమాల్లో అనేక పోరాట రూపాల్లో స్త్రీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్త్రీలు అధిక సంఖ్యాక ప్రాతినిధ్యం వలన పునాది స్థాయిలో స్త్రీల వ్యక్తీకరణకు సైద్ధాంతిక ప్రాతినిధ్యానికి స్త్రీలు నాయకత్వ స్థానాల్లోకి ఎదగడానికి విధాన నిర్ణయాల్లో నిర్ణాయక పాత్ర వహించడానికి అవకాశం వచ్చింది.

నాయకత్వ స్థానాల్లో ఉండి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతున్న స్త్రీల



రాజకీయ అవగాహన ప్రజాపోరాటాల్లోనే స్త్రీల రాజకీయ సాధికారత సుసాధ్యం అయింది.

"ప్రతి వంటకత్తే ఒక రాజకీయ వేత్త కావాలి అని లెనిన్ అన్నారు." "స్త్రీలను సామాజిక కార్యకలాపాల్లో రాజకీయ జీవితంలోకి తీసుకొని రాలేకపోతే స్త్రీలను వంటగది అనే నిర్జీవ వాతావరణం నుండి బైటికి తేలేకపోతే, నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్య సమానత్వాలు సాధ్యంకావు" అని లెనిన్ అన్నారు.

"ఒక జాతిలో స్త్రీలు ఏ మేరకు అభివృద్ధి సాధించారనే దాన్ని బట్టే నేను ఆ జాతి పురోగమనాన్ని గుర్తిస్తాను. ఒక జాతిలో స్త్రీ స్థానం, స్థితి, హోదా, ఆ జాతి సాధించిన పురోభివృద్ధికి కొలమానం అన్నారు" డా. అంబేద్కర్.

"స్త్రీలకు సంపూర్ణ స్వేచ్ఛ లభించేదాక కార్మిక వర్గం తాను సంపూర్ణ స్వేచ్ఛను సాధించలేదని" లెనిన్ అన్నారు.

"స్త్రీలు లేకుండా నిజమైన ప్రజా ఉద్యమాలు ఉండజాలవని" లెనిన్ అన్నారు.

శ్రామిక మహిళల విమోచన శ్రామిక మహిళలకు చెందినది. స్వయంగా శ్రామిక స్త్రీల భాగస్వామ్యం అత్యవసరం. పార్టీ సభ్యుల యొక్క రాజకీయ చైతన్యం గల స్త్రీల యొక్క భాగస్వామ్యం కూడా కావాలి అని లెనిన్ అన్నారు.

స్త్రీ విముక్తి అనే పదాన్ని 1940లోనే మార్క్సిజం ప్రతిపాదించింది. స్త్రీలు ఏ రంగంలో సమాన స్థాయికి చేరుకోవాలన్నా వారు కుటుంబ జీవనాన్ని లేదా సంపూర్ణ జీవితాన్ని పొందలేరనీ వదులుకోవాలనీ సమాజం చెప్పకనే చెప్పుతున్నది.

తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆది నుంచి తెలంగాణా సమాజ ఆరాట పోరాటాల్లో పురుషులకు దీటుగా ఉద్యమ పథాన నడిచిన ధీర చరిత్ర తెలంగాణ స్త్రీలది. కుటుంబం, సమాజ బాధ్యతలను నెరవేర్చడంలో ఎప్పుడూ వెనుకబడిలేరు.

అనేక సందర్భాల్లో తమదైన సృజనాత్మక పోరాట కార్యాచరణతో తెలంగాణా సమాజ కదలికల్లో, మలుపుల్లో, పోరు బాటలో అగ్రభాగాన నిలిచిన చరిత్ర తెలంగాణా స్త్రీలది.

సామ్రాజ్యాధిపత్యాన్ని సవాలు చేస్తూ ఆదివాస ప్రజల పోరాటాన్ని నడిపిన ఆదివాసీ స్త్రీలు సమ్మక్క, సారలమ్మలు.

నైజాం వ్యతిరేక పోరాటంలో అత్యంత కీలకమైన భూ పోరాటంలో తొలి సాయుధ పోరాటం జరిపి తెలంగాణా సాయుధ పోరాటాన్ని మలుపు తిప్పిన చాకలి ఐలమ్మ.

డి.బి.ఆర్. మిల్లులో సాధారణ కార్మికురాలి నుండి కార్మికోద్యమ నాయకురాలిగా ఎదిగి రైతాంగ పోరాటంలో గెరిల్లాగా మారిన ఆడివమ్మ.

తెలంగాణా రాష్ట్ర సాధన పోరాట పాటై, ఆటై తెలంగాణా పల్లె పల్లెలో పాటల బాటై నడిచి రాజ్యహింసకు బలైన బెల్లి లలిత.

అక్షరాలను అలవోకగా పేర్చి కావ్యరచన చేసిన కుమ్మరి మొల్ల, నైజాం కుటుంబానికి చెంది కూడా పరదా, బురఖా పట్టింపులు తోసిరాజని నవజీవన్ మహిళా మండలి సంస్థ కార్యక్రమాల్లో భాగంగా రోడ్ల మీద ఆందోళనలు చేసిన నిజాం కోడలు ప్రిన్సెస్ దురేషావర్, నిజాం మేనకోడలు నీలోఫరున్నీసాబేగం. నీలోఫర్ ఆస్పత్రి ఈమె పేరుతోనే ఉన్నది. జమాలున్నీసా బేగం మొదలైనవారు.

తెలంగాణా సాయుధ పోరాటంలో వివక్షతను గురించి నాయకత్వాన్ని ప్రశ్నించిన నర్సక్క.

తెలంగాణా ఉద్యమ వ్యతిరేక ప్రజా ప్రతినిధులను తమ గ్రామాల్లోకి అడుగు పెట్టకుండా ఊరి బయట నించి తరిమికొట్టిన సమరశీలత తెలంగాణా స్త్రీలది.

1969 ఉద్యమంలో పోలీసు కాల్పుల్లో అమరులైన వారిలో విద్యార్థిని రేణుక ఒకరు.

తెలంగాణా స్త్రీలు ఎప్పుడూ స్త్రీ సమస్య సమాజ సమస్యగా భావించి స్త్రీల అసమానత్వాన్ని సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూనే ఉన్నారు.

తెలంగాణా స్త్రీలకి ఘనమైన చరిత్ర ఉంది. భాష, సంస్కృతి ఆ ఉద్యమాలు సంఘ సంస్కరణ ఉద్యమాలు మొదలుకొని ఆత్మగౌరవ, స్వేచ్ఛా స్వాతంత్ర్య పోరాటాల వరకూ తెలంగాణ గడ్డమీద సాగిన అన్ని ఉద్యమాల్లో, పోరాటాల్లో తెలంగాణా స్త్రీలు చురుగ్గా, నిర్మాణాత్మకంగా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిజాం రాజ్యంలో రాజభాష అయిన ఉర్దూ భాష ఆధిపత్యంలో మరుగున పడిపోతున్న తెలుగు భాష సంస్కృతుల పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగంగా సాగిన గ్రంధాలయోద్యమంలో స్త్రీల పాత్ర మరువలేనిది.



1901లో హైదరాబాద్ కోఠిలో నెలకొల్పిన శ్రీకృష్ణ దేవరాయాంధ్ర గ్రంధాలయోద్యమ భవన నిర్మాణ దాత హైదరాబాద్‌కు చెందిన రావిచెట్టు లక్ష్మీ నర్సమ్మ గారు.

1921లో ఏర్పడిన ఆంధ్ర జన కేంద్ర సంఘంలో కూడా స్త్రీల పాత్ర ఉంది.

1923 ఆగష్టు 17, 18 తేదీల్లో జరిగిన వర్తక సంఘం నిర్వహించిన గ్రంధాలయ తృతీయ వార్షికోత్సవ సభకు కనీసం 200 మంది స్త్రీలు హాజరైనారు. స్త్రీ విద్యపై ఒక ప్రసంగం కూడా ఉండినది. ఈ సభను సూర్యాపేట వర్తక సంఘం నిర్వహించింది.

1926 జూన్ 23, 24 తేదీల్లో జరగిన సభకు ఆహ్వానితులైన శ్రీమతి పందిటి వీర రాఘవమ్మ అప్పటికే సోదరీ సమాజ వ్యవస్థాపకులు. నడింపల్లి సుందరమ్మ గారు అధ్యక్షులుగా ఉండిరి. ఈ సభకు నాలుగు వందలమంది మహిళలు హాజరైనారు.

1940 ద్వితీయార్థం నుంచి కమ్యూనిస్ట్ పార్టీల్లో, సంఘాల్లో సాయుధ పోరాట దళాల్లో తెలంగాణా స్త్రీలు గెరిల్లా పోరాట యోధులుగా, సాంస్కృతిక కార్యకర్తలుగా అనేక బాధ్యతలు నిర్వహించారు. 1969 ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో కూడా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెలంగాణా మహిళా ఉద్యమానికి సమిష్టి స్వభావం ఉన్నది. తెలంగాణాలో సాయుధ రైతాంగ పోరాటం విముక్తం చేసిన మూడువేల గ్రామాల్లో ఏర్పడిన భూపంపకం మొదలైన వ్యవహారాలు నిర్ణయించే పంచ కమిటీలలో ఇద్దరు చొప్పున స్త్రీలను కూడా ఎన్నుకున్నారు. ఆనాటి పది లక్షల ఎకరాల భూమి పంపకంలో స్త్రీలది ప్రత్యేక పాత్ర.

విలేఖించ నిండు నన్ను - తెలంగాణ వీరగాధ
వ్యధలలో నిండిననూ - వ్యాకుల త్యాగాలతో
అమాయకుల హత్యలలో - సతుల మానభంగాలలో
బరువు తాళలేని జనత - తిరిగి బిందు నెత్తురుతో
తడిసిన ఈ అమరగాధ - తడియక ప్రకటించునొకటి
ఇది అంతిమ పోరాటం - ఇది సంకుల సంగ్రామం

(హరీంద్రనాధ ఛటోపాధ్యాయ)

1941 - 1946, 1946 - 1951 వరకు జరిగిన అన్ని ప్రజాపోరాటాల్లో స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కీలకపాత్ర పోషించారు.

నైజాం పోలీసులు, రజాకర్లు, దేశ్‌ముఖ్‌ల గుండాలు, యూనియన్ సైన్యాలు కాంగ్రెస్ గుండాలు వేలాదిమంది స్త్రీలపై బలాత్కారాలు చేశాయి. చిత్రహింసలు పెట్టాయి. జైళ్లలో నిర్బంధించ చేశారు. తల్లుల కళ్ళముందే పిల్లలని చంపారు. అయినా పోరాటంలో స్త్రీలు ముందున్నారే తప్ప వెనుకడుగు వేయలేదు.

సామాజిక సంబంధాల మార్పుకోసం జరిగిన పోరాటంలో కూడా స్త్రీలు కీలకపాత్ర వహించారు.

గంపెడు పిల్లలు, పొద్దస్తమానం గొడ్డు చాకిరి, ఎప్పుడో జన్మకో శివరాత్రి అన్నట్లు వెన్నెల రాత్రుల్లో ఆడవాళ్లంతా చేరి చీరలు, రైకల మీద పూసలు, అద్దాలు కుడుతూ పాడుకునే పాటలు సీతమ్మ వారి చెరలు, ఊర్మిళాదేవి నిద్రాజఢత్వం, రుక్మిణీ కళ్యాణం, చంద్రమతీదేవి బాధల గాధలు పాడుకునే వారు. తెలంగాణా పోరాట కాలానికి ఆ స్త్రీలే జోయా, తాన్యా కథలు, అయిలమ్మ భూపోరాటం, దొడ్డి కొమరయ్య వీర మరణాల గురించి పాడుకున్నారు. గోర్కి రాసిన అమ్మ నవలను చదివించుకున్నారు. అనేక పాటలు కట్టారు.

అన్ని రంగాల్లో పురుషులతో సరి సమానంగా గెరిల్లా దళాలలోను, కొరియర్ల గానూ, గ్రామ కమిటీ సభ్యులుగా పట్టణాల్లో అత్యంత క్లిష్టమైన 'డెన్నుల' నిర్వహణ బాధ్యతను ఎంతో చాకచక్యంగా నిర్వర్తించారు.

1944లో బెజవాడలో వేసవి రాజకీయ శిక్షణా తరగతులు మహిళలకు కూడా నిర్వహించారు. ఈ శిక్షణలో స్త్రీలు చొరవగా మాట్లాడటం, క్రమబద్ధమైన రీతిలో, క్రమశిక్షణతో పనిచేయడం చేసారు. నిక్కరు షర్టు ధరించి ఆత్మరక్షణ పొందడం కూడా నేర్చుకొన్నారు. ప్రసూతి, మాతా శిశు ఆరోగ్యం, ఆర్థిక రాజకీయ భూగోళ చరిత్ర పాఠాలు విన్నారు. ఈ శిక్షణలో కార్యకర్తలు చొరవగా పనిచేసి 1944 మే నెలలో జరిగిన ఆంధ్ర మహాసభకి వేయి మంది స్త్రీలను సమీకరించుకొన్నారు.

1948లో ఆంధ్ర మహిళా సంఘంలో సభ్యత్వం 45 వేలమంది. మహిళా సమస్యలపై 'ఆంధ్ర వనిత' పేరుతో పత్రిక నడిపేవారు. ఈ పత్రికను ప్రభుత్వం నిషేధించింది.



దౌర్జన్యాలను, దుష్టులను ఎదుర్కోవడానికి ఎప్పుడూ కారంముద్దలు, కారం నీళ్లు సిద్ధంగా దాచుకునేవారు. రాత్రిపూట ఒంటరిగా కాకుండా పది పదిహేను మంది కలిసి నిద్రిస్తుండేవారు. పోరాటాల్లో స్త్రీలు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. సభలు, సమావేశాలలో ఊరేగింపులలో నడిచినారు.

నిజమైన మార్పును సాధించాలంటే ప్రజలను ఎంత విస్తృతంగా వీలైతే, అంత విస్తృతంగా సమీకరించి పనిలో పెట్టాలి. ఎందుకంటే వాళ్ళు మార్పు యొక్క అవసరాన్ని అది నిర్వహించబడవలసిన మార్గాలను అవగాహన చేసుకోవాలి. సంస్థల్లో, నిర్మాణాల్లో పనిచేయడం వాళ్ళల్లో మమేక భావాన్ని కలిగిస్తుంది. అది తమది అనే భావాన్ని కలిగిస్తుంది. అందువల్ల 1950లో ప్రజాసంఘాల్లో, కమిటీలలో చెప్పుకోదగిన చైతన్య స్థాయిలో మార్పు కలిగింది.

**హైదరాబాదు సంస్థానంలో ఆనాటి పరిస్థితులు :**

హైదరాబాదు సంస్థానం 42,000 చ.మైళ్ళ విస్తీర్ణంతో గ్రేట్ బ్రిటన్ దేశమంత పెద్దది. 16 జిల్లాల క్రింద విభజించబడి వుండేది. ఇందులో ఎనిమిది జిల్లాలు తెలంగాణ లోనివి. 1. వరంగల్లు 2. కరీంనగర్ 3. ఆదిలాబాద్ 4. నిజామాబాద్ 5. మహబూబ్‌నగర్ 6. మెదక్ 7. అత్రాఫ్ బల్దా 8. నల్లగొండ జిల్లాలు.

మహారాష్ట్ర ప్రజలు నివసించే ప్రాంతాన్ని మరాట్వాగా పిలిచేవారు. 1. బీడ్ 2. పర్భణి 3. నాందేడ్ 4. ఔరంగాబాద్ 5. ఉస్మానాబాద్ జిల్లాలు. కర్ణాటక నుంచి 1. రాయచూర్ 2. గుల్బర్గా 3. బీదర్ జిల్లాలు.

1943 నాటికి సంస్థాన జనాభా కోటీ ఎనభై లక్షలు. సుమారు 18 వేల గ్రామాలు వుండేవి. జాగీర్లు, సర్ఫేఖాస్, పాయెగాలుగా విభజింపబడి వుండేవి. చాలా గ్రామాలలో కష్టించి పనిచేసే రైతులకు భూమిపై హక్కు వుండేది కాదు. హైదరాబాదు సంస్థానం స్వతంత్రంగా వుండవచ్చునని చెప్పి బ్రిటీష్‌వారే ఆధిపత్యం చలాయించినప్పటికీ కరెన్సీ, కస్టమ్స్, పోస్టు, రవాణా శాఖలపై నైజాం ప్రభుత్వం పూర్తి ఆధిపత్యం కలిగి వుండేది. దేశంలోని సంస్థానాలన్నింటిలోకి ఇది పెద్దది.

1945లో (Rendition) రెండిషన్ సంధి పేరిట సికిందరాబాదు ప్రాంతాన్ని, నిజాం ప్రభుత్వానికి అప్పగించేవరకు సికిందరాబాదులో వారి ప్రాంతం కంటోన్మెంటులు

వేరుగా వుండేవి. వీనికి ప్రత్యేక మున్సిపల్ కమిటీ, కంటోన్మెంటు బోర్డు వుండేవి. ఈ రెండు బ్రిటీషు వారి పాలన క్రింద వుండేవి. హైదరాబాదులో వుండే బ్రిటీషు ప్రభుత్వ ప్రతినిధిని రెసిడెంటు అని పిలిచేవారు. వీరి ఆధ్వర్యంలో నడుస్తున్న స్టేటు రైల్వే ఆఫీసులు, లోకల్‌షెడ్డు వర్క్‌షాపులు కూడా సికిందరాబాదులోనే వుండేవి. హోల్‌సేల్ బట్టలషాపులు, ఇంజనీరింగు వ్యాపారుల కేంద్రం, సినిమా డిస్ట్రిబ్యూటరుల ఆఫీసులు మొదలగునవి ఇక్కడే వుండేవి. రైల్వే, మిలటరీ కంటోన్మెంటు ఉద్యోగాలలో ఆంధ్ర - తమిళ ప్రాంతాల నుంచి వచ్చినవారు (మద్రాసు ప్రెసిడెన్సీ) హెచ్చు సంఖ్యలో వుండేవారు. వీరంతా ఇంగ్లీషు, తెలుగు భాషలు మాట్లాడే వారగుటచే, సికిందరాబాదు నగరంలోని వాతావరణం 'తెలుగు' పట్టణంలాగే వుండేది. హైదరాబాదులోని పరిస్థితులకు భిన్నంగా సికిందరాబాదులో కోర్టులు, కాలేజీలు వుండటం వల్ల తెలుగు, తమిళ ఉద్యోగులు, లాయర్లు, డాక్టర్లు మారేడుపల్లిలో వుండేవారు. వెజిటేరియన్ మద్రాసు హోటళ్లు వుండేవి. వీటన్నింటి వల్ల సికిందరాబాదుకు వెళ్లితే, విజయవాడ, గుంటూరులో వున్న అనుభూతి కలిగేది అందరికి.

తెలంగాణాకు నడిబొడ్డున వున్న సంస్థాన రాజధానియగు హైదరాబాదు నగర జనాభా అప్పుడు ఏడు లక్షలు. పాలనా యంత్రాంగంలోనూ, సాంస్కృతిక పరంగానూ, ముస్లింల ఆధిక్యత వుండేది. నగరంలో ముస్లింలతో సమానంగానూ, దాని చుట్టూ వున్న తెలంగాణా జిల్లాలలో నూటికి తొంభై మందిగా వున్న తెలుగువారి ప్రభావం నగర సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక జీవితంపై కనిపించేది కాదు.

రాజాబహద్దూర్ వెంకట్రామిరెడ్డి స్థాపించిన బాలికల ఉన్నత పాఠశాల, రెడ్డి హాస్టలు, కొమర్రాజు లక్ష్మణరావు స్థాపించిన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, మాడపాటి హనుమంతరావు గారి నాయకత్వాన 'ఆంధ్ర జన సంఘ' కేంద్రాలు, 1922 నుండి క్రమంగా వృద్ధిలోకి వచ్చిన నిజాం రాష్ట్ర 'ఆంధ్ర మహాసభ' కేంద్రం తప్ప, సంస్థానంపై యూనియన్ సైనిక చర్య వరకు తెలుగు వారు మరే ఇతర సంస్థలను స్థాపించలేదు. మహారాష్ట్రులు, కన్నడులు మాత్రం తమ ప్రత్యేక పాఠశాలలను, సాంస్కృతిక సంస్థలను స్థాపించి నడుపుకొనేవారు.

హైదరాబాదు నగరంలో 1921 నవంబరు 11, 12 తేదీలలో సాంఘిక



సంస్కరణల మహాసభ జరిగింది. దీనికి మహర్షి కార్వే అధ్యక్షత వహించారు. ఈ మహాసభలలో ప్రసంగాలు ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలలో జరిగినవి. ప్రతినిధులలో ఒకరగు ఆలంపల్లి వెంకట్రామారావుగారు తెలుగులో ఒక తీర్మానాన్ని ప్రవేశ పెట్టడానికి ప్రయత్నించగా, అల్లరి చేసి అవహేళన చేశారు. తెలుగు విద్యార్థికుల పరిస్థితి ఎంత దయనీయంగా వుందో దీన్నిబట్టి తెలుస్తుంది.

తమ రాజధాని నగరంలోనే తెలుగు భాషకు జరిగిన అవమానం, ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులకు ఆగ్రహం కలిగించింది. అందువల్ల తెలుగు ప్రతినిధులందరూ అదే రాత్రి సమావేశమై 'ఆంధ్ర జన సంఘం' పేరుతో పన్నెండు మందితో ఒక సంస్థను స్థాపించుకున్నారు. వీరిలో శ్రీయుతులు మాడపాటి హనుమంత రావు, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావు, పోల్కంపల్లి వెంకట రామారావు గారలు ముఖ్యులు.

నైజాం సంస్థానాధీశుని ప్రోద్బలంతో ఇత్తెహాదులే ముసల్మాన్ సంస్థను ప్రారంభించారు. విద్యాలయాల్లో ఉర్దూ భాషలోనే తప్ప ఇతర ఏ భాషలోనూ బోధించ కూడదని నిషేధించారు. పాలనా యంత్రాంగంలో అన్ని స్థాయిలలోనూ అత్యధిక భాగం ముస్లింలనే నియమించడం, ఉర్దూ బోధనా భాషగా, ఉస్మానియా విశ్వ విద్యాలయాన్ని స్థాపించటం, హైదరాబాదు సంస్థానంలో ముస్లిం జనాభాను పెంచడానికి, సంస్థానం బయటి నుండి వచ్చి ఇచ్చట నివాసం ఏర్పరచుకునే వారికి అనేక రాయితీలు, సౌకర్యాలు కల్పించారు. ఇండస్ట్రియల్ ఫండు ద్వారా పెట్టుబడి పెడుతూ, ముస్లిం పెట్టుబడిదారులను పోషించి, వారి ఆధారంగా పరిశ్రమలు అభివృద్ధి చేసి, నూతన ఆర్థిక, సాంఘిక పునాదిని కూడా ఏర్పరచుకొనుటకు అనేక ప్రయత్నాలు చేశారు. టెక్స్‌టైల్స్ మిల్స్, పరిశ్రమలు స్థాపించటం కూడా ఇందులో భాగమే.

ఆ కాలంలో బజారులో నడుస్తుంటే షేర్వాణీలు, ఎర్ర కుచ్చు టోపీలు ధరించిన హిందూ - ముస్లిం మధ్య తరగతి వారే ఎక్కువగా కనిపించేవారు. మహారాష్ట్రులు మాత్రం తమలోతాము మరాఠీ1లోనే మాట్లాడుకునేవారు. తక్కిన వారంతా ఉర్దూ లోనే సంభాషణ చేసేవారు.

మహారాష్ట్ర స్త్రీలు తప్ప ఇతర ఉన్నత మధ్యతరగతి స్త్రీలందరూ ఘోషా

పద్ధతులను అనుసరించేవారు. నైజాము నవాబు కుమారులిద్దరూ విద్యావంతులైన టర్కీ సుల్తాన్ కుమార్తెలను వివాహం చేసుకున్న తరువాత, వారు ఘోషా లేకుండా తిరగడం వల్ల ఆ ప్రభావంతో ఉన్నత వర్గాల ముస్లిం, కాయస్త స్త్రీలలో కొంత మార్పు వచ్చింది.

పాలనా యంత్రాంగంలో ఉన్నత పదవులు నిర్వహించడానికి ఉత్తరప్రదేశ్ నుండి ముస్లిం విద్యావంతులను ఎన్నిక చేసుకునేవారు. 1920కి పూర్వం కొద్దిమంది కాయస్తులు మాత్రమే ముఖ్యమైన పదవులలో వుండేవారు. తెలుగువారికి సంబంధించి నంతవరకు పోలీసు కమిషనర్ (సిటీ కొత్వాల్)గా పనిచేసిన శ్రీ రాజా బహద్దూర్ వెంకట్రామిరెడ్డి తప్పి, ముస్లిమేతరులెవరూ ఉన్నత పదవి లోకి రాలేదు. మహారాష్ట్రుల, కన్నడిగుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉండేది.

సుబా కేంద్రాలలో స్థాపించబడిన ఇంటర్మీడియట్ కాలేజీలు అన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయాలకి అనుబంధంగా వుండేవి. సుబా కేంద్రాలయిన వరంగల్లు, ఔరంగాబాదు, గుల్బర్గాలలో ఒక్కొక్క కాలేజీ స్థాపించారు. నాలుగవది మెదక్ సుబా కేంద్రం. ఇది హైదరాబాదు నగరంలోనే వుండేది. ఉన్నత సివిల్ సర్వీసుల ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా నిజాం కళాశాలను ఏర్పరచారు. హైస్కూళ్లు కూడా జిల్లాకు ఒకటో, రెండో వుండేవి. ప్రాథమిక పాఠశాలలో కూడా ఉర్దూయే బోధనా భాషగా వుండేది. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రాథమిక పాఠశాలలు కూడా నడిపే వీలులేదు. ఇది చాలా వ్యయ ప్రయాసలతో కూడుకొని వుండేది.

శ్రీ మాడపాటి హనుమంతరావు భవనంలో ప్రారంభమైన గ్రంథాలయోద్యమం కొన్ని స్కూళ్ల స్థాపన, గుమస్తా సంఘాల అభివృద్ధి, కొమర్రాజు లక్ష్మణరావుగారు స్థాపించిన సంస్థల ప్రభావం చాలా పరిమితంగా వుండేది. అయినా అప్పటి పరిస్థితులలో ఇవి అభినందించదగినవే.

ఈవిధంగా నైజాం సంస్థానం, తెలుగు, మహారాష్ట్ర, కన్నడ ప్రజల బందిఖానాగా, వారి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అణచివేతకు, నికృష్ట దోపిడీకి కేంద్రమైంది. ఇందులో మరీ నికృష్టతను అనుభవించింది తెలుగు ప్రజలే.

జాతీయోద్యమం 1946 కల్లా ఉచ్ఛస్థాయికి చేరింది. తెలంగాణాలో ఆంధ్ర



మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు తమ కార్యక్రమాలను ముమ్మరం చేశాయి. నల్లగొండ జిల్లాలోని కొన్ని గ్రామాలలో అక్రమ బేదఖళ్ళకు వ్యతిరేకంగా 'దున్నే వాడికే భూమి' కావాలనే నినాదంతో ప్రజలు ప్రతిఘటనకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలోనే దేశ పరిస్థితులలో పెద్ద మార్పులు వచ్చాయి. 1947 ఆగస్టు 15న భారతదేశానికి, బ్రిటీషు సామ్రాజ్యవాదము నుంచి స్వాతంత్ర్యం లభించింది. దేశవ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాలతో ఉత్సవాలు జరుపుకుంటున్నారు. నైజాం నవాబు మాత్రం సంస్థానాన్ని 'ఆజాద్ హైదరాబాద్'గా వుంటుందని ప్రకటించాడు. హైదరాబాదు సంస్థాన ప్రజలు దీనిని సవాలుగా తీసుకున్నారు.

హైదరాబాదు ఇతర పట్టణ ప్రాంతాలలో అలజడి మొదలైంది. నైజాం నవాబు పూర్తిగా మతశక్తులను ప్రోత్సహించడం మొదలుపెట్టాడు. ఈ శక్తులకు ప్రతినిధిగా 'ఇత్తెహాదుల్ ముసల్మీన్' సంస్థ రూపొందింది. వీరికి సంస్థానంలోని జాగీరుదారులు, దేశముఖులు, పెద్ద భూస్వాములు అండగా నిలిచారు.

ఆగస్ట్ 15వ తేదీన స్వాతంత్ర్య దినాన్ని జరుపకుండా చేయడానికి నైజాం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. కాని జాతీయ పతాక గౌరవాన్ని కాపాడేందుకు ఎన్ని త్యాగాలకయినా సిద్ధమేనని ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ పార్టీలు ప్రకటించాయి.

ఈకాలంలోనే మీర్ లాయకలి నైజాం నవాబుకు ప్రధానమంత్రి అయినాడు. 'ఆజాద్ హైదరాబాదు'ను రక్షించడానికి జిల్లాలలోకి వెళ్లి 'ఇత్తెహాదుల్ ముసల్మీన్' స్థాపించి, ముస్లిం యువకులకు వాలంటీర్లుగా తర్ఫీదు ఇవ్వడం ప్రారంభించారు.

1947 సెప్టెంబరు 11వ తేదీన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్దుమ్ మొహినుద్దీన్ గార్ల పేర్లతో కమ్యూనిస్టు పార్టీ చరిత్రాత్మక ప్రకటన చేసింది. అందిన ఆయుధాలతో నైజాం ప్రభుత్వాన్ని సాయుధంగా ఎదుర్కోవాలని ఆ ప్రకటనలో పిలుపు నిచ్చింది.

ఈ పిలుపు అందిన వెంటనే ఆయుధ సేకరణకి జైత్రయాత్రలు ప్రారంభం అయ్యాయి. ఇటువంటి తరుణంలోనే లలితాదేవి గారి జననం అయింది.

**జననం - బాల్యం - విద్యాభ్యాసం :**

కరీంనగర్ జిల్లాలోని మానువాడ గ్రామం నుండి వేములవాడకు దత్తుగా వెళ్ళిన గొర్నేని రాంగోపాల రావు, మంగమ్మ గార్ల సంతానంలో పెద్ద కుమార్తె లలితాదేవి గారు. వీరు మొత్తం ఏడుగురు సంతానం. వీరిలో ముగ్గురు అమ్మాయిలు. నలుగురు అబ్బాయిలు. లలితాదేవి గారు **1928** అక్టోబర్ **20**వ తేదీన వేములవాడలో జన్మించారు. వీరి తండ్రి ఎంతో పేరు ప్రఖ్యాతులు సాధించిన మహోన్నత వ్యక్తి. పరోపకారి. స్వంతలాభం కొంత మానుకొని, పొరుగువాడికి మేలు చేయవోయ్ అన్న గురజాడ మాటలను అక్షరాల పాటించిన సత్య దురంధరుడు, ప్రజల బాగోగులు తన బాగోగులుగా భావించే ఆత్మీయుడు, మంచి వ్యవహార కర్త, కరుణార్ధ హృదయుడు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవకులను, ప్రజానాయకులను ఆదరించి వారికి సేవ చేసిన గొప్ప వ్యక్తి. అందరి మన్ననలు, ప్రేమాను రాగాలను పొందిన మంచి మనసున్న భూస్వామి.

తండ్రి లక్షణాలను పుణికి పుచ్చుకున్న లలితాదేవి గారు నేడు కీర్తికాంతులు విరజిమ్ముతున్నారు.

రాంగోపాలరావు గారు తమ పిల్లల్ని, సమాజాన్ని సమదృష్టితో చూసిన దార్శినికులు, క్రమశిక్షణ, సౌశీల్యం కలిగిన వ్యక్తులు. ముఖ్యంగా తెలంగాణా పోరాట కాలంలో సిరిసిల్లా తాలుకా ఆంధ్ర మహాసభలు జరిగినప్పుడు ఈ సభలు జయప్రదం కావడానికి ఎంతో సహకారం అందించారు. వచ్చిన అతిథులందరికి భోజన, వసతి సదుపాయాలు కల్పించి సభ విజయవంతం కావడానికి శాయశక్తుల ప్రయత్నించిన గొప్ప వ్యక్తి. నిబ్బరమైన వ్యక్తిత్వం కలవారు.

ఈ సభలలో ఆంధ్ర మహాసభ సభ్యత్వ పుస్తకాలను, ఎంతో విలువైన పత్రాలను అమరజీవి సింగిరెడ్డి భూపతి రెడ్డిగారు దాచిపెట్టమని ఇచ్చినప్పుడు ఎలాంటి జంకు, బొంకు లేకుండా నిర్భయంగా, నిస్సంకోచంగా పత్రాలను ఎంతో జాగ్రత్తగా దాచిపెట్టి నమ్మకంగా తిరిగి అప్పజెప్పిన గొప్ప మహనీయులు.

నిజాం వ్యతిరేక పోరాటంలో, ఇతర సమాజ హిత పోరాటాలలో ప్రత్యక్షంగా పాలు పంచుకోకపోయిన పోరాట వీరులకు మానసిక ధైర్యాన్ని ఇస్తూ, వారిని కష్ట



సమయాలలో ఆదుకుంటూ, వారి కుటుంబాలను ఎంతో ఆదరణ, ప్రేమతో చూస్తూ వారికి కావలసిన ఆర్థిక సహాయం చేసేవారు. వారి కుటుంబ సభ్యుల నంతా తన స్వంత కుటుంబ మనుషులుగా భావించేవారు. వారికి తగిన మర్యాదలు కూడా చేసేవారు. గొప్ప దేశభక్తులు.

వీరి భార్య మంగమ్మ కూడా భర్తకు తగ్గ భార్య. మహాసాధ్వి. భర్త అడుగు జాడలలో అడుగులు వేసిన మహాపతివ్రత. గొప్ప సేవాభావం, స్నేహభావం కలిగి నటువంటిది. సాంప్రదాయాలను గౌరవిస్తూ కుటుంబాన్ని ప్రయోజకులను చేసిన ధీర వనిత. ఎంతో భక్తి ప్రపత్తులు కలిగి దైవారాధననే పరమావధిగా భావించే సాధ్వీమణి. పదిమంది పనివారితో కలిసి వారిని ఆత్మీయంగా చూస్తూ, వారంతా తన వారే అనే భావన కలిగిస్తూ పనిచేసే నిరాడంబరమూర్తి. సొంత కుటుంబ సుఖ సంతోషాలను పక్కకు తోసి సమాజాన్ని సొంత కుటుంబంగా చూసుకున్న గొప్ప సాధ్వీమణి, మానవతామూర్తి.

లలితాదేవి అన్నలు జి. మోహన్‌రావు, జి. ప్రభాకర రావు, జి. సుధాకర్ రావు, జి. కమలాకర్ రావు గార్లు. లలితాదేవి అక్కచెల్లెళ్లు జె. రాధమ్మ, జె. శోభ గార్లు. ఉమ్మడి కుటుంబంలో అన్నదమ్ముల చెల్లెళ్ల అల్లారుముద్దుగా ప్రేమిస్తూ మురిపంగా పెరిగిన బిడ్డ లలితాదేవి. ఉజ్వల భవిష్యత్ ఉన్న పిల్లగా బాల్యంలోనే ప్రతిభా విశేషాలు కురిపించిన ధీర.

పేరుకు తగ్గట్టుగా లలితమైన స్వభావం, ఎవరి మనసు నొప్పించకుండా అందరికి తలలో నాలుకలా మెలుగుతూ అందరి అభిమానాన్ని చూరగొన్న వనిత. లలితాదేవి తండ్రి ధార్మికదృష్టి, తల్లి నైష్టిక నియమ జీవితం, వీరిపై గొప్ప ప్రభావాన్ని చూపాయి. సహజంగా తండ్రికి పెద్ద కూతురు అంటే ఇంటికి మహాలక్ష్మిగా భావిస్తూ, అమితంగా ప్రేమిస్తూ, అల్లారుముద్దుగా, మురిపాల మూటగా పెంచుతారు. లలితాదేవి విషయంలో కూడా అదే జరిగింది. నాన్న ప్రేమను, తల్లి ఆశీస్సులను, తోబుట్టువుల అనురాగాన్ని అమ్మమ్మ, తాతయ్యల ప్రేమను పంచుకొని పెరిగిన మురిపాల మూర్తి లలితాదేవి. కాలు కిందపెడితే కందిపోతుందన్నంత సుకుమారంగా, అపురూపంగా పెరిగిన లలితాదేవి చిన్ననాడు అష్టైశ్వర్యాలతో కష్టం తెలియకుండా తండ్రి చాటు బిడ్డగా పెరిగింది.

ఆ కాలంలో ఉమ్మడి కుటుంబాలు, ఎప్పుడు బంధుజనంతో నిండి ఉండేది. ఎప్పుడు ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే, కేరింతలు, తుళ్ళింతలతో అందరితో కలిసిపోయి బాల్యాన్ని ఎంతో మురిపెంగా, ఆప్యాయంగా ఆస్వాదించిన తీపి గుర్తుల బాల్యం వీరిది.

ఆకాలంలో ఆడపిల్లలు పాఠశాలకు వెళ్ళి చదువుకునే వారు కాదు. ఆ గ్రామంలోని భూస్వాముల, జమిందార్ల కుటుంబాలకు పండితులే (బ్రాహ్మణులు) వచ్చి పాఠాలు బోధించేవారు. ఆనాడు పలకలు లేవు, ఇసుకలోనే అక్షరాలు దిద్దించేవారు.

ఆవిధంగా వీరి విద్యాభ్యాసం కూడా ఇంటిదగ్గర బాలశిక్ష, హల్లులు, గుణింతాలుతో మొదలై తెలుగు భాషను ఔసోపన పట్టారు. పురాణాలు, మహాభారతం, రామాయణ, భాగవత కథలు, పంచతంత్ర కథలు మొదలైన వాటితో పాటు లౌకికజ్ఞానం కలిగించే సాహిత్యాన్ని కూడా పరిచయం చేసేవారు ఆనాటి పండితులు.

భాగవతంలోని, రామాయణంలోని శ్లోకాలను నోటికి వచ్చేంతవరకు నేర్పించి, వల్లె వేయించేవారు.

వీరి పండితులు శ్యామయ్యగారు, రంగాచార్యుల గారి దగ్గర సంస్కృతం కూడా చదువుకున్నారు. వీరిద్దరు మనసుకు హత్తుకునే విధంగా పాఠాలు బోధించి చదువుపైన జిజ్ఞాసను కలిగించారు.

ఆ జిజ్ఞాసతోనే ఆ కాలంలోనే పాఠశాలలో వెళ్ళి చదువుకుంటానని మారాం చేసి, పట్టుదలతో దగ్గరలో ఉన్న గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళి ఏడవ తరగతి పూర్తయ్యే వరకు చదువుకున్నారు. గణితంలో జమాఖర్చులు, గుణకార, భాగాహారాలను కూడా చక్కగా నేర్చుకున్నారు.

ఒకసారి రజస్వల అయిన తరువాత ఆడపిల్లలను వాకిలి దాటి బయటకు వెళ్లనిచ్చేవారు కాదు. అందుకే లలితాదేవి గారి చదువు ఏడవ తరగతికే ఆగిపోయింది. కాని వీరికి చదువుపైన ఉన్న శ్రద్ధ, ఆసక్తి వీరితో ఎన్నో గ్రంథాలను చదివించేటట్టుగా చేసింది.

**1940** లోపే వీరి ఏడవ తరగతి పూర్తి అయింది. అప్పుడు స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులు. వీరి నాన్నగారైన శ్రీరాం గోపాల్ రావు గారితో



ఉద్యమ స్వరూప స్వభావాలను గురించి చర్చించడానికి ఎందరో ఉద్యమకారులు, విప్లవకారులు, కార్యకర్తలు వచ్చేవారు.

వారి సంభాషణలను ఎంతో ఆసక్తిగా వింటూ లలితాదేవి గారు కూడా స్వాతంత్రోద్యమంలో పాల్గొనాలని ఉవ్విళ్లూరుతూ ఉండేవారు.

వీరి కుటుంబంలో తల్లిలాంటి సేవలు అందించిన శ్రీమతి కీ.శే. నరసమ్మ గారు ఎంతో ప్రేమతో అల్లారుముద్దుగా లలితాదేవిని పెంచినారు. వాళ్ల ఇంట్లోనే ఉండి సేవలందించిన నరాల పోచెట్టి సేవలు కూడా మరిచిపోలేనివి. వారి నిస్వార్థ భక్తి, సేవాభావం ఏమి ఆశించకుండా వారంతా తన వారేనని ప్రేమ, దయ, కరుణతో నిస్వార్థంగా వారు చేసిన సేవ ఎప్పటికి మరువలేనివి. వారి త్యాగం ఎంతో శ్లాఘించదగినది. వారి స్థానం నౌకర్లే అయినా వారు ఏనాడు కూడా నౌకర్లుగా భావించకుండా అందరు తన వారే, తన ఆత్మీయులే అని భావించి వారు చేసిన సేవకు విలువ కట్టలేరు, ఏనాటికి మరిచిపోలేరు కూడా.

వారి ప్రభావం జీవితంలో ఎప్పటికి చిరస్మరణీయంగా ఉంటుంది. వీరి నుంచి నేర్చుకున్న పాఠమే లలితాదేవి గారికి. వారి ప్రేరణే ఈనాటికి తన నౌకర్లను తన వారితో సమంగా చూసే అలవాటు,

విశాల సమాజంలోని మానవులంతా తనవారే, అనే మమతా దృక్పథం వీరి నుంచి నేర్చుకున్నదే. ఇది జీవితంలో ఒక ముఖ్య పాఠం. తరువాత ఉద్యమ సమయంలో ఎంతగానో వీరికి పనికి వచ్చిన పాఠం.

లలితాదేవి గారి ఇంటికి వచ్చే బంధువులలో రాజేశ్వరరావు గారు ముఖ్యులు. రాజేశ్వరరావు గారు లలితాదేవికి స్వయాన మేనత్త కొడుకు (బావ) అవుతారు. వీరు బాల్యం నుంచే వారి మేనమామ గారైన రాంగోపాల్‌రావు గారింటికి తరుచుగా వస్తూ పోతూ ఉండేవారు.

రాజేశ్వరరావు గారు అప్పటికే విద్యార్థి నాయకులుగా ప్రసిద్ధులు. ఉద్యమాలలో చురుకైన కార్యకర్తగా, నాయకులుగా ప్రసిద్ధి చెందారు.

మంచి ఎత్తు, అందమైన ఆకారం, ముఖంలో చురుకుతనంతో కూడిన

తేజస్సుతో వారిని చూడగానే ఆత్మీయత, అభిమానం, ప్రేమ కలుగుతుంది. అంతటి అందమైన రూపం. అప్పటికే మంచి విద్యార్థి నాయకులుగా పేరు. ఎప్పుడూ ఉత్సాహం, చురుకుదనంతో ఎగిసిపడే కెరటంలా ఉండే రాజేశ్వరరావు గారిని చూసినప్పుడల్లా లలితాదేవి హృదయంలో ఆరాధనాభావం, ప్రేమ, గౌరవం. తన మేనబావ ఎదుగుతున్న క్రమం, వారికి లభిస్తున్న ఆదరణ, ప్రజాబాహుళ్యం, లలితాదేవి గారి మనసులో వారిపై ఎనలేని ప్రేమను పెంచాయి. ఆరాధనా భావాన్ని కలిగించాయి, గౌరవాన్ని ఇప్పించాయి.

రావుగారు వచ్చినప్పుడల్లా ఇల్లు ప్రజలతో, ఉద్యమకారులతో కళకళలాడుతూ ఉండేది. రావుగారిని కలవడానికి వచ్చే గ్రామ యువకులు, ఇతర విద్యార్థి నాయకులు, వారితో వీరు ప్రసంగించే విధానం, వారిని ఉత్తేజపరిచే పద్ధతి, వారు మనదేశ స్వాతంత్ర్యం గురించి రాజేశ్వరరావు పడుతున్న ఆతృత, వారి త్యాగనిరతితో లలితాదేవి గారి హృదయంలో స్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకోగలిగారు.

**కమ్యూనిస్ట్ సాహిత్య ప్రభావం :**

లలితాదేవి గారి పుట్టినింట్లో, మెట్టినింట్లో ఎప్పుడూ ప్రజాసమస్యల చర్చలే. స్వేచ్ఛావాయువుల తహతహలే. వీరి ఇంటి నిండా కమ్యూనిస్ట్ సాహిత్యం ఉండేది.

ప్రజాశక్తి ప్రచురణలన్ని కొనేవారు. స్వతంత్ర పత్రికను ఢిల్లీ నుంచి తెప్పించుకునేవారు. మాస్కోలో ప్రచురితమైన పుస్తకాల అనువాదాలన్నీ వీరి ఇంటిలో ఉండాల్సిందే. వట్టికోట ఆళ్వారుస్వామి ప్రారంభించిన అణా గ్రంథమాల వీరిలో స్వతంత్రపు ఆలోచనలకు దారి తీసింది. ప్రజా సంక్షేమంపై దృష్టి మరల్చేలా చేసింది.

కమ్యూనిస్ట్ సాహిత్యమే కాకుండా గురజాడ, కందుకూరి వీరేశలింగం నడిపిన మహిళా పత్రికలు అన్నీ తెప్పించుకుని చదివేవారు. వీరి ఇంటికి వచ్చిన మహిళలతో పత్రికలలోని విషయాలన్నీ చర్చించేవారు. ఇంట్లో వున్న ఆడపడుచులందరిచేత చదివింపచేసేవారు.

ముఖ్యంగా లెనిన్, మావోల గురించి, ఇతర మహిళా నాయకుల గురించి చాలా ఆసక్తిగా చదివేవారు.

లలితాదేవి మరిది సిహెచ్. హన్మంతరావు గారు ఆరోగ్యం బాగా లేనప్పుడు



విశ్రాంతి తీసుకున్న సమయంలో మహిళలందరిని ఒకచోట చేర్చి వారికి కమ్యూనిజం గురించి, ఉద్యమం ఉద్దేశం కార్యాచరణ గురించి ఉద్బోధించేవారు.

లలితాదేవి గారు సంప్రదాయ వాది. నియమ నిష్టలు ఉన్న వ్యక్తి. స్నానాదిక ఆచారాలు తప్పక ఆచరించేవారు. రామాయణం, భాగవతం పారాయణం చేసేవారు.

లలితాదేవికి బాల్యం నుంచే ఉన్న పఠనాసక్తి ఇంకా మెరుగులు దిద్దుకున్నది. రామాయణం, భాగవతంలోని ఘట్టాలు, భేతాళ కథల సంపుటి ఆసక్తిగా చదివేవారు.

**తల్లిదండ్రుల ప్రభావం :**

లలితాదేవిపై వారి తండ్రి రాంగోపాల్ రావు, తల్లి మంగమ్మ గార్ల ప్రభావం చాలా ఉంది. తండ్రి సమాజ శ్రేయస్సు గోరే సమాజ సేవకుడు. తల్లి సత్ సంప్రదాయాలు పాటించే అసలైన గృహిణి.

తండ్రి నుండి సమాజ శ్రేయస్సును, తల్లి నుండి సదాచారాలను, హైందవ మతం గొప్పతనాన్ని, దాని ప్రచార ఆవశ్యకతను, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు భారతీయ మహిళ పాటు పడాల్సిన ఆవశ్యకతను, అవసరాన్ని నేర్చుకున్నారు.

భర్త కమ్యూనిస్ట్ అయినా తను భర్తకు పూర్తి సహకారం అందిస్తూనే తను మాత్రం హిందూ సంప్రదాయానికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అనేక కార్యక్రమాలు చేసారు.

పద్మనాయకులు చేసే పూజలు, వేడుకలు, సంప్రదాయ వ్రతాలు అన్నీ ఎంతో నిష్ఠతో చేసేవారు. అందులో ముఖ్యంగా ఏకాదశి వ్రతాలు, బతుకమ్మ పండుగ, వినాయక చవితి, సంక్రాంతి లాంటి పండుగలను ఎంతో భక్తి శ్రద్ధలతో చేసుకునేవారు.

శ్రావణమాసంలో తదియ తిథి రోజున శ్రావణ నోముల పేరిట గౌరమ్మ నిలుపుకొని ఐదు వారాలు ఉపవాసాలు ఉండి ఎంతో శ్రద్ధతో ఈ నోములు నోముకునేవారు. తులసి తల్లికి పెళ్ళి చేయటం, లక్షవత్తుల నోములు వీరికి చాలా ఇష్టం. కుల గురువులను ఎంతో గౌరవించేవారు. వీరు అనేక పురాణ కాలక్షేపాలు, భారత, రామాయణ విశేషాలు చెప్పించుకునేవారు. వివిధ శాస్త్రాలలోని ధర్మ శాస్త్రాలను తెలుసుకునేవారు.

ఇంటికి వచ్చిన మహిళలను పసుపు కుంకుమలతో వాయనం సమర్పిస్తూ ఉండేవారు. మహిళలకు, వారింటికి వచ్చిన అతిథులను తప్పకుండా సత్కరించి పంపిస్తూ ఉండేవారు.

## ఆంధ్ర మహాసభలు

***భారత భూమికి జ్యోతి - తెలంగాణా !***

***నవ భారత భూమికి నేత - తెలంగాణా !***

***పిలుస్తున్నది వేరొకబాటకు నేడు - తెలంగాణా !***

***విప్లవ సందేశాన్నందించే - వీర తెలంగాణా !***

మహాకవి మగ్దుం మొయినుద్దీన్

తెలంగాణాలో ఆంధ్రోద్యమం సాంస్కృతికోద్యమంగా ప్రారంభమై సంస్కరణోద్యమంగా రూపుదాల్చి అనేక రాజకీయ అంశాలను లేవనెత్తి 11వ ఆంధ్ర మహాసభ నాటికి (1944) అతివాద మితవాదుల మధ్య ఏర్పడ్డ విభేదాల వల్ల చీలి అతివాద వర్గం విప్లవోద్యమాన్ని నిర్మించి తెలంగాణా సాయుధ పోరాటాన్ని నిర్వహిస్తే మితవాదులు నైజాం రాష్ట్రం, భారత ప్రభుత్వంలో విలీనానంతరము అధికారాన్ని చేజిక్కించుకున్నారు.

**ప్రథమాంధ్ర మహాసభ 1930లో ప్రారంభమైనది.** ఆనాటికే 60 లక్షలకు మించి ఉన్న నిజాం రాష్ట్ర తెలుగు వారి కష్ట సుఖాలను తెలుసుకోవడానికి సమిష్టి అభిప్రాయాలను పంచుకోవడానికి తెలంగాణా అంతటికి ప్రాతినిధ్యం వహించే సంస్థగా ఆంధ్ర మహాసభ రూపుదిద్దుకొన్నది. ఈ సభలలో రాజకీయాలు చర్చించకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి తీర్మానాలను చేస్తూ ఆ తీర్మానాలను అమలు చేయాలని నిజాం ప్రభుత్వాన్ని ప్రార్థిస్తూ వచ్చారు.

మొట్టమొదటి ప్రథమాంధ్ర మహాసభను జోగిపేటలో నిర్వహించారు. సాంస్కృతికంగా, భాషాపరంగా నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన తెలంగాణా ప్రజల్లో నీలగిరి, తెనుగు, గోలకొండ పత్రికలు ఈ సభలను గూర్చి ప్రచారం చేసి ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నూతన ఉత్సాహాన్ని కలిగించాయి.



నిజామాబాద్‌లో 2వ సభ దేవరకొండ, 3వ సభ ఖమ్మం, 4వ సభ సిరిసిల్లలో, 5వ సభ షాద్‌నగర్, 6వ సభ, 7వ సభ మల్కాపురంలో, 8వ సభ చిలుకూరులో, 9వ సభ ధర్మవరంలో, 10వ సభ హైదరాబాద్‌లో, 11వ సభ భువనగిరిలో, 12వ సభ ఖమ్మంలో, 13వ సభ మెదక్ జిల్లాలోని కందిలో, 14వ సభ మహబూబ్‌నగర్ జడచర్లలో జరిగాయి.

ఈ మహాసభలు ప్రజలలో చైతన్యస్ఫూర్తిని, విప్లవ భావావేశాన్ని కలిగించాయి. ఈ మహాసభలలో వితంతు వివాహం, బాల్య వివాహ నిషేధ చట్టం మొదలైన వాటిపై జరిగిన వాదోపవాదాలున్నాయి. కొన్నిసార్లు ఓటింగ్‌లు కూడా నిర్వహించారు. ఈ సభలు ప్రజల్లో చైతన్యం కలిగించినందువల్ల ప్రతి సభలోనూ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆంధ్ర మహా సభలు తెలంగాణా ప్రజల్లో కలిగించిన రాజకీయ స్పృహ, దేశభక్తి భావన ఎంతో గొప్పది. ఈ ఉద్యమం ఒక దివిటీలాగా భవిష్యత్ ఉద్యమాలకు మార్గం చూపించింది. ఆంధ్ర మహా సభలు తెలంగాణా సర్వతోముఖ వికాసానికి, విజ్ఞానానికి, ప్రజా చైతన్యానికి దోహదం చేసాయి. అనేక రైతు సమస్యలు ఈ సభల చర్చల్లో వచ్చాయి. తరువాత రైతులే స్వయంగా పాల్గొని సాయుధ పోరాటానికి తీర్మాణం చేసేటంత చైతన్యం కలిగించాయి.

తెలంగాణా ప్రజలు స్వేచ్ఛగా వారి ఆకాంక్షలను, కోరికలను, సంస్కృతిని వెల్లడించుకునే చక్కని అవకాశం ఈ మహాసభలు కల్పించాయి. ఉర్దూను నిర్బంధ రాజభాషగా తెలంగాణా ప్రజలపై నిజాం రుద్దితే తెలంగాణా ప్రజల భాషలో ఉపన్యాసాలు, తీర్మాణాలు, సభలు, సమావేశాలను ఆంధ్ర మహాసభ నిర్వహించింది. తమ మాతృభాషనే బోధనా భాషగా ఉండాలని ఆశించారు.

1929 - 1942 వరకు వివిధ ప్రాంతాల్లో మహిళా సభలు ఆంధ్ర మహాసభలతో పాటు నిర్వహించబడినాయి. ఈ ఉద్యమాల్లో స్త్రీలు 12 మహిళా సంఘాలను నిర్వహించి, స్త్రీ జనోద్ధరణకు పాటుపడ్డారు.

### ఆంధ్ర మహాసభలు - స్త్రీల సభలు :

సూర్యాపేటలో 1927 వైశాఖ 9, 10, 11 తేదీలలో స్త్రీల సమావేశాలు బాలికల పాఠశాలలో శ్రీమతి జనక నందన బాయి అధ్యక్షతన గ్రామంలోని వైశ్య, ఇతర

కులముల స్త్రీలు 100 పైగా హాజరైనారు. శ్రీమతి లక్ష్మీ నరసమాంబగారు 1 1/2 గం. పాటు స్త్రీ విద్య, గృహిణి ధర్మములు, శిశు పోషణ, అతిధి సత్కారం, పతి భక్తి గురించి ప్రసంగించారు. రెండవరోజు నుండి మూడవరోజు నాటికి స్త్రీల సంఖ్య రెండు వందలకు పెరిగినది. చందనబాయి గారు విద్యార్థినులచే మృదుమధుర అభినయ రూపకముగా గీతాలు పాడించిరి. ప్రధానోపాధ్యాయురాలు తిరునగరి వేంకట నరసమ్మగారు బాలికలతో కోలాటం వేయించిరి.

ప్రతి శుక్రవారం స్త్రీల సభ జరగాలని, గ్రంధాలయం నుండి స్త్రీల కావశ్యకమగు గ్రంధములను తెప్పించి వానిని బోధించిన కొలది కాలంలోనే స్త్రీలు విద్యావంతులవు తారని తీర్మానించబడినది.

జోగిపేటలో 1930 మార్చి 3, 4 తేదీలలో జరిగిన మహిళా సభకు శ్రీమతి నడింపల్లి సుందరమ్మ గారు, రెండవ నాటి సభలో డాక్టరు చంద్రమతిదేవి గారు ఉపన్యాసాలు ఇచ్చారు. ఆహ్వాన సంఘాధ్యక్షులు విఠోబాయి గారు.

నడింపల్లి సుందరమ్మగారు వారి ఉపన్యాసంలో స్త్రీ విద్య ప్రాముఖ్యం, సంగీతం, కుట్టుపని, చిత్రకళ, ఆరోగ్యశాస్త్రం, గృహ నిర్వహణ ప్రాధాన్యతను, పాకశాస్త్రం, శిశు పోషణ భక్తిమార్గమును నేర్పే పాటలు, పద్యములు, గ్రంథములు నేర్పించాలని ఉపన్యసించారు. అతి బాల్య వివాహాలను, హేయమైన వ్యభిచార వృత్తి వలన నష్టములు, వితంతు వివాహములను గురించి కూడా వీరు ప్రసంగించినారు. నగలకై భర్తలను వేధించక విద్యా విభూషి కావలెనని ప్రసంగించారు.

**1931 మార్చి 3, 4, 5 తేదీలలో దేవరకొండ** : కరీంనగర్ జిల్లాలోని కమలాపురం నందలి ఒక వైదిక కుటుంబంలో జన్మించిన శ్రీమతి టి. వరలక్ష్మమ్మ గారు అధ్యక్షులుగా ఉండిరి. వీరి భర్త టి. రామారావు గారు. వీరు చాలాకాలం కరీంనగర్‌లో నివసించిరి. వీరికి వైద్యం బాగా వస్తుంది. వీరు ప్రసవ సమయంలో అందరికి సేవ చేస్తుండిరి. వీరు కరీంనగర్ నుండి వచ్చి హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్నారు. వీరు ఆంగ్ల, ఆంధ్ర, కర్ణాటక భాషలలో మంచి ప్రావీణ్యం ఉన్న విదుషిమణి. వీరు ఇంగ్లీషులో అనువంశికం, తెలుగులో శిశురక్షణ, యావత్ ఆరోగ్య విధులు అనే పుస్తకాలను వ్రాసారు. స్వాగతోపన్యాసం పి. సత్యవతిబాయి గారు చేశారు.



అధ్యక్షులు టి. వరలక్ష్మమ్మ గారు స్త్రీవిద్య, ధర్మమార్గం, శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవటం, సాంకేతిక విద్య ఆవశ్యకత, పరదా పద్ధతి విడనాడాలని, వ్యభిచార వృత్తిని విడనాడాలని ప్రసంగించారు. వీటికి హాజరైన ఇతర మహిళా ప్రముఖులు నడింపల్లి సుందరమ్మ, మాడపాటి మాణిక్యమ్మ, సంగెం వేంకట రమణమ్మ, గాడేపల్లి సత్యవతీ దేవి గార్లు.

**తృతీయ మహాసభ 13, 14, 15 డిసెంబర్ 1934, ఖమ్మం** : సుప్రసిద్ధ విదుషీమణి, కవయిత్రి, ఉభయ భాషా ప్రవీణ యగు చాత్రాతి లక్ష్మీ నరసమాంబ గారు ఆహ్వాన సంఘ అధ్యక్షులు. సభ సుమారు మూడు వేలమంది స్త్రీలలో క్రిక్కిరిసింది. బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు స్వచ్ఛంద సేవికలుగా పనిచేసారు. అధ్యక్షురాలు స్త్రీ విద్యా ప్రాధాన్యం గురించి చక్కగా వివరించిరి. రెండవనాడు ఎల్లాప్రగడ సీతాకుమారి గారు అధ్యక్షోపన్యాసం చేసారు. అనేక కళలలో నైపుణ్యం సాధించాలని, సంఘ సంస్కరణ, దేశసేవలో, ధర్మకార్యాలలో పురుషులతో సమానంగా ముందుండాలని స్త్రీలకు సందేశం ఇచ్చారు. ఉపాధ్యాయినులను తయారు చేయాలని, గృహ పరిశ్రమలలో వృత్తి శిక్షణా నైపుణ్యంను సాధించాలని, మతం గురించి తెలుసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మూఢ నమ్మకాలను విడిచిపెట్టాలని, ఆర్థికంగా నిలదొక్కుకోవాలని వారు ఉపదేశించారు.

వీర నారీమణుల గురించి తెలుసుకొని అధ్యయనం చేయాలని, వేదకాలంలో స్త్రీలు సర్వస్వతంత్రులని, గార్గి, సులభ, బడబ, మైత్రేయి, సరసవాణి మొదలైన విదుషీమణులు వేదాంతములందు అపారజ్ఞానం నార్జించి బ్రహ్మజ్ఞాన చర్చల యందు మహాపురుషులతో సమంగా వాదించెడివారు. విశ్వల, ముద్గలాని అనే వీర వనితలు ఋగ్వేద కాలమున అఖండమగు కీర్తిని గడించారు మరియు లీలావతి యను విదుషీమణి గణిత శాస్త్రమును, ఖనాదేవి జ్యోతిశ్శాస్త్రమును, లక్ష్మీదేవి న్యాయశాస్త్రమును రచియించి స్త్రీలు కూడా సర్వ విద్యలయందు పురుషులతో సమానమని నిరూపించిరి. బౌద్ధమతాన్ని అశోకుని అంతఃపుర స్త్రీలు కూడా ప్రచారం చేసారని చెప్పి సభా ప్రాంగణంలోని మహిళలకు ఉత్తేజం కలిగించారు.

ఈ సభలో అనేక తీర్మానాలు కూడా ఆమోదించబడినవి. మూడవరోజు కూడా జీవహింస గురించి అరిగే లలితాదేవి, పద్మాబాయి గారు ఉపన్యసించిరి.

మద్యపాన నిరసనమును గురించి వడ్లకొండ ఇందిరాదేవి గారు గంభీరముగా నుపన్యసించారు.

**చతుర్థ ఆంధ్ర మహాసభ సిరిసిల్ల : 26, 27, 28 జనవరి 1935 :** ఆహ్వాన సంఘ అధ్యక్షులు జోగినేపల్లి రాధాబాయమ్మ గారు, శ్రీమతి జె. వేంకట మంగాబాయి గారు (సిరిసిల్ల ఉపాధ్యక్షులు), శ్రీమతి కొడిమేల లలితాకుమారి (సిరిసిల్ల కార్యదర్శి), ఆర్. అనంత లక్ష్మీబాయమ్మ (సిరిసిల్ల సహాయ కార్యదర్శి) గారు, శ్రీమతి ఇరుకు భ్రమరాంబగారు (కోశాధ్యక్షురాలు).

పాలక సభ్యురాండ్రు :

శ్రీమతి అవునూరి వేంకటలక్ష్మి, కల్వకుంట్ల సరస్వతి గార్లు.

31 డిసెంబర్ 1935 నాడు మధ్యాహ్నము ఒంటి గం. వేళ ఐదువేల స్త్రీలచే కిక్కిరిసి ఆ సభ ఉన్నది.

శ్రీమతి జోగినిపల్లి రాధాబాయమ్మ ఉపన్యాసం చేశారు. వీరు కీ.శే. జె.వి. నర్సింహారావు (ఉపముఖ్యమంత్రి) సతీమణి.

మాడపాటి మాణిక్యమ్మగారు అధ్యక్షోపన్యాసం చేసి అనేక ప్రతిపాదనలను ఆమోదించినారు.

1. మాతృభాష ద్వారా ఉన్నత విద్య, 2. స్త్రీ వారసత్వపు హక్కు, 3. నిర్బంధ విద్య, 4. అస్పృశ్యతా నివారణ, 5. వైద్య సహాయం, 6. మధ్యపాన నిర్మూలనం, 7. కన్యావిక్రయ వరశుల్కముల నిరసన, 8. గోషా పద్ధతిని తొలగించుట, 9. గృహ పరిశ్రమలు, 10. మంత్రసానుల శిక్షణ, 11. వితంతు శరణాలయము, 12. అతి బాల్య వివాహ నిషేధం వంటి తీర్మాణాలను చేసి ఆమోదింపచేసుకున్నారు.

1936లో సిరిసిల్లలో జరిగిన మహాసభ ప్రాధాన్యం సంతరించుకున్నట్టిది. ఆవునూరు వేణుగోపాలరావు గారు అధ్యక్షులుగా, కొడమేల భూమయ్య గారు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆహ్వాన సంఘం జిల్లాలో యువతను, దేశభక్తులను, విద్యావంతులను బాగా ఆకర్షించింది. మాడపాటి హన్మంతరావు గారు అధ్యక్షులుగా వారి సతీమణి శ్రీమతి మాడపాటి మాణిక్యమ్మ గారు మహిళా విభాగ అధ్యక్షురాలిగా చక్కని సందేశాలు ఇచ్చారు. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, రైతు రక్షణకు సంబంధించి



తీర్మానాలు ఆమోదించబడ్డాయి. వందలాది కార్యకర్తలలో ప్రజలలో ఒక జాగృతిని కలిగించింది. చైతన్యాన్ని రగులుకొలిపింది. అప్పుడు పన్నెండు సం. వయస్సు కలిగిన రాజేశ్వరరావు గారు స్వచ్ఛంధ సేవకుడిగా పెద్దలకు సేవలందించే అవకాశం ఏడు సం. బాలికగా లలితాదేవిగారికి మహిళా కార్యకర్తలకు సేవ చేసే అవకాశం లభించింది.

లలితాదేవి గారు వారి సోదరీమణులతో, ఇతర మహిళా కార్యకర్తలతో, మిత్రులతో కలిసి సభకి విచ్చేసిన మహిళా మణులకు సేవచేసారు. చిన్న పిల్లలుగా అది ఒక పండుగ, ఒక వినోదం జరుగుతున్నట్లుగా ఉత్సాహంగా ఎంతో సేవలు చేశారు. ఆ కార్యక్రమ ఉద్దేశం తెలియనప్పటికి ఆ పనిలో ఎంతో ఆనందాన్ని ఆత్మ తృప్తిని పొందినారు లలితాదేవి గారు.

లలితాదేవి గారికి నాటి మధురస్మృతులు నేటికి చెక్కు చెదరలేదంటే ఆశ్చర్యమే. మరి ఆనాటి కార్యక్రమాలు అంత గొప్పగా ఉండేవి. అందరూ ఎంతో ఉత్సాహంతో పని చేసేవారు. ఈ అవకాశం లభించడం అదృష్టంగా భావించేవారే.

**ఐదవ మహిళాసభ 16 డిసెంబర్ 1936 బుధవారం ఉ. 11 గం.లకు షాద్‌నగర్:** నాలుగైదు వందల ప్రతినిధులు వచ్చారు. శ్రీమతి రాధాబాయి గారు ఆహ్వాన సంఘాధ్యక్షురాలు ఉపన్యాసం చదివిరి. అందులో స్త్రీలకు వ్యాయామ శిక్షణ అవసరమని, స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని, పరదా పద్ధతి విడనాడాలని, స్త్రీల ఆరోగ్యం గురించి స్త్రీలు వైద్యవృత్తి అవలంభించాలని ప్రస్తావించారు.

అధ్యక్షులుగా శ్రీమతి బూర్గుల అనంతలక్ష్మీదేవి గారు అధ్యక్షోపన్యాసం చేస్తూ స్త్రీలు సమావేశాలు జరుపుకోవడానికి మహిళా సభలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి గ్రామానికి ఒక సంఘం ఉండాలని, ఈ సమావేశాలలో పత్రికలు చదివి వినిపిస్తూ తోటి మహిళలలో ఉత్సాహాన్ని, ప్రేరణను తేవాలని, స్వయంకృషితో అభివృద్ధి చెందాలని, అతి బాల్య వివాహాలు రూపు మాపాలని, స్త్రీ మరణాలను అరికట్టాలని, పల్లెటూర్లలో పాఠశాలలు, వైద్యశాలలు నిర్మించాలని, ప్రారంభవిద్య నిర్బంధంగా ఉండాలని, మధ్యపాన నిర్మూలనం చేయాలని, అస్పృశ్యతను నివారించాలని, ప్రసవశాలలను ఏర్పాటు చేయాలని, మంత్రసానులకు సరైన శిక్షణ ఉండాలని, స్త్రీ వారసత్వపు హక్కులు కాపాడాలని, వితంతు శరణాలయాలను స్థాపించాలని, బహు భార్యత్వ నిరసన

తెలియజేయాలని, కన్యావిక్రయ, వరశుల్కముల నిర్మూలనకు ప్రచారం చేయాలని, పరిశ్రమలు ప్రతి ఇంటా నెలకొల్పాలని అన్నారు.

**ఆరవ నిజాం రాష్ట్రాంధ్ర మహిళా మహాసభ నిజామాబాదు : 7, 8 డిసెంబర్ 1937 :** శ్రీమతి నందగిరి ఇందిరాదేవి అధ్యక్షతన జరిగినది. ఆరు, ఏడు వందల ప్రతినిధులు మూడువేల మంది ప్రేక్షకులు ఉన్నారు. ఉన్నతవిద్య, మాతృభాషలో విద్యాబోధన, బాలికల ఉన్నత పాఠశాల నిర్బంధోచిత ప్రారంభ విద్య, సంయుక్త విద్య, భిన్న విద్యా ప్రణాళిక, సాంఘికావసరములు, మద్యపానము, శారదా చట్టం, వితంతు వివాహం, బహు భార్యాత్వము, శుల్కములు, వేశ్యావృత్తి, అస్పృశ్యత, భిక్షావృత్తి, ప్రసవశాలలు, ఆరోగ్యపోటీ, శాసనసభా సభ్యత్వం వీటన్నిటిపై తీర్మాణాలు జరిగాయి.

**లలితాదేవి వివాహం - రాజేశ్వరరావు గారి ప్రభావం :**

గౌర్నేని రాంగోపాలరావు గారు తన మేనల్లుడు నడుపుతున్న విద్యార్థి ఉద్యమాలు, కమ్యూనిస్ట్ కార్యకర్తగా వారు సమాజానికి చేస్తున్న సేవ, తన తల్లిదండ్రులను, అతి విశాలమైన తన కుటుంబాన్ని గుంబనంగా సాగతీస్తున్న విధానం, దేశంపట్ల ప్రేమ, తల్లిదండ్రుల ఎడల అనురాగం, కుటుంబం పట్ల బాధ్యత వహిస్తూ ఇంటికి పెద్దకొడుకుగా రాజేశ్వరరావు గారు చూపుతున్న ప్రతిభకు ముగ్ధులై తన పెద్ద కూతురు లలితాదేవిని తన ముద్దుల గారాల పట్టిని ఇచ్చి వివాహం చేస్తే బాగుంటుందని నిశ్చయించారు.

కాని బంధువులందరు ఇల్లు టికానా లేనివాడు, ఇంకా జీవితంలో ప్రయోజకుడు కాలేదు, ఉద్యమాలంటూ దేశం పట్టుకు తిరుగుతున్నాడు. కుటుంబాన్ని, భార్యను పోషిస్తాడో లేదో అని బంధువులంతా నివారించారు, నచ్చచెప్పారు.

కాని రాంగోపాలరావు గారికి తన మేనల్లుడిపై అచంచల విశ్వాసం. నిస్వార్థ సేవతో, దేశభక్తితో తన మాతృభూమికి చేస్తున్న సేవను చూసి అతడు తప్పకుండా ప్రయోజకుడవుతాడు. ముందు ముందు గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటాడని అకుంఠిత విశ్వాసం కలిగిన రాంగోపాలరావు గారు తన అభిప్రాయాన్ని లలితాదేవికి తెలియజేశారు. లలితాదేవి గారు కూడా అప్పటికే తన బావపై ఎంతో ప్రేమ, అనురాగం పెంచుకున్నారు. నాన్నగారు తన అభిప్రాయం అడగగానే మరో ఆలోచనకు తావు లేకుండా వెంటనే రాజేశ్వరరావు గారిని వివాహం చేసుకోవడానికి ఒప్పేసుకున్నారు.



కాని ముందు ముందు జరగబోయే సంఘటనలను ఏ మాత్రం ఊహించలేదు. దేశభక్తుడికి జీవిత భాగస్వామి కావడం తన అదృష్టంగా భావించింది. మనసా, వాచా, కర్మణా తన భర్తను ఆరాధించింది, ప్రేమించింది. వారి ఉద్యమాలకు బాసటగా నడిచింది.

లలితాదేవి గారి అంగీకారంతో వీరి తండ్రిగారు రాంగోపాల్ రావు గారు చెన్నమనేని రాజేశ్వరరావు గారితో వీరి వివాహాన్ని 16 సం.లకే 1944లో అంగరంగ వైభవంగా ఐదురోజుల వివాహ కార్యక్రమాన్ని నడిపించారు.

అప్పుడే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న రాజేశ్వర రావు గారు వేసవి సెలవులలో పెళ్ళి కొడుకుగా మేనమామ కుమార్తె లలితాదేవి గారిని వివాహం చేసుకోవడానికి బయలుదేరారు. మేనమామ కూతురే కాబట్టి పెళ్ళి చూపుల తతంగం, ఆర్భాటాలు లేకుండా పెళ్ళి నిశ్చయం జరగడం, వీరితో పాటు రాజేశ్వర రావుగారి సోదరి కీ.శే. యశోద గారి వివాహం కూడా జరిగింది.

రాజేశ్వరరావు గారు పెళ్ళికొడుకుగా వారి అత్తవారి గ్రామం వేములవాడకు పల్లకిలో వెళ్ళారు. గ్రామం ప్రక్కనే వున్న మూలవాగులో 'ఎదురుకోలు' తతంగం జరిగింది. తరువాత ఐదురోజుల వివాహం అత్యంత వైభవంగా జరిగింది.

రాజేశ్వరరావు గారు పెళ్ళి అయిన మొదటిరోజే భార్య అయిన లలితాదేవి గారితో ఆనాటి రాజకీయ పరిస్థితి, వారి రాజకీయ భవిష్యత్తు, అప్పటి దేశకాల పరిస్థితులు, వారు చేస్తున్న ఉద్యమ కార్యక్రమాలు, అందులోని స్థిర, అస్థిర పరిస్థితులు, నాటి వాస్తవ పరిస్థితులను విపులంగా వివరించారు. అలాగే భార్యగా, సహధర్మచారిణిగా, ఆమె వారికి అందించాల్సిన సహాయ సహకారాలు, కుటుంబ బాధ్యతలను పంచుకునే విధానం, అన్నీ లలితాదేవికి స్పష్టంగా వివరించారు. జీవిత భాగస్వామి భర్త వెన్నంటి ఉండి తోడు నీడగా, భార్యగా, తల్లిగా, భూదేవిలా గొప్ప క్షమాగుణంతో ఉండాలని వివరించారు.

రాజేశ్వరరావు గారి మాటలు విని లలితాదేవి గారు ఎలాంటి ఆందోళన, నిరాశ, నిస్పృహలకు లోనుకాలేదు. ఒక స్వాతంత్ర్య సమరయోధునికి భార్యగా తన కర్తవ్య

నిర్వహణ భారాన్ని మోయగలనని, ఎలాంటి అనుమానాలు లేకుండా నిశ్చింతగా ఉండవచ్చును అని భర్తకు చెప్పింది. భర్త నిరాడంబరత్వం, వాస్తవాలను నిజాయితీగా చెప్పిన తీరుకు లలితాదేవి ధర్మపత్నిగా ఎల్లవేళలా వారి వెంటే ఉంటానని, అవే తనకు సంతోషం, సౌభాగ్యం అని సంతోషంగా వాగ్దానం చేసారు.

ఎన్నో ఆశలు, కోరికలతో ఉండాల్సిన నవవధువు తన భర్త ఉద్యమంలో ఒక సమిధగా మారతానని అన్నప్పుడు లలితాదేవి గారు ఎంతో గర్వంగా ఒప్పుకోవడం మన అందరికి గర్వకారణం. వీరిలో ఆనాడు వీరనారి ఝాన్సిలక్ష్మిబాయి, వెలాడి చెన్నమ్మ, రాణి రుద్రమ్మ కనిపించారు రాజేశర్వరరావు గారికి.

రాజేశ్వరరావు గారు స్త్రీ స్వేచ్ఛ, స్త్రీకి సమానత్వం, స్త్రీ స్వాతంత్ర్యాన్ని మనసారా కోరుకునే వారు. లలితాదేవిని కూడా ఒక పవిత్రమైన స్త్రీగానే భావించి, వారి స్వేచ్ఛకు భంగం కలగకుండా వారి ఆశయం, ఆలోచన, వారి వ్యక్తిత్వానికి ఆటంకం కలగకుండా, తాను ఉన్న పరిస్థితులను, తాను చేపట్టబోయే కార్యక్రమాలను, తన భవిష్యత్తును ఉన్నది ఉన్నట్లుగా, నిజాయితీగా పెళ్ళినాటినుండే భార్యకు ఎలాంటి పురుషాధిక్య అహంకారం లేకుండా లలితాదేవికి వివరించినందుకే, ఆమెపై తనకు ఉన్న గౌరవాన్ని వెల్లడిస్తూనే తన మనోభావాలను వ్యక్తీకరించటం వల్లనే ఈనాటికి 70 సం. గడిచిన తర్వాత కూడా వారి దాంపత్య జీవితం అన్యోన్యంగా ఉండేది, అంటే వారి మధ్య ఉన్న పరస్పర ప్రేమ, అవగాహన, గౌరవమే కారణం కావచ్చు.

నా భార్య కాబట్టి నేను చెప్పిందే వేదం, విని తీరాల్సిందే అని రాజేశ్వరరావు గారు ఏనాడు లలితాదేవిని బలవంతం చేసిన సంఘటన ఒక్కటి కూడా మనకు కనిపించదు.

వారి వెంబడే అడుగులో అడుగై వారు ముందుకు పయనించిన 94 సం. జీవనం మనం గ్రహించగలుగుతాము. వీరి వివాహబంధం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం, అనుభవసారం, ఆదర్శవంతం కావాలి.

వీరి వివాహం జరిగిన 1944 సం. దేశం ఎన్నో సమస్యలతో అట్టుడికి పోయింది. బెంగాల్‌లో భయంకరమైన కరువు తాండవించినది. తీవ్రమైన ఆహార కొరత, పండిన పంటను దాచిపెట్టి కృత్రిమ కరువు సృష్టించిన కారణంగా, అమాయక ప్రజలు 35 లక్షల మంది స్త్రీ, పురుషులు, పిల్లలు ఆకలితో అలమటించి ప్రాణాలు కోల్పోవటం అనేది జాతి చరిత్రలోనే ఒక మరుపురాని విషాద పర్వం. అంతకు మించి ఘోర ఆకృత్యం ఉండదు. ఆనాటి సంఘటనలు గుండెను కర్కశంగా మెలిదిప్పేవి.



కరువు బారిన పడి మెతుకు గింజలు కరువై, జానెడు పొట్టకోసం నిర్ధాక్షిణ్యంగా కన్నపిల్లలనే అమ్ముకోవాల్సిన పరిస్థితి. ప్రేమ, మమతానురాగాలను బలవంతంగా అణిచిపెట్టి కన్నపిల్లలు అనే కారుణ్యం లేకుండా వారిని అమ్ముకున్నారంటే కరువు ఎంతగా విలయతాండం చేసిందో తెలుసుకోవచ్చు. కృత్రిమ ఆహార కొరత సృష్టించిన దళారులను, వారిని రక్షిస్తున్న బ్రిటీష్ సామ్రాజ్య పరిపాలకులను తుదముట్టించడమే ఒకే ఒక మార్గమని దృఢ నిశ్చయంతో దేశంలోని దేశభక్తులు చైతన్యవంతులై ఉద్యమించారు.

కరువు దాని పరిణామాల గురించి ఆనాడు పత్రికలలో వచ్చిన వార్తలు, కథనాలు యువతరాన్ని తట్టిలేపినాయి. దీంతో దేశం నలుమూలల నుండి వేలాది మంది యువతీ యువకులు స్వచ్ఛంద సేవకులుగా కదిలి అనాథలుగా, అన్నార్తులుగా, అభాగ్యులుగా మారిన కలకత్తా పరిసర ప్రాంతాల ప్రజలను అక్కున చేర్చుకొని వారికి సేవలందించారు.

తెలంగాణా ప్రాంతం నుంచి కూడా కరీంనగర్ జిల్లాకు చెందిన బీడి కార్మిక నాయకులు, మల్లారం గ్రామస్థులు బి. నారాయణ గారి దళం బొంబాయి నుండి కలకత్తా వెళ్ళి వారు చేసిన సేవలు ఎప్పటికి పేర్కొనదగినవి.

కులం, రంగు, ప్రాంతం, దేశం, మతాలకు సంబంధం లేకుండా కష్టాలు వచ్చినప్పుడు మానవులంతా స్పందించే తీరు ఒక గొప్ప మరువలేని అనుభవం, అద్భుతమైన సంఘటన కూడా ! ఇదే మానవుల గొప్పతనం.

అప్పుడే ఇంకొక సంఘటన కూడా జరిగింది.

గొప్ప శాస్త్రవేత్త, మహా మేధావి, గణిత ఉద్దండుడు సర్ సి.వి. రామన్ గారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉపన్యాసం ఇవ్వడం. గొప్ప శాస్త్రవేత్త. నోబుల్ గ్రహీత. వీరి ఉపన్యాసాన్ని వినడానికి విద్యార్థిలోకం అంతా తరలి రావడం, సర్. సి.వి. రామన్ గారు చేసిన సుదీర్ఘ ఉపన్యాసం రాజేశ్వరరావు గారిలో గొప్ప ప్రేరణను కలిగించటం,

రాజకీయాలపై వారి అభిప్రాయాలను తెల్సుకోవడం జీవితంలో మరిచిపోలేని సంఘటన.

మరొక మరుపురాని సంఘటన. ఆకాలంలో ఉర్దూలోనే విద్యాభ్యాసం చేయాల్సి ఉండేది. ఉర్దూమీడియంలో మాత్రమే బోధన చేసేవారు. తెలుగులో మాట్లాడటం ఒక నామోషి, ఒక చిన్నతనంగా భావించేవారు. అప్పుడు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగుశాఖ ఉండేది దానికి రాయప్రోలు సుబ్బారావు గారు అధిపతి కాగా, సహాయకులుగా ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు ఉండేవారు. చాలా తక్కువ సంఖ్యలో పదుల సంఖ్యలోనే విద్యార్థులు తెలుగు భాషను తమ రెండో ప్రాధాన్యతగా నేర్చుకునేవారు.

రాజేశ్వరరావు గారు సైన్సు విద్యార్థి అయినా భాషాభిమానంలో తెలుగు విద్యార్థులతో కలిసి ఒక తెలుగు విద్యార్థి సంఘం ఏర్పాటుకు ఆలోచన చేసారు. వీరికి అత్యంత ప్రియమిత్రులైన శీలం సిద్ధారెడ్డి గారి సహాయ సహకారాలతో తెలుగు విద్యార్థి సంఘానికి ఏర్పాట్లు జరిగాయి. దానికి రాజేశ్వరరావు గారు అధ్యక్షులుగా శీలం సిద్ధారెడ్డి గారు కార్యదర్శిగా, తెలుగుకు సంబంధించి కార్యక్రమాలను ప్రారంభించడం, చర్చాగోష్టుల ద్వారా భాషా ప్రాధాన్యత గురించి సమావేశాలు ఏర్పాటు చేసి వ్రాత పత్రికల ద్వారా, ఉపన్యాసాల ద్వారా తెలుగు భాష గురించి చర్చలు జరిపేవారు.

ఈవిధంగా భాషాభివృద్ధికై అనేక కార్యక్రమాలను జరుపుతుండేవారు. అధికారుల సహకారం లేకుండా, ఎవరి ప్రోత్సాహం లేకుండా ఇలాంటి కార్యక్రమాలు చెయ్యాలంటే చాలా గుండె ధైర్యం ఉండాలి. సాహసమే ఊపిరిగా వుండాలి. వీటన్నిటికి లలితాదేవి గారి సహకారం మరువలేనిది. ఎన్నో సలహాలు సూచనలు ఇచ్చేవారు.

ఇలాంటి అనేక కార్యక్రమాలతో వీరి వివాహం జరిగిన సంవత్సరం గడిచిపోయింది.

ప్రతి విషయాన్ని రాజేశ్వర రావు గారు లలితాదేవితో చర్చించేవారు. ఒక భార్యగా, ఒక స్నేహితురాలిగా, ఒక అనుచరణిగా వారి సలహాలు, సంప్రదింపులను నిండు మనస్సుతో స్వీకరించేవారు.



ఈ చర్చల ద్వారా స్వాతంత్ర కాంక్ష లలితాదేవిలో కూడా చిగురు వేయడం ప్రారంభించింది. వీరుకూడా ఆనాటి వార్తాపత్రికలు, దిన, వార, మాస పత్రికలను శ్రద్ధగా చదివేవారు. తన తోటి స్నేహితులతో, సోదర సోదరీమణులతో చర్చించేవారు.

ఎందరో త్యాగధనుల ఉపన్యాసాలు విని ఆకళింపు చేసుకునేవారు. మనసులో మేధోమథనం చేసేవారు. ఈవిధంగా వీరికి స్వాతంత్ర్య కాంక్ష నరనరాన జీర్ణించుకుపోయింది.

రాజేశ్వరరావు గారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్న కారణంగా లలితాదేవి గారిని కాపురానికి తీసుకొని వెళ్ళలేదు. లలితాదేవి గారు తన పుట్టినిల్లైన వేములవాడలోనే ఉన్నారు. రావు గారు సెలవు దినాలలో, ఇతర ఉద్యమ కార్యక్రమాలలో తరుచుగా వస్తూ పోతూ లలితాదేవి గారితో వారి అనుభవాలను పంచుకుంటూ ఉండేవారు. ఎన్నో విషయాలను పరస్పరం చర్చించు కునేవారు, మరెన్నో వాదోపవాదాలు చేసుకుంటునే వారు చర్చల ద్వారా లలితాదేవి గారితో రావు గారు దేశ కాల పరిస్థితులను అవగాహన పెంపొందించుకోవడానికి లలితాదేవి గారికి ఒక చక్కటి అవకాశాన్ని ఇస్తూ ఉండేవారు. ఉత్తరాల ద్వారా కూడా వీరిలో ఆనాటి పరిస్థితులపై అవగాహన కలిగిస్తూ ఉండేవారు.

ఈవిధంగా వీరు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూనే కుటుంబ బాధ్యతలను చక్కగా నెరవేరుస్తూ ఉండేవారు.

మరొక విషయాన్ని కూడా చర్చించుకోవాలి. **1930**లో కరాచీలో కాంగ్రెస్ సమావేశంలో పరిపూర్ణ స్వరాజ్యం కావాలని తీర్మానం చేస్తూ ప్రతి సంవత్సరం జనవరి **26** నాడు దేశ భక్తులంతా పరిపూర్ణ స్వరాజ్య సాధనకై ప్రతినబూనాలని పిలుపునివ్వడంతో దేశవ్యాప్తంగా దేశభక్తుల సమావేశాలు, సభలు ఏర్పాటు చేసుకుంటూ స్వరాజ్య సాధన కోసం ప్రమాణాలు చేసేవారు. ఈ స్వరాజ్య కాంక్షా ప్రమాణం హైదరాబాద్ సంస్థానంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కూడా చేయాలని కోరిక (ఆకాంక్ష)తో విద్యార్థి నాయకులంతా బహిరంగంగా ఈ కార్యక్రమాలు అసాధ్యమని భావించి, దగ్గరలోని అడవి ప్రాంతానికి వెళ్ళి స్వరాజ్య ప్రమాణాన్ని చేసి వీరి విధి నిర్వహణ గావించేవాళ్లు. జనవరి **26**వ తేదీనే ఎందుకు ఎంచుకున్నారు ? అని ప్రశ్నించుకుంటే సమాధానం తెల్సినవారు ఏ కొందరో.

అసలు కారణం ఏమిటంటే, భారత జాతీయ కాంగ్రెస్ దేశానికి సంపూర్ణ స్వరాజ్యం కావాలని తీర్మానించిన సందర్భంలో ఉరిశిక్షను ఎదుర్కోబోతూ భగత్‌సింగ్ జైల్లో ఉన్నాడు. జైల్లోంచే దేశ స్థితిగతుల్ని ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటున్న భగత్‌సింగ్ కాంగ్రెస్ నాయకత్వానికి ఒక ఉత్తరం రాయడం జరిగింది. సంపూర్ణ స్వరాజ్యం కేవలం ధనాఢ్య వర్గాల ప్రయోజనాలని రక్షిస్తుందా ? లేక రైతు కూలీల జీవిత సమస్యల్ని పరిష్కరిస్తుందా ? అంటూ ఉత్తరంలో ప్రశ్నించారు. వారిని ఉరి తీసిన తర్వాత వారి గదిలో దొరికిన కాగితాల్లో ఈ ఉత్తరం ఒకటి. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఈ ఉత్తరాన్ని శ్రద్ధగా భద్రపరిచారు. ఈ ఉత్తరం వ్రాసిన తేది జనవరి **26** కావడం ఇక్కడ ముఖ్య విశేషం. ఆ తర్వాత నెహ్రూ గారు గాంధీ గారితో కలిసి రాజ్యాంగబద్ధంగా జనవరి **26**వ తేదీన రిపబ్లిక్ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. ఈవిధంగా జనవరి **26**వ తేదిని రిపబ్లిక్ దినంగా జరుపుకోవడం అమరజీవి భగత్‌సింగ్‌కి దక్కిన అరుదైన అపూర్వ గౌరవం. ఈవిధంగా సమరయోధుడికి నివాళులర్పించే పవిత్ర కార్యం అది.

అదేవిధంగా **1946** రావు గారికి తీరని లోటు. శోకాన్ని మిగిల్చిన సం. విద్యార్థిగా, రాజకీయ బలాన్ని పెంపొందించుకుంటున్న సమయంలో వీరి జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసిన వీరి అక్క భర్త బావగారైన పోల్కంపల్లి వెంకట రామారావు గారు ఊపిరితిత్తులు, ఉదరకోశ వ్యాధితో కీర్తిశేషులయ్యారు. రావుగారు హైస్కూల్ విద్యార్థిగా **3**వ తరగతి నుండి **10**వ తరగతి వరకు వీరి బావగారైన పోల్కంపల్లి వారి ఇంట్లోనే ఉండి చదువుకున్నారు. వారు అడ్వకేటుగా పనిచేసేవారు. పట్టాపొంది ప్రాక్టీస్ చేస్తున్న వకీళ్లలో వీరు ప్రసిద్ధులు, మంచి మేధావి, గొప్ప వక్త. అడ్వకేట్‌గా చేరక ముందు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు పండిట్‌గా పనిచేసిన ఉత్తమ జ్ఞాన సంపన్నుడు, మేధావి. వీరు లోకజ్ఞానంతో పాటు పటిష్ఠమైన రాజకీయ పరిజ్ఞానాన్ని సంపాదించుకున్న దిట్ట. అప్పట్లో కరీంనగర్ జిల్లా ఆంధ్ర మహాసభకు కీ.శే. బద్దం ఎల్లారెడ్డి గారు కార్యదర్శిగా, పోల్కంపల్లి వారు అధ్యక్షులుగా కొనసాగుతుండేవారు. ప్రతి సంవత్సరం జరిగే ఆంధ్ర మహాసభలకు వారు గొప్ప అభ్యుదయ వాదిగా స్వాతంత్ర కాంక్ష కలిగిన నాయకుడిగా యువతకు ప్రేరణ ఇచ్చేవారు.



వీరు ప్రతిరోజు గోలకొండ పత్రిక, ఆంధ్ర పత్రికలతో పాటు 'హిందూ' ఆంగ్ల పత్రికను తప్పకుండా పఠించేవారు. స్థూలకాయుడై కాస్త బద్ధకంగా ఉండే వీరు చాలా పనుల కోసం రాజేశ్వరరావుపై ఆధారపడేవారు. హిందూ పత్రిక వార్తలు, సంపాదకీయాలను రాజేశ్వరరావు గారితో చదివించుకునేవారు. ఈ చదవడం భవిష్యత్ కాలంలో రాజేశ్వర రావు గారు సమకాలీలన సమస్యలు, సమాజంపైన ఒక సునిశిత అవగాహన, భవిష్యత్ కార్యాచరణాల పట్ల ఆలోచన, జిజ్ఞాస, ఆసక్తి, ఒక ఆలోచన, విప్లవాత్మక దృక్పథం మొదలైన అనేక ధోరణులు బాల్యావస్థలోనే ఏర్పడడానికి ముఖ్య కారణం పోల్కంపల్లి వారి సాహచర్య భాగ్యమే.

ఆ కాలం జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలలో కొత్త పరిణామాలు ఎదుర్కొంటున్న సమయం భారతదేశ రాజకీయాలలో మార్క్సిజం సిద్ధాంతంలో కమ్యూనిస్టులు రాజకీయ రంగ ప్రవేశం చేసిన రోజులు. బద్దం ఎల్లారెడ్డి (కమ్యూనిస్ట్) పోల్కంపల్లి (జాతీయవాది)గా వారి మధ్య ప్రతిదినం జరిగే ఆసక్తికరమైన చర్చలు, వాదోపవాదాలు వింటూ దేశాభిమానాన్ని, రాజకీయ చైతన్యాన్ని బాగా ఆకళింపు చేసుకొని, నరనరాన దేశభక్తిని నింపుకున్నారు రాజేశ్వరరావుగారు.

ఈవిధంగా రాజకీయాల పట్ల ఆసక్తి, రాజకీయ రంగ ప్రవేశం చేయటం దేశభక్తి పెంపొందించుకోవడం పోల్కంపల్లి వారి సహవాస కారణమే. నేటి గొప్ప రాజకీయ ఉద్ధండుడు, నిస్వార్థ జీవి, రాజకీయాలకు తాను నమ్మిన సిద్ధాంతాలకే జీవితాన్ని సమర్పణ చేసిన త్యాగజీవిగా రాజేశ్వరరావుగారు ఎదగడంలో పోల్కంపల్లి వారి పాత్ర మరువలేనిది.

దేశభక్త కొండ వెంకటప్పయ్య గారు ఒక వాజ్యంలో సాక్షి నిమిత్తం కరీంనగర్ వచ్చినప్పుడు వారిని కరీంనగర్ ఆంధ్ర మహాసభల కార్యకర్తల నుద్దేశించి మాట్లాడమని కోరుకున్నప్పుడు వారు ఎంతో వినయంగా ఒప్పుకోవడం, వెంటనే కార్యక్రమ ఏర్పాటు జరిగిపోయాయి. సిఖ్‌వాడాలో జరిగిన మహాసభలో విద్యార్థులతో పాటు ప్రజలు పాల్గొన్నారు. వారు వారి సుదీర్ఘ ఉపన్యాసంలో విద్యార్థి సంఘం, దాని ప్రాధాన్యత గురించి చెప్పడం, అప్పటివరకు ఒంటరిగా ఉన్న రాజేశ్వర రావు గారిలో సంఘాల ప్రాధాన్యత మనస్సులో పడిపోవడం, అదే తరువాత కాలంలో ఒక గొప్ప విద్యార్థి సంఘ నాయకుడుగా పేరు తెచ్చుకోవడంలో వీరికి పనికి వచ్చింది.

1938లో జరిగిన వందేమాతరం ఉద్యమ ప్రభావం కూడా విద్యార్థులపై చాలా ఉంది. వంగకవి బంకించంద్ర ఛటర్జి వ్రాసిన వందేమాతరం ఒక అద్భుత సృష్టి, అపూర్వ శక్తి. ప్రతిదేశ పౌరుడి అభిమాన గేయం. ఈ గేయం దేశమంతటా గొప్ప అలజడి సృష్టించింది.

హైదరాబాద్ సంస్థానంలో ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దాని అనుబంధ కళాశాలలో విద్యార్థులంతా నల్లని షేర్వానీలు, యూనిఫారంలో కళాశాలల్లోకి రావాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని హిందూ విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. అధికారుల ఆదేశాలకు వ్యతిరేకంగా కళాశాలలో వందేమాతరం గేయం ఆలపించడం ప్రారంభించారు. ఈ ధిక్కారానికి పూనుకున్న అనేక వందల మంది విద్యార్థులను ప్రభుత్వం కళాశాలల నుండి బహిష్కరించింది. చాలామంది చదువుకు ముగింపు పలకగా కొద్దిమంది విద్యార్థులు పొరుగు రాష్ట్రాలైన నాగపూర్, పర్భని, మైసూర్ మొదలైన కళాశాలల్లో తమ విద్యను కొనసాగించడం జరిగింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు ఎందరో ఆ తర్వాత కాలంలో రాజకీయ నాయకత్వాలను నిర్వహించారు.

కాంగ్రెస్, సోషలిస్ట్, కమ్యూనిస్ట్, వారు వీరు అని కాకుండా అన్ని పార్టీల వారు ఈ వందేమాతరం ఉద్యమం నడపటం అపూర్వం. ఈ ఉద్యమ ప్రభావం జిల్లాలపై కూడా ప్రగాఢ ప్రభావం చూపింది. విద్యార్థులే కాకుండా వ్యాపారస్థులు, ఉద్యోగులు కూడా ఉద్యమాలలోకి ప్రవేశించసాగారు. వీరందరికి ఉస్మానియా, ఆంధ్ర భాషా నిలయాలు ఒక సమావేశ స్థలం అయింది. ఆంధ్ర భాషానిలయ గ్రంథాలయంలో గోలకొండ, ఆంధ్ర, కృష్ణా పత్రికలు, స్వతంత్ర పత్రికలు లభించేవి. ఈ పత్రికల్లో వచ్చే వ్యాసాలు, సంపాదకీయాలు అందరిని ఆకర్షించి దేశభక్తిని ప్రేరేపించేవి.

1942లో వీరు హైస్కూల్‌లో పదవతరగతి చదువుతున్న రోజులు. వీరి తరగతికి సైన్స్ మాస్టర్ యాసీన్ ఆల్వీగారు వచ్చి సైన్స్ పాఠం చెప్పకుండా, తెల్లవారితే జరుగనున్న క్విట్ ఇండియా ఉద్యమం గురించి వివరంగా చెప్పారు.

చావో బ్రతుకో తేల్చుకోవాల్సిన తరుణం, జాతిపిత తలపెట్టిన క్విట్ ఇండియా మహా సంగ్రామంలో విద్యార్థులు, యువకులు స్కూళ్లు, కళాశాలలకీ స్వస్తి చెప్పి ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఉద్బోధించారు.



సహచర విద్యార్థులతో చర్చించి తరువాత కర్తవ్యం ఏమిటి అని తెల్లవారేసరికి గాంధీగారు ఇతర నాయకులు అరెస్ట్ చేయబడి జైలుకు పంపబడినారని, జైలులోనే నిరాహార దీక్షకు పూనుకున్నారని, రేడియో వార్తలు నాలుగు దిశలలో మారుమ్రోగాయి. దీనితో ఎక్కడి వారక్కడ గుమిగూడి తమ తక్షణ కార్యాచరణ గురించి చర్చించుకొన్నారు. రాజేశ్వరరావుగారు వారి సహచరులంతా గాంధీగారి నిరాహారదీక్షకు మద్దతుగా నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించి వందలాది విద్యార్థులంతా కలిసి కరీంనగర్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న దద్దిరమ్మకుంటలోని గద్దె పెరుమాండ్ల దేవాలయ ప్రాంగణంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. సాయంకాలం వరకు దీక్ష కొనసాగించారు. పట్టణం నుండి ప్రముఖ రాజకీయనాయకులు, ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజ నాయకుల బృందాలు వచ్చి వారి శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావాన్ని తెలిపినారు. ఇంకా ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని విద్యార్థులంతా ప్రతిన బూనినారు.

అదేరోజు శ్రీమతి అరుణా ఆసఫలీ గారి స్వదస్తూరితో ఆంగ్లంలో వ్రాయబడిన ఉత్తరం రాజేశ్వరరావుగారి పేరు మీద వచ్చింది. ఎంతో ఆశ్చర్యం, ఆనందం, ఉద్వేగం కలిగింది.

ఆ ఉత్తరంలో ఇలా ఉంది.

విద్యార్థి లోకానికి నిజమైన పరీక్షా సమయం. స్వతంత్ర పోరాటంలో చావో బ్రతుకో తేల్చుకోవాల్సిన సమయం. క్విట్ ఇండియా నినాదం బ్రిటీష్ సామ్రాజ్య వాదాన్ని తరిమి కొట్టాల్సిన చివరి పోరాటం అని ఆమె పిలుపు నివ్వడంతో రాజేశ్వరరావు గారి నరనరాన ఉద్వేగాన్ని కలిగించింది. ఆ ఉత్తరాన్ని బద్దం ఎల్లారెడ్డికి చూపించారు. వారు ప్రోత్సహిస్తూ ఇది నీ విద్యార్థి సంఘానికి గుర్తింపు. మరింత ఉత్సాహంతో కదలండి అని బోధించారు.

పదవ తరగతి విద్యార్థిగా, సంఘ అధ్యక్షునిగా కార్యక్రమాలను విస్తరించుకుని సంఘానికి ప్రత్యేక కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకొని ప్రతిరోజు సాయం

వేళలో పని ప్రారంభించారు రావుగారు. ఈ సంఘ కార్యకలాపాల ద్వారా రాజకీయ అవగాహన, ఉద్యమస్థాయి, సామాజిక చతురత, లౌకికం, చైతన్యం నానాటికి వీరిలో పెంపొందించబడినాయి.

బద్ధం ఎల్లారెడ్డి గారితో సంబంధాలు బలపడటం, విద్యార్థి ఆందోళనా కార్యక్రమాలలో ఒక కార్యకర్తగా జీవించడం ప్రారంభమైనకాలంలో ఒకనాడు ఆంధ్ర మహాసభ కార్యాలయంలో బద్ధం ఎల్లారెడ్డి గారు, అనభేరి ప్రభాకరరావు గారి సమక్షంలో రాజేశ్వరరావు గారిని కమ్యూనిస్టు పార్టీలో కాండిడేట్ సభ్యునిగా చేర్చుకున్నారు. ఈ విషయం తెలిసి వీరి బావగారు పోల్కంపల్లి గారు అభినందిస్తూ

కమ్యూనిస్ట్ సిద్ధాంతం చాలా మంచిది దాన్ని భారతదేశానికి ఎలా వర్తింపజేయాలో నేర్చుకోవాలి అని ఉద్బోధించారు. ఈ మాటలతో వారిలో ఇంకా క్రమశిక్షణ పెరిగి అంకిత భావంతో పనిచేయడం ప్రారంభించారు. ఈ సంవత్సరంలోనే రావుగారి 10వ తరగతి పూర్తి అయింది. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిపోయారు.

ఈవిధంగా వీరు వివాహానికి ముందు జరిగిన సంఘటనలను, సన్నివేశాలను వారి సహచరికి సందర్భోచితంగా వారి గత జీవితాన్ని వడ్డించిన విస్తరిలా వివరించారు. రాజేశ్వరరావుగారి నాన్నగారు చేసిన హితబోధ కూడా పేర్కొనదగినది. వీరి నాన్నగారు చెన్నమనేని శ్రీనివాసరావు గారు భూస్వామ్య వాతావరణం, దేశముఖుల వారసత్వం నుండి వచ్చినవారు అయినా ఎంతో సాత్త్విక స్వభావం కలవారు. మంచి పరోపకార బుద్ధి కలవారు, సమతావాది, మానవతావాది.

ఎవరికీ కీడు తలపెట్టకూడదని, అందరికి తోచిన మేలు చేయాలని, మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని పోషించాలని దేశసేవ చేస్తూ గౌరవంగా బ్రతకాలని, సమస్యలకు భయపడరాదని, ధైర్యంగా ఎదిరించి ముందడుగు వేయాలనీ, తప్పులు చేయకూడదని, ఎత్తిన తలదించకూడదనీ, బాధల్ని భరించాలనీ, వైఫల్యానికి కృంగరాదనీ ఇది విజయంలో ఒక భాగమని, నిన్నటి నిరాశను తలుచుకుని కుమిలేకంటే రేపటి వేకువ కోసం ఎదురుచూడడం అత్యుత్తమమనీ, వారు చేసిన బోధ, నేటికీ రాజేశ్వరరావు గారికి లలితాదేవి గారికి శిరోధార్యం, ఆ మాటలకే కట్టుబడి జీవనం సాగిస్తున్న మహోన్నతమూర్తులు ఈ ఇద్దరూ.



అద్భుత విజయాల వెనుక నున్న రహస్యం కేవలం కష్టించి పని చేయడమే. ప్రతి కష్టాన్ని నిచ్చెన మెట్లుగా ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలను చేరాలని వారి నాన్నగారు చేసిన ఉపదేశం. ఈవిధంగా రకరకాల అనుభవాలతో జీవితం కొనసాగుతోంది. రాజేశ్వరరావుగారు ఉన్నత విద్యలోకి ప్రవేశించారు. నిజాయితీ, ధర్మం, న్యాయం అన్నీ స్థిరంగా సమాజంలో ఉండాలి అందుకు మనవంతు కృషి చెయ్యాలి అనే భావనతో **1947** జూన్ నెలలో లా కాలేజీలో ఎల్.ఎల్.బి. మొదటి సంవత్సరంలో చేరారు. అప్పుడే వీరికి 'అరుణ' అనే కూతురు పుట్టింది. అరుణ ఆసఫ్ ఆలీ చేత ఎంతో ప్రేరణ చెంది ఉద్యమంలో చురుకుగా పాల్గొంటున్నందున అందుకే మొదటి పాప పేరును అరుణగా పెట్టుకున్నారు.

**1944 - 1948** అజ్ఞాతవాసం వరకు వీరి భార్య లలిత పూర్తిగా పుట్టింట్లోనే వుండిపోయినా కూడా విద్యార్థి నాయకుడుగా వీరి అనుభవాలను, సుఖ సంతోషాలను, ఆదర్శ భావాలను పంచుకుంటూనే ఉన్నారు. సమస్యలను ఓపికగా విని అర్థం చేసుకుంటున్నారు లలితాదేవి గారు. పుట్టింట్లో సమయాన్ని వృథా చేయకుండా సాహిత్యాభిలాషను పెంచుకొని అనేక గ్రంథాలు చదివారు. ముఖ్యంగా మాలపల్లి నవల విస్తృతంగా ప్రచారంలో ఉన్న సమయం. అప్పటికే స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొంటున్న మహిళల గురించి ఎంతో ఉత్సాహంతో తెలుసుకొనేవారు.

లా కళాశాలలో ప్రవేశించిన నాటి నుండి ప్రతిరోజు ఏదో ఒక కొత్త కార్యక్రమంతో, సమాజాన్ని, దేశాన్ని ఉద్ధరించాలనే వీరి సంకల్పం చాలామంది విద్యార్థులు వారి తరగతులను వదిలి వీరి కార్యక్రమాలకు రావడం, ఇదంతా చూసి ఒకరోజు లా కాలేజ్ ప్రిన్సిపాల్ మోస్విగారు పిలిచి నీవు లీడర్ అవుతావా ? ప్లీడర్ అవుతావా ఏదో ఒకటి నిర్ణయించుకోమన్నారు.

దానికి రావుగారు ఎలాంటి జంకు లేకుండా కాలమే నిర్ణయిస్తుంది. ప్రస్తుతానికి ఈ సంస్థానం భారత యూనియన్‌లో కలిసే వరకు పోరాటం తప్పదని మనవి చేస్తున్నాను అని అన్నారు.

ఆరోజు ఆ మాటలు ఆ ప్రగాఢ ఆకాంక్ష వారి పోరాటంలో తరువాత ప్రతిబింబించాయి. పడ్డవాడెప్పుడూ చెడ్డవాడు కాదుకదా ఎవరికైనా విమర్శల బాధ తప్పదు. సింహమైనా ఈగల బారి నుండి తప్పించుకోలేదు.

రాజకీయంగా ఎంత కష్టపడినా లా చదివి మంచి అడ్వకేట్ కావాలనే వారి కోరిక నెరవేరలేదు. చివరకు రాజకీయ నాయకుడిగానే మిగిలిపోయారు.

1943 మేలో భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రథమ మహాసభ ముంబయిలో జరిగింది. దీనికి గదర్ పార్టీ వ్యవస్థాపకులు 25 సంవత్సరాల కాలం పాటు జైలు జీవితం గడిపిన త్యాగధనుడు బాబా సోహన్ సింగ్ భక్నా మరియు చిటకాంగ్ విప్లవ వీరులలో అగ్రగామిగా పనిచేసి ఐదు సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపిన కల్పనాదత్ లాంటి విప్లవవీరులు పాల్గొనే సభలో ప్రతినిధిగా వెళ్లడం రావుగారికి ఎంతో గర్వకారణం. కామ్రేడ్ పి.సి. జోషి నాయకత్వంలో కమ్యూనిస్ట్ పార్టీ నిత్యనూతన వృద్ధి చెంది అన్ని రంగాల్లో ఉన్న నిష్ణాతులు, దేశభక్తులు, విజ్ఞానులు అందరితో పార్టీ సన్నిహిత సంబంధాల్ని ఏర్పరుచుకుంది.

అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్, అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, అఖిల భారత కిసాన్ సభలు వినూత్న ఉత్సాహంతో ముందుకు కదిలాయి. దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యంతో పాటుగా కష్టజీవుల కడగండ్లను తొలగించే నూతన ఆర్థిక సామాజిక వ్యవస్థ గురించి బహుళంగా ప్రజాసమీకరణ చేయడం జరిగింది.

**దేశ స్వాతంత్ర్యం - పార్టీలో కీలక పరిస్థితులు :**

1947, 15 ఆగస్ట్‌న భారత కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించి ఒక తీర్మానం ప్రవేశపెట్టింది. మౌంట్‌బాటన్ ద్వారా సాధించబడిన స్వాతంత్ర్యం ఒక బూటకమని, దేశంలో ఇంకా సంస్థానాలు, ఫ్యూడల్ శక్తులు విదేశీ పెట్టుబడులు యధాతథంగా ఉండే స్వతంత్రం ప్రజాహితం కాదని తీర్మానంలో విశ్లేషించారు.

అభిప్రాయాలు ఏవిధంగా ఉన్నప్పటికీ భారత, పాకిస్తాన్ దేశాలు తమ తమ జాతీయ జెండాలను ఎగరవేసి బ్రిటీష్ పతకాన్ని క్రిందికి దింపేసారు. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవం జరుపబడింది. ఎక్కడ చూసినా ఆనందోత్సవాలే.

బ్రిటీష్ సామ్రాజ్యవాదులు ప్రప్రథమంగా మన దేశాన్ని వలస దేశంగా ఆక్రమించి ఆగస్ట్ 15వ తేదీన తమ పతాకాన్ని ఎగురవేసారు. కాబట్టి మన దేశాన్ని వదిలివెళ్తూ స్వతంత్రాన్ని మనకు తిరిగి ఇచ్చేందుకు ఆగస్ట్ 15వ తేదీనే ఎంచుకున్నారు. అందుకే బ్రిటీష్‌వారు నిర్ణయించిన ముహూర్తాన్ని అంగీకరించకుండా ఒకరోజు ముందే అధికార



మార్పిడి క్రతువును పూర్తి చేద్దామని మనవారి అభిప్రాయం. కాని వేద పండితులు 14 అర్థరాత్రి దాటిన తర్వాతనే మంచి ముహూర్తం ఉందని చెప్పారు. దీంతో 14వ తేదీ అర్థరాత్రి దాటగానే 15వ తేదీ ప్రారంభంలో బ్రిటీష్‌వారు అనుకున్న విధంగానే అధికార మార్పిడి జరగాలని నిర్ణయించుకోవడం జరిగింది. భారత ప్రధాని ఆ అర్థరాత్రి చేసిన ప్రసంగం చారిత్రాత్మకమైనది.

ప్రపంచం అంతా నిద్రిస్తున్న ఈ అర్థరాత్రి వేళ “భారతజాతి తన నిద్రావస్థ నుండి మేల్కొని తన అదృష్టదేవత ఒడిలోకి చేరుతున్నది” అని వారు చేసిన ప్రసంగం చిరస్థాయిగా నిలిచిపోయింది.

**హైదరాబాద్ సంస్థానంలో రాజకీయాలు - రాజేశ్వరరావు గారి పాత్ర :**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన హైదరాబాద్ నవాబు మాత్రం తన రాష్ట్రం స్వతంత్ర దేశంగా వుంటుందని ప్రకటించుకోవటం, బ్రిటీష్ ప్రభుత్వం రాష్ట్రాలకు స్వయం నిర్ణయాధికారాలు వుండాలని, విడిపోయే హక్కు సైతం వుండాలని ప్రతిపాదించటం జరిగింది. కాని కేంద్ర హోం శాఖామంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి కృషి ఫలితంగా దేశంలోని సుమారు 500 సంస్థానాలు భారత యూనియన్‌లో చేరిపోతునట్లు ప్రకటించుకున్నాయి. కొంత కాలయాపన తర్వాత కాశ్మీర్ మహారాజు హరిసింగ్ తమ సంస్థానం భారత యూనియన్‌లో చేరుతున్నట్లు ప్రకటించుకోవాల్సి వచ్చింది. అతిచిన్న సంస్థానమైన జునాగఢ్ మహారాజు గారు అసలు సంస్థానాన్ని వదిలి పారిపోగా అక్కడి ప్రజలు భారతదేశంలో విలీనమవుతున్నట్లు ప్రకటించు కున్నారు. ఒక్క హైదరాబాద్ విషయంలో మాత్రమే మొండి వైఖరి కనిపించింది. నిజాం సర్వ స్వతంత్రాన్ని ప్రకటించుకోవటం తీర్మానించుకోవటం అతని మొండితనానికి పరాకాష్ట.

1930 నాటి నుండి రాజకీయ చైతన్యాన్ని కలిగిన ఆంధ్ర మహాసభ స్టేట్ కాంగ్రెస్, భారత కమ్యూనిస్ట్ పార్టీ, ఆర్యసమాజ్ సంస్థలు ఎలాంటి జాప్యం లేకుండా హైదరాబాద్ విలీనం కావాలని, నిజాం ప్రభుత్వంపై వత్తిడి తెచ్చే కార్యక్రమానికి రంగంలోనికి దుమికాయి.

ఆగస్ట్ 15వ తేది తెల్లవారేనాటికి హైదరాబాద్ పట్టణంలోని వివిధ కూడళ్ళలో, కార్యాలయాల భవనాలలో, త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాలని నిర్ణయం జరిగింది.

సుల్తాన్‌బజార్‌లో వున్న అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘ కార్యాలయంపై ఆనాటి రాష్ట్ర కార్యదర్శి శ్రీ రఫీ అహ్మద్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి చాకచక్యంగా తప్పించుకోవటం ఆనాడు పెద్ద సంచలనాన్ని సృష్టించింది.

ప్రధానంగా **1947** ఆగస్టు **15**వ తేది నుండి రాజకీయాలలో దుమారాలు చెలరేగాయి. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు ముఖ్యంగా గ్రామ గ్రామాన జాతీయ స్వతంత్ర పతాకాన్ని ఎగురవేయ సంకల్పించినాయి.

**1947** సెప్టెంబర్ **2**వ తేది జెండా పండుగగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నారాయణగూడలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో జెండా ఎగురవేయాలని రాజేశ్వరరావుగారికి పార్టీ నుండి ఆదేశాలు అందాయి. ఈ విషయాన్ని పోలీసులు పసిగట్టారు. పాఠశాలను దిగ్బంధించారు. కేవలం విద్యార్థులను మాత్రమే లోపలికి అనుమతించారు.

రాజేశ్వరరావుగారు ఒక ముస్లిం విద్యార్థిగా షేర్వాణి, పైజామా తొడుక్కొని లోపలికి ప్రవేశించి అప్పటికే వందలాది విద్యార్థులు గుమికూడిన ప్రదేశంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గద్దెపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థులు జై జై ధ్వానాలు చేశారు. వెంటనే షేర్వాణి, పైజామా వదిలి లోపలున్న నిక్కర్, ఆఫ్ షర్ట్‌తో సైకిల్‌పై బయటికి రావడం, ఎవరికి దొరకకుండా రహస్య స్థలానికి వెళ్ళిపోవటం అంతా కొన్ని నిమిషాలలోనే జరిగిపోయింది. నగరం నడిఒడ్డున ఈ ఉదంతం పెద్ద సంచలనాన్నే కలిగించింది.

తర్వాత విక్టరీ ప్లే గ్రౌండ్‌లో వియత్నాం ప్రజా పోరాటం పట్ల సంఘీభావాన్ని ప్రకటించే బహిరంగ సభలో ప్రధానోపన్యాసకునిగా పాల్గొన్న రాజేశ్వరరావు గారు ఉపాయంగా పోలీసుల నుంచి తప్పించుకునే అవసరం ఏర్పడింది.

ఇంకొకసారి జవారి పేటలో ప్రజలు జెండా వందన కార్యక్రమానికి ఆహ్వానం పలికారు. వారి కోరిక మేరకు సభలో పాల్గొన్న తర్వాత పోలీసులు వస్తారనే సమాచారంతో సభను పొడిగించి ప్రసంగాలు చేయగా వారు పారిపోయారని తెలుస్తుంది. ఈవిధంగా ఎవరికి భయపడకుండా వారు ప్రచారం చేసిన విధానం చాలా గొప్పది.

జెండా వందన కార్యక్రమాలు ఊరు ఊరునా జరిగాయి. అవే పోరాట



కేంద్రాలుగా మారినాయి. కాలంతో పాటు పోరాటాలు కూడా ముందుకు సాగుతున్నాయి. అది తెలంగాణా సాయుధ పోరాటానికి ప్రారంభదశ. తెలంగాణా ప్రాంతం నుండి, ప్రతి గ్రామం నుండి వందలాది సాహస వీరులు స్వాతంత్ర్య సమర యోధులుగా విజృంభించారు. తమ వెంట వేలాదిమందిని ఉద్యమవీరులుగా మలచి నడిపించారు.

రాను రాను నైజాం ప్రభుత్వం రజాకర్ల నాయకత్వానికి లొంగిపోయింది. గ్రామ గ్రామాన పోలీసుల, రజాకర్ల దురాగతాలు పెరిగిపోయాయి. గృహ దహనాలు, లూటీలు, మానభంగాలు, హింస పెరిగిపోయింది. ఆత్మరక్షణ కొరకు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది. వందలాది యువకులు సాయుధ పోరాటానికి స్వచ్ఛందంగా సిద్ధపడి ట్రైయినింగ్‌కు సిద్ధమయ్యారు.

వేలాది యువకులకు తర్ఫీదు ఇవ్వడం, రైతు కూలీల్ని గెరిల్లా దళాల్లోనికి చేర్చుకోవటం తప్పనిసరైంది.

ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘ కార్యవర్గం రహస్యంగా సమావేశం జరిపి ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వరరావు గారిని ఎన్నుకోవడం జరిగింది. క్రమంగా పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి.

రాజేశ్వరరావుగారు సుదీర్ఘంగా ఆలోచించారు. వారి కర్తవ్య పాలన గురించి సమీక్షించు కున్నారు. ప్రతిపనికి ఎన్నో అడ్డంకులు, వాటిని ఛేదించి ముందుకు దూసుకు పోగలిగినవాడే ధీరోదాత్తుడని నిర్ణయించుకున్నారు.

పరోక్షంగా వారి నాన్నగారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఆయన వారికి అభయం ఇస్తూ "గౌరవంగా బ్రతకాలంటే నిర్భయంగా ధైర్యంతో వుండాలి". సంకల్పబలం ఉన్నవాడు ప్రపంచాన్ని మొత్తం తనకు అనుకూలంగా తిప్పుకోగలడని, కష్టాలు, ఇబ్బందులు, అడ్డంకులు, రకరకాల ఒత్తిళ్లు ఎన్ని ఎదురైనా సరైన సంయమనంతో ఉండాలని ఉద్బోధించారు.

తరువాత వీరు లలితాదేవి గారి మనోగతాన్ని, అభిప్రాయాన్ని కోరారు. ఆమె వీరికి చేయూత నందిస్తూ ఎన్ని కష్టాలు ఎదురైనా నేను మీ వెంటే వుంటాను అని భరోసా ఇచ్చిన ధీర వనిత.

ఎలాంటి తొట్రుపాటు లేకుండా జరగబోయే కష్టాలకు వెరవకుండా చంటిపాపతో ఆనాటి నుండి భర్త వెంటనే వుండడానికి నిర్ణయించుకున్న లలితాదేవి గారు అభినందనీయులు.

తండ్రి, భార్య ఇచ్చిన ఆత్మబలంతో రాజేశ్వరరావుగారు రెట్టించిన ఉత్సాహంలో ఇక వెనుకకు తిరుగు లేకుండా కార్యాచరణలోకి దిగిపోయారు. ఇందులో భాగంగా మొదట విజయవాడలో నిర్వహించబడిన నాయకుల స్థాయి శిక్షణలో పాల్గొన్నారు. ఒక మాసంలోనే సైనిక, రాజకీయ శిక్షణలు పూర్తి చేసుకుని రహస్య జీవితాన్ని ప్రారంభించారు. లలితాదేవి గారు వీరితో పాటే ఉన్నారు.

డెన్‌ల నిర్వహణ హైదరాబాద్ నగరంతో పాటుగా వరంగల్లు, కరీంనగర్, నల్లగొండ, గుల్బర్గా, నాందేడ్, ఔరంగాబాద్ శిక్షణా కేంద్రాల నిర్వాహకులతో కలిసి విద్యార్థి విభాగాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత హైదరాబాద్, మహారాష్ట్ర సరిహద్దులో ఢిల్లీ రహదారిలో వున్న చాందా పట్టణాన్ని రక్షణ కేంద్రంగా ఎంచుకుని అక్కడ లలితాదేవి, జోగినిపల్లి ఆనందరావు వారి సతీమణి జోగినిపల్లి రాధమ్మ గార్లు స్థావర నిర్వాహక బాధ్యతను చేపట్టడం జరిగింది. వీరితో పాటు ఆదిలాబాద్ జిల్లా పార్టీ నాయకులు రామకృష్ణ శాస్త్రి, దాజి శంకర్ రావు, బాసెట్టి గంగారాం, కుమారస్వామి గార్లతో పాటు కరీంనగర్ జిల్లా నాయకులు కూడా ఉండేవారు.

కరీంనగర్ జిల్లా నాయకత్వానికి గోదావరి తీరాన కాళేశ్వర దేవస్థానానికి అవతలి ఒడ్డుపై వున్న సిర్‌వంచ కేంద్రంగా ఎంచుకోవడం జరిగింది. సైనిక శిక్షణలతో పాటుగా రాజకీయ శిక్షణలు నిర్వహించబడేవి.

అయితే ఇక్కడ లలితాదేవి గారి వెంట ఒక సంవత్సరం వయసు కూడా సరిగా నిండని శిశువు అరుణ కూడా ఉండటం విశేషం. బాల్యంలోని మధుర ఘట్టాలన్నీ ఇలాంటి క్యాంపులలో వెళ్ళదీయటం అరుణ అదృష్టం.

లలితాదేవి, జోగినిపల్లి రాధమ్మ గార్లు రహస్య స్థావర నిర్వహణ బాధ్యతను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. రహస్య స్థావరంలో పోలీసుల కళ్ళుగప్పి నివసించడం ఒక గొప్ప సాహసమే. ఎల్లప్పుడు అప్రమత్తతతో అతి జాగురుకతతో



వుంటూ అందరికి అమ్మ ప్రేమను పంచుతూ భోజన సౌకర్యాలు ఏర్పాటుచేసి శిక్షకులకు మాతృమూర్తి ప్రేమను పంచారు లలితాదేవి.

ముక్కుపచ్చలారని అరుణ అందరికి తలలో నాల్కలా, అందరూ పాపను ప్రేమతో లాలించడం, ముద్దాడటం చెరిగిపోని జ్ఞాపకాలు.

సరిహద్దుల్లో ఉన్న క్యాంపులో సైనిక రాజకీయాల్లో శిక్షణతో పాటు సాహిత్యాన్ని, ఆయుధాలను సంపాదించి గ్రామీణ ప్రాంతాలకు వాటిని తరలించటం అనేది ముఖ్య కర్తవ్యం. అత్యంత చాకచక్యంతో రైలు, రోడ్డు మార్గం గుండా కీలకమైన ఈ బాధ్యతను ఎందరో అజ్ఞాత వీరులు నిర్వహించేవారు. కొన్నిసార్లు ఆత్మార్పణలు కూడా జరిగాయి.

చాలాసార్లు లలితాదేవి గారు తన దుస్తుల సంచితో, బట్టల పెట్టెలో ఆయుధాలను హైదరాబాద్‌కు తరలించడానికి రైలులో ప్రయాణాలు చేశారు. ఎంతో చాకచక్యంగా, సాహసోపేతంగా ఆయుధాలను తరలించడంలో లలితాదేవి గారి పాత్ర ఎన్నదగినది. పోలీసుల చెకింగులతో ఏ మాత్రం భయం తొట్రుపాటు లేకుండా నిబ్బరంగా ప్రవర్తించిన తీరు మరువలేనిది. సుశిక్షితులైన సైనికుల మాదిరిగా లలితాదేవి ఆయుధాలు చేరవేసిన విధానం వారి మాతృదేశ సంరక్షణా తత్పరతను తెలుపుతుంది.

కాంగ్రెస్ పార్టీలో స్వామి రామానంద తీర్థ గారి నాయకత్వంలో బలమైన యువతరం సాయుధ పోరాట ఆత్మరక్షణ పోరాటానికి పిలుపునిచ్చింది.

సంస్థానం నలువైపులా తెలంగాణా, మరట్వాడా, కర్ణాటక సరిహద్దులలో ఉభయ పార్టీల నాయకత్వంలో విడివిడిగా వందకు మించిన చిన్నా పెద్ద క్యాంపుల నిర్మాణం జరిగింది. తిరిగి గ్రామీణ ప్రాంతాల్లో ఉప కేంద్రాలు కూడా నిర్వహించబడేవి.

ఈ క్యాంపులన్నిటికి రాజకీయ నాయకుల ప్రజల ప్రత్యక్ష పరోక్ష తోడ్పాటు మరువలేనిది. ఈ బలమే సమరయోధులకీ వరంగా మారింది.

## కమ్యూనిస్ట్ పార్టీ నిర్వహించిన కొన్ని కార్యక్రమాలు

**దస్తరాలు కాల్చివేసే కార్యక్రమం :**

ఆయుధాల సేకరణ, దస్తరాల కాల్చివేత పిలుపు నందుకున్న ప్రజలు ఉవ్వెత్తుగా లేచారు. పటేలు - పట్వారీల వద్ద నున్న రికార్డును కాల్చివేయటం, ఆయుధాల సేకరణ కార్యక్రమానికి జైత్రయాత్రా దళాలు బయలుదేరాయి. ఆ రోజులలో దాదాపు భూస్వాములందరి ఇండ్లలో ఒక నాటు తుపాకి, తల్వార్ (పొడుగాటి కత్తి) తప్పనిసరిగా వుండేవి.

ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం గారలే కాకుండా అనేక మంది మహిళలు దళాలలో చేరి తుపాకి కాల్చడంతో శిక్షణ పొందారని వినేవారు.

తెలంగాణా గ్రామాలపై రజాకార్ల దాడులు తీవ్రరూపం దాల్చాయి. గ్రామాలను తగుల బెట్టడం, ఇండ్లను లూటీ చేయడం, స్త్రీలను చెరచటం, పురుషులను కాల్చి చంపటం మొదలగు బీభత్సకాండను సృష్టించారు.

**గ్రామ రక్షణ దళాలు :**

ఈ పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన గ్రామ రక్షణ దళాల నేర్పరచి గ్రామాలను ఎలా కాపాడుకోవాలో సభలు, సమావేశాలు జరిపి ప్రజలను జాగృత పరిచేవారు.

**గ్రామ రక్షణ దళాల నిర్వహణ :**

దళ సభ్యులు ఊరికి నాలుగువైపులా చెట్ల పైన కూర్చుని కాపలా కాయాలి. నాలుగు గంటల కొకరు మారాలి. పోలీసులు, రజాకారులు వస్తున్నట్లయితే కాపలాదారు తన దగ్గరవున్న 'డప్పు' గాని, 'గంట' గాని మ్రోగించడం ద్వారా గ్రామస్థులను మేల్కొల్పాలి. ఈ సంకేతాన్ని విన్న ప్రజలు వెంటనే దగ్గరలో గల చేలలోకి, చెట్లు, పెద్ద రాళ్ల గుట్టలలోకి పరుగెత్తుకెళ్లి ఎక్కడ వీలయితే అక్కడ తలదాచుకొని ప్రాణాలను, ఆస్తులను కాపాడుకోవాలి. అంతేకాదు. కమ్యూనిస్ట్ పార్టీ సాగించే పోరాటానికి ప్రజలు సంపూర్ణ మద్దతు నిచ్చేవారు. పార్టీ నాయకులకు రక్షణ ఇచ్చి అనేక విధాల తోడ్పడేవారు.



అప్పుడే హైదరాబాదులో భారత సైన్యాలు ప్రవేశించాయి. ప్రజలు తండోప తండాలుగా వెళ్లి ఆనందోత్సాహాలతో భారత సైన్యాలకు స్వాగతం చెబుతున్నారు. మరో ప్రక్కన 'కర్ఫ్యూ' విధించారు. ఈ కర్ఫ్యూ కాల్పులలో అనేకమంది మరణించారు.

1948 సెప్టెంబర్ 13వ తేదీన మొదలైన సైనిక చర్య 17వ తేదీన ముగిసినది. రజాకారుల పీడ విరగడయిందని అంతా హాయిగా వుండొచ్చని ప్రజలు ఎంతో సంతోషించారు.

**రహస్య స్థావరాల నిర్వహణ :**

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో స్త్రీలు నిర్వహించిన పాత్ర, వారు చేసిన త్యాగాలు, సమయస్ఫూర్తితో నాయకులను, కేడరును రక్షించుకోవడం కోసం వారు చేసిన ధైర్య సాహసాలు, తెగువ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి వుంటాయి.

ఒక స్థావరాన్ని నిర్వహించాలంటే ఎన్నో నియమ, నిబంధనలు వుండేవి. ఆ ఇల్లు ఏ ప్రాంతములో వుంది, అక్కడ నివసించేవారు ఏ తరగతికి చెందినవారు మొదలగు పరిసర ప్రాంతాల పరిస్థితులను దృష్టిలో వుంచుకొని ఇల్లు అద్దెకు తీసుకునేవారు. ఉన్నత వర్గాల వారు నివసించే ప్రాంతమైతే ఒక పెద్ద ఇల్లు తీసుకోవాలి. దానికి సరిపడ వస్తువులు సమకూర్చాలి. ఆ ఇంటి స్థాయి ననుసరించి ఇంట్లో వుండేవారికి సరిపోయే కథనల్లుకోవాలి. అక్కడ అల్లుకునే కథకు సరిపడ నటించే పాత్రధారులు వుండాలి. ఏవిధమైన కథ చెబితే బాగుంటుందో ముందే నిర్ణయించేవారు. అందరికీ మారుపేర్లే వుండేవి. ఒకరి గురించిన వివరాలు మరొకరికి తెలియవు. ఆ స్థావరాన్ని నిర్వహించేవారు ఒక కుటుంబం గాను, మిగతావారు బంధువులు గాను చెప్పేవారము. మరికొందరు గదిలో నుండి బయటకు వచ్చేవారు కాదు. పనిమనిషి ఆ గదిలోకి వెళ్లకుండా మొదటి నుంచి జాగ్రత్తలు తీసుకునేవాళ్లము. 'డెన్ కవరు'గా వుండే అతన్ని మట్టుకి విద్యార్థిగానో, ఉద్యోగస్థుడు గానో చెప్పేవారు. (ఆ వ్యక్తి డ్యూటీలకు వెళ్లేవారిలాగ) నిర్ణీత సమయాల్లో బయటకు వెళ్లి రావడం చేసేవారు. మిగతా అందరూ రాత్రి 7-9 గంటల మధ్య, తెల్లవారుఝామున 4-5 గంటల సమయంలో మాత్రమే రాకపోకలు సాగించాలి. ఈ విషయాన్ని అందరూ ఖచ్చితంగా పాటించేవారు. ఇంట్లో పనిమనిషి వున్న సమయాలలో సాధారణ కుటుంబాలలో

వుండే స్త్రీలలాగా వుండాలి. పనిమనిషికి ఏ మాత్రం అనుమానం రాకూడదు. అవసరమైనప్పుడు ఘోషా స్త్రీల వలె నటించాల్సి వచ్చేది. పనిమనిషిని పెట్టుకోకపోతే చుట్టుప్రక్కల వాళ్లకు అనుమానం వస్తుందని పెట్టుకునేవాళ్లం. చిన్న చిన్న ఇండ్లలో వున్నప్పుడు పనిమనిషిని పెట్టుకునేవారము కాదు. పొరుగువారితో ఏమీ మాట్లాడకుండా వుంటే సహజంగా వుండదని మాట్లాడాల్సి వచ్చినప్పుడు చాలా జాగ్రత్తగా మాట్లాడాల్సి వచ్చేది. కొన్నిసార్లు భూస్వాముల కుటుంబాలకు చెందినవారమని, మగవారికి కనపడమని, ఇతరులతో మాట్లాడితే వారికి ఇష్టం వుండదని సందర్భోచితంగా చెప్పేవారము.

ఒక స్థావరాన్ని ఏర్పరచుకున్నప్పుడే ఇంట్లో వుండే వారందరూ కూర్చుని కొన్ని సిగ్నల్స్ ఏర్పరచుకునేవారము. ఇంటి కిటికి, కర్టెన్ వేసివుంటే అది సురక్షితంగా వున్నట్లుగా గుర్తు. ప్రమాదకరమైన పరిస్థితులు వుంటే కర్టెను ప్రక్కకు తొలగించే వారము. అలాగే డాబాపై బట్టలు ఆరవేసి వుంచటం, అవి లేకపోతే ప్రమాద సూచకం, ఒక్కోసారి కిటికీ తలుపులు మూసి వుంచటం ... తెరచి వుంచితే ప్రమాద సూచకమని ఇలా రకరకాల సంకేతాలతో అత్యంత జాగ్రత్తలు తీసుకుంటూ స్థావరంలో వుండే స్త్రీలు ధైర్యంతో, మెలకువతో డెన్స్‌ను కాపాడేవాళ్లు. ప్రమాద సూచన వుంటే ఇంట్లో వున్న ముఖ్యులంతా వెంటనే వేరే డెన్‌కు మారేవారు. ఒకళ్లిద్దరు ఇంట్లో వుండి ముఖ్యమైన కాగితాలను కాల్చివేయటం చేసేవారు. ఈ లోపల బయటపడితే అరెస్టు అయ్యేవారు.

స్థావరాలు వెంట వెంటనే మార్చాల్సి రావటం ... ఎక్కడి బట్టలు అక్కడే వదిలేసి రావటంతో వీరికి పాపకు కూడా బట్టల విషయంలో ఇబ్బంది పడాల్సి వచ్చింది.

ఆ రోజులలో పార్టీ డబ్బు వృధాగా ఖర్చు చేయకూడదనే ఖచ్చితమైన నియమం వుండేది. అందువల్ల ఎంతో అవసరమైతే తప్ప వృధా ఖర్చులు చేస్తే క్రమశిక్షణ నుల్లంఘించినట్లుగా భావించేవారు. అలాంటి అవసరాలు వచ్చినప్పుడు చాలా మొహమాటంగా వుండేది. చివరికాలంలో ఇబ్బందికర పరిస్థితి నెదుర్కోవలసి వచ్చింది.

భోజనం విషయంలో కూడా పరిమితంగా ఖర్చు చేసేవారు. ఆ రోజుల్లో ఉప్పుడు బియ్యం మాత్రమే దొరికేవి. ఎక్కువగా జొన్న రొట్టెలు చేసేవారు. ఇక వారికి



అవసరమయిన బట్టలు ఇంటిదగ్గర నుంచే వచ్చేవి. అనారోగ్యంతో ఉన్నవారికి, పోరాట ప్రాంతాల నుండి వైద్యం కోసం వచ్చేవారికి మాత్రం ప్రత్యేకించి కొంత డబ్బు అదనంగా ఖర్చు చేసేవారు. లెక్కలు ఎప్పటికప్పుడు చూచేవారు.

**గెరిల్లాల పోరాట ఎత్తుగడల శిక్షణ :**

సాయుధ పోరాటం ఉధృతంగా సాగుతున్న సమయంలో గెరిల్లా దళాలకు, మావో పోరాట ఎత్తుగడలను, చైనా అనుభవాలను వివరించి దళాలకు మిలటరీ ఎత్తుగడలతో పాటు రాజకీయ అవగాహన కలిగించడానికి శిక్షణా తరగతులను నిర్వహించారు. మావో గెరిల్లా ఎత్తుగడలకు సంబంధించి సైక్లోస్టైలుపై తీయబడిన ఒక ఇంగ్లీషు కాపీ వీరి దగ్గర వుండేది. మావో సూచనల ననుసరించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా, గెరిల్లా పోరాట ఎత్తుగడలను రూపొందించుకోవలసిన అవసరాన్ని గుర్తించి ... తరువాత స్థాయిలలో ఈ శిక్షణా శిబిరం కొనసాగింది. ఈ శిక్షణా తరగతుల వల్ల పోరాటం సాగిస్తూ స్థానిక దళ సభ్యులకు ప్రపంచ రాజకీయాలను గురించి ఒక అవగాహన ఏర్పడింది.

పుట్నాల రామక్క అనే స్త్రీ కారం ముంత, రోకలి బండ చేతబట్టుకుని గ్రామంలోని స్త్రీ పురుషులందరినీ సమీకరించి అపరకాళివలె విజృంభించి పోలీసులను తరిమికొట్టిన ఉదంతం మరువలేని ఘటనలలో ఒక్కటిగా చెప్పవచ్చును.

తెలంగాణా పోరాట నిర్వహణ కేంద్ర రహస్య స్థావరాలు, స్టేటు కమిటీ స్థావరాలు, హైదరాబాదు సిటీ కమిటీ, ఏరియా కమిటీల రక్షణ స్థావరాలు వేరు వేరుగా ఉండేవి. (ఈ రహస్య స్థావరాలను డెన్స్ అని పిలిచేవారు) ఇవి కాకుండా కొన్ని జిల్లా, తాలూకా కేంద్రాలలో కూడా డెన్స్ వుండేవి.

ఒక వైపు ప్రభుత్వ సైనికుల వేట అనేక రూపాలలో వుంటూండేది. డెన్స్ నిర్వహించేవారికి ఆ డెన్‌లో వుండే నాయకులు, వచ్చి వెళ్లే నాయకుల గురించిన వివరాలేవీ తెలిసేవి కావు. అంతా మారుపేర్లతో వ్యవహరించేవారు. ముఖ్య నాయకులకు, రాష్ట్ర స్థాయి కొరియర్లకు మాత్రమే తెలిసివుండేది. కేంద్ర - రాష్ట్ర నాయకుల ముఖ్య సమావేశాలు కూడా డెన్స్‌లో జరుగుతుండేవి.

**స్త్రీల చైతన్యం :**

తెలంగాణా ప్రజానీకం ఉత్సాహంతో ఈ పిలుపు నందుకుంది. ఆదేశాలను అక్షరాల పాటించింది తమ స్వంత చొరవపైనే పోలీసుదాడులను ఎదుర్కొనేందుకు సరిక్రొత్త ప్రతిఘటనా పద్ధతులను ఎన్నుకున్నారు. 1946 సంవత్సరాంతంలో సూర్యాపేట తాలూకా బాలేముల, పాత సూర్యాపేట, జనగామ తాలూకా దేవరుప్పల, హుజూర్‌నగర్ తాలూకా మల్లారెడ్డి గూడ గ్రామాలపై నైజాం ప్రభుత్వ సైన్యం పెద్ద ఎత్తున దాడులు సాగించింది. మార్షల్ లా (సైనిక శాసనం) ప్రకటించి వందలాది మందిని అరెస్టు చేసి జైళ్ళలో నిర్బంధించారు.

సైనికులు జరిపిన కాల్పులలో దేవరుప్పలలో శ్రీయుతులు మందడి సోమిరెడ్డి, గోలి పాపిరెడ్డి, బాలేములలో మట్టారెడ్డి, అనంతరెడ్డి గారలు చనిపోయారు. హుజూర్‌నగర్ తాలూకా మల్లారెడ్డి గూడెంలో జరిగిన సైనికుల కాల్పులలో మరణించిన తొలి మహిళలు గురవమ్మ, తొండమ్మ (తోడికోడళ్ళు) మరొకరు అంకాళమ్మ, ఈ గ్రామస్థులే అప్పిరెడ్డి, ముంగి వీరయ్యలు కూడా ఉన్నారు. బాలేముల కాల్పులలో మరణించిన మట్టారెడ్డి భార్య ఆయన చితి వద్ద చేసిన ప్రతిజ్ఞ ప్రజల హృదయాలను కదలించివేసింది.

స్త్రీలలో అపూర్వమయిన చైతన్యం వెల్లి విరిసింది. వీరు ఊరేగింపులలో పాల్గొనేవారు. సభలు - సమావేశాలకు హాజరు అయ్యేవారు. 'బతుకమ్మ కోలాటం' లాంటి జానపద బాణీతో ఆడి, పాడి అమర జీవుల జీవితాలను స్మరించేవారు. బాలేములలో వీరమరణమొందిన మట్టారెడ్డి, అనంతరెడ్డి గారల త్యాగాన్ని కొనియాడుతూ కామ్రేడ్ స్వరాజ్యం గారు రాసిన 'ఉయ్యాల పాట' తెలంగాణ గ్రామీణ మహిళలను ఎంతో ఉత్తేజపరచింది.

పైశాచిక దాడులలో కాల్పులకు గురి అయి మరణించిన వారి కుటుంబాలను పరామర్శించడానికి, నైజాం ప్రభుత్వం కావాలని బెరారు యువరాజు పర్యటనను ఏర్పాటు చేసింది. బెరారు ప్రాంతాన్ని బ్రిటీషువారు అసఫ్ జాహీల నుండి స్వాధీనం చేసుకొని, సంవత్సరానికి యాభయిరెండు లక్షల రూపాయలు చెల్లిస్తూ, నైజాం రాజు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ కుమారుడు 'ఆజంజాను యువరాజు'గా ప్రకటించారు.



స్వాతంత్ర్యానంతరం బెరారు ప్రాంతాన్ని మహారాష్ట్రలో కొంత మధ్యప్రదేశ్‌లో కొంత కలిపి వేయడం జరిగింది.

సైనిక కాల్పులలో మరణించిన వారి కుటుంబాలకు, వెయ్యి రూపాయల చొప్పున డబ్బు చెల్లించి ప్రజల సానుభూతిని సంపాదించుకోవచ్చునని భావించిన బేరారు యువరాజు ఇవ్వజూపిన డబ్బును అమర వీరుల భార్యలు - తల్లులు తిరస్కరించారు.

***వీరపత్నులకీవు - వేయిరోకల నెచ్చి***<br>
***మరిపించజూతువే - మావీర సంస్కృతిని***<br>
***ఎంత చౌకయెనోయి - యువరాజ***<br>
***ఎన్నటికి మరువమోయి - యమరాజ***

తెలంగాణ వీరమాతల, ధీరపత్నుల ధైర్యసాహసాలకి, ఆత్మాభిమానానికి అద్దం పడుతోందీ పాట.

**మహిళల పాత్ర :**

కొండ ప్రాంతాలలో, గుట్టలలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రజాకార్లకు, యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అన్నదమ్ములతో, భర్తలతో పాటు స్త్రీలు కూడా పాల్గొన్నారు. కొరియర్లుగా పనిచేశారు. తమ అన్నదమ్ములనో, భర్తలనో అరెస్టు చేసి, కాల్చి చంపేస్తుంటే భయ భ్రాంతులకు లోను కాకుండా ఉద్యమంలో చేరి పోరాడారు. సైనికులు గ్రామాలను మృతకళేబరాలతో స్మశాన వాటికలుగా మార్చివేశారు. లూటీలు, దోపిడీలు, స్త్రీల మానభంగాల వరకు పెద్దఎత్తున దురంతాలు సాగాయి. వందలాది అమాయకులను హత్య చేయడం వారి నిత్యకృత్యంగా మారింది. రజాకార్లు గ్రామాలను తగులబెట్టిన తరువాత ప్రజలు భీతావహులై పరుగెత్తేవారు. అడ్డం వెళ్ళి కొందరిని రజాకారులు నిర్బంధించేవారు. తరువాత ఒక్కొక్కరిని నిలబెట్టి తుపాకులతో కాల్చి చంపేవారు. ఈ దురంతాలను ప్రతిఘటించటములో పురుషులతో పాటు స్త్రీలు కూడా పోరాడారు. "ఈ చారిత్రాత్మకమైన విప్లవ ఘట్టంలో స్త్రీలు నిర్వహించిన పాత్ర మహోన్నతమైనది.

**మహిళా శిక్షణా తరగతులు :**

మహిళలకు ప్రత్యేక తరగతులు వుండేవి. వీరికి బోధనాంశాలుగా, రాజకీయ భూగోళం, గతితార్కిక భౌతికవాదం, మార్క్సిస్టు మూల సూత్రాలు, సోషలిస్టు దేశాలలో మహిళల పాత్ర, భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర, రాజారామమోహనరాయ్, బాల గంగాధర తిలక్, వీరేశలింగం గారలు నడిపిన సంఘ సంస్కరణోద్యమాలు మొదలగు అంశాలు బోధించేవారు. ఆ రోజులలోనే మార్క్సిజం అంటే ఏమిటి ? మార్క్సిస్టు మూల సూత్రాలు, మంచి కమ్యూనిస్టు ఎలా వుండాలి ? మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల జీవిత చరిత్రలు చదివి సమీక్ష చేసేవారు. గోర్కీ రాసిన ప్రఖ్యాత నవల అమ్మ, ఇంకా టాన్యా, జోయా, రోజన్ బర్గ్ దంపతుల గురించిన పుస్తకాలు చదివేవారు. లలితాదేవి గారికి మొట్ట మొదటిసారిగా రాజకీయ, సిద్ధాంత సంబంధమైన విషయాలను అర్థం చేసుకోవ డానికి, రాజకీయ అవగాహనా శక్తిని పెంపొందించుకోవటానికి ఈ శిక్షణా తరగతులు వీరికి ఉపయోగపడ్డాయి.

**మహిళల సమయస్ఫూర్తి :**

దేవరుప్పల గ్రామంపై రజాకర్లు దాడిచేసి హింసిస్తున్నప్పుడు ఒక వృద్ధురాలు కమ్యూనిస్టుదళం వచ్చేసింది అని కేక వేయటంతో రజాకర్లు, పోలీసులు హత్యాకాండను ఆపివేసి విసునూరుకు పారిపోయారు. ఆ స్త్రీ సమయస్ఫూర్తితో ఎందరినో రక్షించింది.

కొన్నిసార్లు బావుల వద్ద, చెట్ల వద్ద నున్న అమాయక ప్రజలను పట్టుకొని కర్ర మొద్దులపై తలల అణచిపెట్టి పదునైన కత్తులతో నరికి చంపారు.

ఎర్రగుల్లపాడు, వడ్లకొండ, హనుమంతాపురం లాంటి గ్రామాలలోని ప్రజలు గ్రామ రక్షణ దళాల అండతో నైజాం పోలీసులను, రజాకార్లను ఎదిరించి పోరాడారు.

ఎర్రగుల్లపాడులో పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు జరిపిన కాల్పులలో గాయపడి గంపల ఐలయ్య అనే యువకుడు మరణించటం చూచిన పుట్నాల రామక్క అనే స్త్రీ కారం ముంత, రోకలిబండ చేతపట్టుకొని గ్రామంలోని స్త్రీ, పురుషులందరినీ సమీకరించి అపరకాళివలె విజృంభించి పోలీసులను తరిమి కొట్టి ఉదంతం మరువలేనిది.

రజాకారు మూకలపై కారం ముంతలతో దాడిచేసి ప్రతిఘటనోద్యమ చరిత్రలో వాసికెక్కిన మహిళలకు జన్మనిచ్చినది ధర్మాపురం.



**లలితాదేవి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం :**

ఈవిధంగా లలితాదేవి గారు కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలయ్యారు. కొంతకాలం తర్వాత మరో రహస్య స్థావరానికి మార్చారు. అక్కడ చాలామంది వుండేవారు. వారితో కలిపి నలుగురు మహిళలు వుండేవారు. జిల్లా తాలూకా ఆర్గనైజర్లకు అక్కడ శిక్షణా తరగతులు వుండేవి. రాజకీయ శిక్షణ, పోరాటం, ఎత్తుగడలు, గెరిల్లా ఎత్తుగడలు, దళాలు - విభజన మొదలగు అంశాలపై శిక్షణా శిబిరాలను నిర్వహించేవారు. బోధకులుగా రావి నారాయణరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి, యస్.వి.కె. ప్రసాదు గారలు వ్యవహరించేవారు.

అన్ని ఏరియా కమిటీల రిపోర్టులు, సర్క్యులర్లు, పోరాట ప్రాంతాల నుంచి వచ్చే రిపోర్టులు, ఆంధ్ర కమిటీ నుండి వచ్చే ఆదేశాలు అన్నీ ఈ మహిళలే రాసి సైక్లోస్టైల్ కాపీలు తీసేవాళ్లు. అందువల్ల పోరాట ప్రాంతాల పరిస్థితి వీరికి తెలుస్తూ వుండేది. పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాలు సర్క్యులర్ రూపంలో క్రిందకు పంపాల్సినవి వీరే రాయటం వల్ల వారికి రాజకీయంగా కొంతవరకు పరిస్థితులు ఎప్పటికప్పుడు అర్థం అవుతూ వుండేవి. పోరాట ప్రాంతాల నుండి వచ్చే రిపోర్టులలో మహిళలు నిర్వహించుతున్న పాత్ర తెలుసుకున్నప్పుడు చాలా ఉత్సాహం కలిగింది. ముఖ్యంగా 'రాజక్క' (మల్లు స్వరాజ్యం) 'రాములక్క' (రాములమ్మ)లు అంటే ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. వారిలాగే లలితాదేవి గారు కూడా ప్రత్యక్షంగా సాయుధ పోరాటంలో పాల్గొనాలనే కోరిక బలంగా వుండేది. వారి అభిప్రాయం పార్టీకి తెలియజేయాలనుకున్నారు.

ఎప్పుడూ వంట చేయడం, రాయటం వరకేనా మా పాత్ర ? ఇంతకంటే మేము దళాల్లో చేరి పనిచేయాలనుంది అని చెప్పారు. ఆలోచించి రెండు మూడు రోజులలో నిర్ణయం తెలియజేస్తామన్నారు. స్టేట్ పార్టీ నాయకులగు రావి నారాయణరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు గారలు వీరందరిని కూర్చోబెట్టి ప్రత్యేకంగా మాట్లాడారు.

"ఇక్కడ మీరు చేసేపని తక్కువేమీ కాదు. పార్టీ నాయకత్వాన్ని కాపాడడంతో పాటు సాహిత్యాన్ని ప్రింటు చేయించుకోలేని ప్రస్తుత పరిస్థితుల్లో రాసేవాళ్లు కూడా చాలా అవసరం. మీరు అడవులలోకి వెళ్లి చేసేదానికన్నా ఇది తక్కువ ఏమీకాదు.

ఇది మేము బాగా ఆలోచించి నిర్ణయించాము అన్నారు. అంతేకాదు ఇకముందు ఎక్కువ 'డెన్స్' నడపాలనుకుంటున్నాం. ఒక్కో డెన్‌లో ఒక్కో స్త్రీని మాత్రమే వుంచాలని నిర్ణయం తీసుకున్నాం అన్నారు." అప్పటినుండి పార్టీ నిర్ణయించిన ప్రకారం వీరు ఎక్కడ అవసరం అనుకుంటే అక్కడికి వెళ్లేవారు. వీరే సైక్లోస్టైలు కాపీలు గంటకు నాలుగు పేజీలు రాసేవారు.

ఈకాలంలో అటు అడవులలోనూ, డెన్స్‌లోను వివాహాలు చేసుకున్నవారు అనేకులున్నారు.



విశాల కుటుంబం





స్వాతంత్ర్య సమరయోధులు గురువారెడ్డి దంపతులు, సి.పి.ఐ. రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, హేమలత దంపతులతో రాజేశ్వరరావు దంపతులు




కలకత్తాలో తారారెడ్డి, రేణు చక్రబర్తిలతో లలితాదేవి



రైతాంగ పోరాటాల సభలలో రాజేశ్వరరావుతో లలితాదేవి



రావి భారతి దంపతులతో రాజేశ్వరరావు, లలితాదేవి



**రహస్య జీవితం :**

1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత యూనియన్‌లో కలిసిపోవాలని చేసిన పోరాటాలతో పాటుగా, సంఘటిత శక్తిగా ఉద్యమ నిర్వహణ చేపట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ ఈ ఉద్యమాన్ని వర్గ పోరాటంగా కూడా మలుపుతిప్పింది.

రజాకర్లకు మద్దతు ఇచ్చేవారు, విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి బరితెగించిన భూస్వాములు వారి గుండా తండాలు వారు ఏ మత, వర్గ కులానికి చెందిన వారైనా వారి ఆట కట్టించాలని కమ్యూనిస్ట్ పార్టీ నిర్ణయం తీసుకుని ఆ నిర్ణయానుసారం ప్రజాకంటక భూస్వాముల భూములను నిరుపేదలకు పంచిపెట్టాలని 1947 చివరి మాసంలో భూపంపిణీ ఉద్యమాన్ని ప్రారంభిస్తూ 200 ఎకరాలకు మించి భూములు కలిగివున్న వారి భూములను పేద ప్రజలకు పంచిపెట్టింది. ఈ భూ పంపక ఉద్యమం సంవత్సరంలోనే నల్లగొండ, వరంగల్, ఆ తర్వాత ఇతర జిల్లాల్లోకి వ్యాపించింది.

ఈ ఉద్యమ కార్యక్రమంలో సుమారు 10 లక్షల ఎకరాల అదనపు భూములను పేదలకు పంపకం చేసినట్టు 3000 గ్రామాలు భూస్వాముల పెత్తనం నుండి విముక్తి పొందినట్లు అంచనా.

తెలంగాణా వ్యాప్తంగా 15-20 వేల మంది జైలుపాలుకాగా 40 - 50 వేలమంది విమోచన పోరాటంలో పాల్గొన్నట్లుగా అంచనాలలో తెలుస్తుంది. ఈ పోరాటాలలో కనీసం 4 వేల మంది గెరిల్లా సైనికులు, సామాన్య ప్రజలు తమ ఆత్మ బలిదానం చేసినట్లు అంచనాలో తెలుస్తోంది.

ఈవిధంగా సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కమ్యూనిస్టుల పాత్ర శ్లాఘనీయం.

భారత ప్రభుత్వం నైజాం ప్రభుత్వంతో జరిపిన యధాతధ ఒడంబడికతో పాటుగా రాయబారాలన్నీ విఫలం అయ్యాయి. నైజాం సైన్యం మరియు రజాకార్ల మూకలు జరుపుతున్న అరాచకాలను తీవ్రంగా ఖండించారు. బల ప్రయోగం ద్వారానైనా విలీనం చేసుకోవాల్సిందేనని భావించి భారత ప్రభుత్వం ప్రజల పక్షాన నిలుస్తూ సంస్థానం నలువైపుల నుండి సైనిక చర్యను ప్రారంభించింది.

1948 సెప్టెంబరు 13వ తేది నాడు ప్రారంభించబడిన ఈ 'పోలీస్ ఆక్షన్'ను

నైజాం పోలీసులు గాని, రజాకార్ల దళాలు కాని ఎదిరించలేకపోయాయి. అయినా వీడని మొండి సాహసంతో నైజాం సైనిక బలాలు ఎదిరించినా ప్రతిసారీ విఫలమై పోయారు.

సెప్టెంబర్ 13న ప్రారంభమైన 'పోలీస్ యాక్షన్' సెప్టెంబర్ 17న ముగిసింది. భారత హోం శాఖామాత్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్ గారికి నిజాం రాజు లొంగిపోయాడు. భారత యూనియన్‌లో చేరిపోతున్నట్లు సంతకాలు చేయడం కూడా జరిగింది. ఇది హైదరాబాద్ సంస్థాన ప్రజలు సాధించిన ఘన విజయం. ప్రజలు సాధించిన అపూర్వ విజయం.

ఈదేశంలో రాచరిక వ్యవస్థకు చరమగీతం పలకడం జరిగింది. ఇక హైదరాబాద్ సంస్థానం రాజకీయ ప్రజాస్వామ్య జీవితంలోనికి ప్రవేశించడం జరిగింది. ముఖ్యంగా తెలంగాణా ప్రజల చైతన్యంలో గొప్ప మార్పు వచ్చింది. గ్రామ గ్రామాన జాతీయ పతాకాలు నింగి ఎత్తుగా రెపరెపలాడాయి. తెలంగాణ ప్రజావళి ఆనందంతో పరవశించి పోయింది.

కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర మహాసభల వేలాది కార్యకర్తలు ఈ నూతన బాధ్యతల నిర్వహణకై సుశిక్షితులుగా, కార్యదక్షులుగా సంసిద్ధంగా వుండి ఉన్నారు.

**15** ఆగస్టు **1947** నుంచి **1948** సెప్టెంబర్ **17**వ తేదీ వరకు అంటే **13** మాసాలుగా కొనసాగిన ఈ సంస్థాన విమోచన విప్లవోద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పాత్ర అద్వితీయమైనదిగా చెప్పుకోవచ్చును.

విజయోత్సవాలను గ్రామ గ్రామాన జరుపుతున్న ప్రజలు అంతలోనే బెంబేలు పడాల్సి వచ్చింది. ఎందుకంటే ప్రజాద్రోహులుగా నైజాం తొత్తులుగా ముద్రపడి ప్రజల ఆగ్రహానికి గురైన భూస్వాములు తిరిగి గ్రామాలను చేరుకోవడం జరిగింది. ప్రజలు పంచుకున్న భూములలో అత్యధిక భాగాల్ని తిరిగి తీసుకోవడం జరిగింది. ఈ భూస్వాముల్లో అత్యధికులు అమాంతం కాంగ్రెస్ తీర్థం తీసుకొని తమ రాజకీయ అండదండల్ని సమకూర్చుకోవడం జరిగింది.

ఇలాంటి పరిస్థితులలో కమ్యూనిస్ట్ పార్టీ అనుసరించిన రాజకీయ విధానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక సవాలుగా మారింది. వీరి నిర్ణయాల ప్రకారం వందల సంఖ్యలో ఉన్న గెరిల్లా దళాల్ని కొనసాగించాలి. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని కూలదోయాలి అనే పిలుపుకు కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. హైదరాబాదులో ఏర్పడిన సైనిక ప్రభుత్వానికి అవసరమైన అండదండలు అందించి కమ్యూనిస్ట్ పార్టీ దాని సాయుధదళాలపై సైనిక ప్రభుత్వం విరుచుకుపడింది. నంజప్ప లాంటి అత్యంత క్రూరులైన అధికారులకు తెలంగాణాను అప్పగించారు.



**1948**లో ప్రారంభమైన ఈ అణచివేత **1951** మధ్యభాగం వరకు కొనసాగింది. పోరాటాన్ని ఉపసంహరించుకుంటున్నాం అని కమ్యూనిస్ట్ పార్టీ ప్రకటన చేసిన తరువాతనే అణచివేత కార్యక్రమం ఆగిపోయింది.

అయినా ఈ ఆత్మరక్షణ పోరాటాన్ని కొన్ని వేల గెరిల్లా సైనికులు తమ శక్తివంచన లేకుండా నిర్వహించారు.

అయితే తెలంగాణా సాయుధ పోరాటంలో వీర మరణం పొందిన నాలుగు వేల మంది మరణించి తమ సిద్ధాంతాన్ని బ్రతికించుకున్నారు.

ఈ నాలుగు వేల మరణాల్లో అధికశాతం మరణాలు పోలీస్ యాక్షన్ తరువాత కొనసాగిన సాయుధ పోరాటకాలంలో జరిగినవే.

వీరందరికి మా శ్రద్ధాంజలి. తల్లి కాలదాస్య శృంఖలాలు తెంపి సౌభాగ్యం కోసం ఊపిరులను ధారపోసిన వీరులంతా అమరవీరులు.

**1947** సెప్టెంబర్ నుండి **1951**వ సం. అక్టోబర్‌లో అరెస్ట్ అయ్యే వరకు సుమారు **4** సం.ల పాటు కొనసాగిన రహస్య జీవితంలో ఎన్నో పాఠాలు, మరెన్నో అనుభవాలు. ఆ అనుభవాలలో కొన్ని

కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా ఉన్న రాజేశ్వరరావు గారిని హైదరాబాద్‌లో అరెస్టు చేయడానికి ప్రత్యేక నిఘా విభాగం పనిచేసింది. అప్పుడు వీరు చిక్కడపల్లి దేవాలయం సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఉన్నారు. వీరితో పాటు వీరి భార్య లలితాదేవి, వారి అమ్మగారు చంద్రమ్మగారు, పాప అరుణ, సోదరుడు హన్మంతరావులతో కలిసి ఉండేవారు. నిండా జనారణ్యం అయినా అది వీరి రహస్య స్థావరమే. వీరి స్థావరాన్ని కాపలాకాస్తూ వారి అవసరాలను తీర్చడానికి వీరి ఆత్మబంధువు వీరి బావగారైన పోల్కంపల్లి వెంకట రామారావుగారి మేనల్లుడు

ఎల్.ఐ.సి. అధికారి ఎన్. ధర్మారావు గారు అన్ని విధాలుగా ఆదుకునేవారు రాజేశ్వరరావు గారిని. వీరు మంచి మిత్రులు.

ఈ రహస్య జీవితంలో కూడా వీరి దినచర్య చాలా పకడ్బందీగా వుండేది. వీరు రేయింబవళ్ళు అప్రమత్తంగా వుండేవారు. రాత్రిళ్లు నారాయణగూడలో ఉన్న ధర్మారావు గారి ఇంట్లో గడుపుతూ, తెల్లవారకమునుపే సైకిల్‌పై చిక్కడపల్లి స్థావరాన్ని చేరుకుని పగళ్ళు గడిపేవారు. ఎలాగోలా పోలీసులకు వీరి స్థావరం ఆచూకీ తెలిసిపోయింది. ఇంక వారు వీరిని అరెస్ట్ చెయ్యడానికి చక్కటి ప్రణాళిక వేసుకొని ఇంటి చుట్టూ సాయుధ పోలీసులను కాపలా పెట్టారు. వీరు యధా ప్రకారం తెల్లవారుఝాము 5 గంటల వేళ సైకిల్‌పై వీరి స్థావరానికి బయలుదేరి వెళ్ళారు. అక్కడ ఒక పోలీస్ వీరి సైకిల్‌ని ఆపి సైకిల్ హ్యాండిల్‌ని బిగ్గరగా పట్టుకుని ఉర్దూభాషలో ఈ రోజు సిహెచ్. రాజేశ్వరరావుని అరెస్ట్ చేసేందుకు ఏర్పాట్లు చేశాం, వారి స్థావరం చుట్టూ గట్టి కాపలా పెట్టాం, కాబట్టి తెల్లవారేవరకు ఎవ్వరూ పోవడానికి వీలులేదు అన్నాడు.

అప్పటికి పరిస్థితి వారికి అర్థమైపోగా ఆ జవాను గుర్తించలేదని ధైర్యంతో మా కుటుంబాన్ని కాచిగూడ స్టేషన్‌కు తీసుకొని వెళ్ళాలి. టిక్కెట్లు కొన్నాను. ఆలస్యం కాకూడదు కదా అన్నారు. అప్పుడు అతడు ఐతే పక్కనే కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి గారున్నారు. వారి అనుమతి తీసుకొని లోనికి వెళ్ళవచ్చు అన్నాడు.

రాజేశ్వరరావు గారిని అరెస్ట్ చేయించడానికి సత్యనారాయణ రెడ్డి స్వయంగా పథకం వేసినవాడు. వారిని బాగా గుర్తుపడతాడు కాబట్టి అక్కడికి వెళ్ళే అవకాశం లేదు. అందుకని జవానుతో అంతదూరం ఎందుకులే టిక్కెట్టు వాపసు చేస్తాను ప్రయాణాన్ని వాయిదా వేస్తాను అని అనగానే జవాను వెళ్ళండి తిరిగి ఈ బాట రాకండి అంటూ ఆజ్ఞాపించాడు.

వీరు తిరిగి కేంద్రానికి చేరుకున్నారు. తెల్లవారగానే చిక్కడిపల్లి ఇంటిపై పోలీసుల దాడి జరిగింది. ఇంట్లో వారంతా వారికేమి తెలియదని చెప్పడం, ఇల్లంతా వెదికి పుస్తకాలు, కాగితాలను వ్యాన్‌లోనికి ఎక్కించుకున్నారు. ఇంట్లో ఉన్న వీరి తమ్ముడిని నువ్వు కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడవా అని అడిగితే వీరి తమ్ముడు సిహెచ్. హన్మంతరావు



గారు ఎలాంటి జంకు బొంకు లేకుండా అవును అని నిర్భయంగా సమాధానం ఇస్తే వారిలో ఒక అధికారి అయితే స్టేషన్‌కు వచ్చి మీ వస్తువులు తీసుకొని వెళ్ళమని పోలీస్ వ్యాన్‌లో ఎక్కించుకు వెళ్ళి పోయారు. అక్కడ పోలీసులు వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపించారు.

అది మరాట్వాడా లోని జాల్నా జైలు. అది కఠిన కారాగారంగా పేరు పొందినది. జైళ్లలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేసి ఖైదీలకు రాజకీయ శిక్షణ, పోరాట కార్యక్రమాల విధి విధానాలను ప్రచారం చెయ్యాలని పార్టీ ఇచ్చిన పిలుపుకు అనుగుణంగా సిహెచ్. హన్మంతరావు గారు అక్కడి జైలు కమిటీలో చురుకుగా పనిచేసినారు. వీరు నిరంతర ఉద్యమాలకు పూనుకొన్నందుకు జైలు అధికారులు ఆహారం ఇతర సౌకర్యాలను బాగా తగ్గించి ఇబ్బందుల పాలు చేసారు. ఆహార కొరత నిర్బంధ విధానం వలన హన్మంతరావు గారి జీర్ణవ్యవస్థ బాగా దెబ్బతిన్నది. వీరికి ప్రాణాపాయం జరుగుతుందని భావించి వీరిని జైలు నుంచి విడుదల చేసారు. వీరు నడవలేని నిస్సహాయస్థితిలో జాల్నా స్టేషన్ చేరి పూర్తిగా శక్తి సన్నగిల్లగా ఒక బెంచి క్రింద పడుకుండిపోయారు.

తర్వాత చాలాసేపటికి ఒక రైల్వే కూలీ చీకటిలో అటుగా వచ్చి తన వద్ద ఉన్న సిగ్నల్ లైట్ వేసి బెంచి కింద పడుకున్న హన్మంతరావు గారిని చూసి ఎవరూ అని పలకరించి బాపు మీరా అని గుర్తు పట్టడం హన్మంతరావు గారి అదృష్టం.

ఆ రైల్వే కూలీ పేరు ఎల్లయ్యా. అతను సిరిసిల్లా తాలుకా చీర్లవంచ గ్రామానికి చెందినవాడు. ఇతడు చిన్నవాడుగా నాగారంలో వారి ఇంటిలో ఉద్యోగం చేస్తూ చిన్న పిల్లాడిగా ఉన్న హన్మంతరావుని ఎత్తుకుని ఆడించేవాడు. అందుకే అతడు అంత త్వరగా గుర్తు పట్టి కలవరపడిపోయి ఆశ్చర్యానికి లోనై అప్పటికే నీరసించిన హన్మంతరావు గారి పరిస్థితిని అర్థం చేసుకుని అమాంతం భుజాలపై ఎత్తుకుని తన గుడిసెకు తీసుకొని వెళ్ళి స్నానం చేయించి గుడ్డలు మార్చి తినిపించి ఆ తర్వాత హైదరాబాదులో ఒక స్థావరానికి చేర్చినాడు.

ఈ విషయం తెలుసుకున్న వీరి తల్లిదండ్రులు వచ్చి వారిని కరీంనగర్‌కు తీసుకొని పోయి అనేక సపర్యలు చేసారు. ఇంట్లోనే వుంటూ పార్టీ సమాచారాన్ని తెలుసుకునేవాడు హన్మంతరావు గారు.

ఇలాంటి పరిస్థితులలో లలితాదేవి ప్రదర్శించిన సాహసం, ధైర్యం ఎంతో పొగడదగినది. భర్తను అరెస్ట్ చేయడానికి పోలీసులు వేటాడుతున్నారు. మగదిక్కుగా ఉన్న హన్మంతరావు జైలు పాలైనాడని ఏ మాత్రం వెరవకుండా లలితాదేవి మనో నిబ్బరాన్ని కనబరచారు. తన చిన్నపాప అరుణ, అత్త చంద్రమ్మను కంటికి రెప్పలా కాపాడారు.

ఈ క్రమంలో గెరిల్లా దళాలు మంథిని, మహాదేవ్‌పూర్, జగిత్యాల, సిరిసిల్ల అడవి ప్రాంతాల్లో పనిచేస్తూ గ్రామ గ్రామాన పోరాట సందేశాలను పంపుతూ చురుగ్గా పనిచేస్తున్నాయి. ఈ విషయాలు తెలుసుకున్న హన్మంతరావు గారు వెంటనే దళాలతో చేరిపోయాడు. పూర్తిగా కోలుకోని వారి ఆరోగ్యం, అంతంత మాత్రం ఆరోగ్యంతో దళయాత్రలు నిర్వహించారు. తిరిగి ఆరోగ్యం పాడైంది. నడవలేని పరిస్థితి కలిగింది. వీరి అవస్థ తెలుసుకున్న రావు గారు నేరుగా రాష్ట్ర కేంద్రానికి చేరుకోమని కబురు పంపిస్తే హన్మంతరావు గారు పట్టించుకోలేదు, ఉన్నచోటు నుండే పనులు నిర్వహిస్తుండేవారు.

రావు గారు మాత్రం చాలా ఆందోళనకు గురియై రాష్ట్ర నాయకులైన మగ్దూం గారిచే ఉత్తరం రాయిస్తే మగ్దూం గారి మాట కాదనలేక రావు గారు కలిసి ఉండే స్థావరానికి చేరుకున్నారు. వారి పరిస్థితి హృదయవిదారకంగా ఉంది. వారికి అందుబాటులో ఉన్న చికిత్సలు జరిపించారు.

ఇంటిదగ్గరే ఉండి ఆరోగ్యం కాపాడుకుంటూ చికిత్స తీసుకొని కొద్దికాలంలో కోలుకున్నాడు. ఈ విశ్రాంతి సమయంలో కూడా దళ సభ్యులకు, ఇంట్లో ఉన్న ఇతర మహిళలకు రాజకీయ శిక్షణ అందించే బాధ్యతను తీసుకొన్నారు. ఇలా కొంతకాలం గడవక ముందే అరెస్ట్ అవ్వడం, పోరాట విరమణ ప్రకటన తర్వాతనే విడుదల అవడం జరిగింది.

ఈ సమయంలో లలితాదేవి చూపిన ఔదార్యం, వాత్సల్యం, ఆత్మీయత మరువలేనిది. మరిది అనారోగ్యంతో వచ్చినప్పుడు కంటికి రెప్పలా కాపాడుకొన్నారు. తల్లిదండ్రుల ప్రేమను పంచారు. వారు త్వరగా కోలుకోవడానికి అవసరమైన అన్ని సపర్యలు చేసారు. వారు ఇచ్చిన రాజకీయ శిక్షణను చక్కగా అవగాహన చేసుకుని



తోటి మహిళలకు చక్కగా వివరించేవారు. వారిని ఉద్యమాలలో సహకరించడానికి ప్రేరేపించేవారు.

**సిటీ కాలేజ్ సంఘటన :**

అవి అత్యంత కఠినమైన నిర్బంధ విధానం కొనసాగిన రోజులు. కమ్యూనిస్ట్ కనిపిస్తే నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపటం జరిగేది. ఇలాంటి సంఘటనలు ఎన్నెన్నో గ్రామాల్లో జరిగాయి.

కాని గ్రామాలలో సామాన్య ప్రజానీకం మాత్రం కమ్యూనిస్ట్ నాయకులను, కార్యకర్తలను గౌరవించేవారు. సురక్షితంగా తప్పించుకునేలా సలహాలు, సూచనలు ఇచ్చేవారు.

సిటీ కాలేజ్‌లో ఇంటర్ చదువుతున్న ఎక్బాల్ పార్టీ సభ్యుడి ఇంట్లో రహస్య జీవితం గడుపుతున్నారు. అప్పుడు ఉర్దూ భాషకు బాగా ప్రాముఖ్యత ఉండేది. కాబట్టి ఉర్దూ భాషలో నేహూ ప్రభుత్వాన్ని కూలదోయడమే విద్యార్థుల తక్షణ కర్తవ్యమంటూ కరపత్రాలు సైక్లోస్టైల్ చేసి పంపకం చేయించడం జరిగింది.

బాహాటంగా కరపత్రాలు పంచిన విషయం పోలీసులకు తెలిసి వారు కాలేజిలో ఎక్బాల్‌ను అరెస్ట్ చేసి వ్యాన్ ఎక్కించి ఇంటికి తీసుకువెళ్ళమంటున్నారు. ఆ పోలీసులు రావు గారిని అరెస్ట్ చేయడానికి నియమించినవారే. అందుకే ఎక్బాల్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్ళకుండా ఇంటికి తీసుకుపొమ్మని ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయాన్ని కనిపెట్టిన మరొక చురుకైన ముస్లిం విద్యార్థి ఎక్బాల్ ఇంట్లో వుండే కమ్యూనిస్ట్ నాయకుని అతని సాహిత్యాన్ని కాపాడాలన్నదే అతడి ధ్యాస. అతడు అతివేగంగా ఇంటికి వచ్చి తలుపులు తీయండి పోలీసులు వస్తున్నారు పారిపోండి అని అరవగానే రావు గారు విషయం గ్రహించి అతడి సైకిల్‌పై ఎక్కి ప్రక్కసందులోకి వెళ్ళి తలదాచుకున్నారు.

రెండు మూడు నిమిషాలలోనే పోలీస్ వ్యాన్ రావడం ఇల్లంతా వెతకడం, రావు గారి దుస్తులు, సైక్లో యంత్రాన్ని పట్టుకెళ్లడం జరిగింది. ఎక్బాల్‌ను తీసుకెళ్ళి కటకటాల పాలు చేసి చిత్రహింసలు పెట్టారు. ఎక్బాల్ తల్లికి రావుగారు గయాసుద్దీన్‌గా మాత్రమే తెలుసు. ఇతర వివరాలు ఏమీ తెలియవు. ఆ సైకిల్‌పై వచ్చిన వ్యక్తి పేరు మొయినుద్దీన్.

**నవాబు గారి కబాబులు :**

రహస్య జీవితంలో ఉన్న రావుగారిని సిగ్బతుల్లా సిరిసిల్లా వాసి సుప్రసిద్ధ వకీలు 'ఆగాయి' గారి కుమారుడు రాజేశ్వరరావు గారిని నవాబు గారింట్లో ఉండే ఏర్పాట్లు చేశారు. అక్కడ రాజేశ్వరరావు గారి పేరు గయాసుద్దీన్ పేరుతో నవాబు గారికి పరిచయం చేయబడ్డారు. వేష భాషలు మార్చుకొని ప్రతి శుక్రవారం దగ్గరలోని మసీదులో ముస్లిం సోదరులతో కలిసి రావు గారు ప్రార్థనలకు వెళ్ళేవారు. కాని డేగ కన్నులతో రావు గారిని గాలిస్తున్న పోలీసులకు ఆగాపూరాలో వున్న నవాబు ఇంటి పరిసరాల్లో ఉన్నట్లు పసిగట్టారు. కాపలా పెంచారు. అనుమానస్థుల్ని ప్రశ్నించారు.

నవాబు గారిని కలిసి రావు గారి శిష్యుడు సిగ్భతుల్లా పరిస్థితిని వివరించారు. అది విని నవాబు గారు పెద్దగా స్పందించలేదు. ఎప్పటిలా రాత్రిపూట మా ఇంట్లోనే ఉండాలి అని మరీ మరీ చెప్పారు. వీరు మాత్రం వారి జాగ్రత్తలో వారు వుండేవారు. ఒకనాటి రాత్రి రెండవ ఆట సినిమా అయ్యే వేళ యధావిధిగా ఇంటికి వచ్చారు రావుగారు. ఇంట్లో అడుగుపెట్టగానే నవాబు గారి వెంట ఒక పోలీస్ అధికారి ఉన్నారు. నవాబు గారు ఏం గయాస్‌భాయ్? ఇంత రాత్రి వరకు పనిచేస్తే ఎలా ? వేళకు నిద్ర కూడా అవసరం లేదా ? అని ఉర్దూలో సహజంగా అడిగారు. దానికి రావు గారు చిరునవ్వుతో సమాధానం చెప్పి వారి గదిలో తలుపు వేసుకున్నారు. తెల్లవారి తెలిసింది అసలు విషయం. రావు గారి గురించి వెతుకుతున్న ఆ పోలీస్ బృందాన్ని ప్రత్యేకంగా వీరే భోజనానికి పిలిచి కబాబులు, మందు పార్టీ ఇచ్చి వారు చేస్తున్న ప్రయత్నాలు, తిరిగే ప్రదేశాలను అన్నింటిని రాబట్టుకుని సిగ్బతుల్లాకు తెలియజేసేవారు. వారు అందరికి తెలియజేయడం అందరు ఎంతో చాకచక్యంతో వారికి దొరకకుండా వుండడం జరిగింది.

**సబ్జిమండి స్థావరం :**

హైదరాబాద్ పాతబస్తీలోని పురానాపూల్ సమీపంలో సబ్జిమండి ఉన్నది. స్థానిక నాయకుల సహకారంతో ఒక విశాలమైన ఇంటిని అద్దెకు తీసుకున్నారు. అది 1949వ సంవత్సరం. ఈ ఇంట్లో చాలాకాలం రహస్య జీవితాన్ని గడిపారు. ఈ ఇంట్లో రావుగారితో పాటు వారి పాప అరుణ, భార్య లలిత మరియు ఇతర ముఖ్య నాయకులు



మగ్దూంగారు, టి.బి. విఠల్ రావు గారు, ఖాసిం గారు, బలరాం గారు వారి భార్య భాగ్యమ్మ గారు ఇంకా కీ.శే. ఇందిర గారు, కీ.శే. సుశీల గారు అందరూ కలిసి ఒకే ఇంటిలో ఉండేవారు.

ప్రొద్దంత ఇంట్లోనే ఉంటూ రాత్రిపూట ఎవరి పనుల నిమిత్తం వాళ్ళు వెళ్ళి రెండవ సినిమా వదిలివేసే సమయానికి జనంలో కలిసిపోయి ఇంటికి చేరుకునేవాళ్ళు మగవారు.

ఇంట్లో పని అంతా వంతుల వారిగా చేసుకొని, కలిసికట్టుగా అందరు వంటపని, పరిశుభ్రత చూసుకునేవారు. అందరిది ఒకే మతం. ప్రజల సంతోషమే వారి మతం, కులం.

ఇంట్లో అనేక చర్చలు జరిగేవి. కార్యకర్తల త్యాగాలు, బాధలు, గాధలు నైరాశ్యాన్ని కలిగించేవి.

ఇలా ఉండగా ఒకరోజు ఖాసిం గారు బయటికి వెళ్ళి తిరిగి రాలేదు. వారు అరెస్ట్ అయ్యారనే విషయం తెలిసింది. మరికొంత కాలానికి టి.బి. విఠల్‌రావు గారు కూడా అరెస్ట్ అయ్యారు.

ఇక మిగిలింది రావు గారు, మగ్దూం గారే. వారి ఇద్దరిదీ ఒకటే బాట, మాట అని తెలుసు నాయకులకు. పోరాటాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వారి ఆలోచన అన్న విషయం పార్టీకి తెలుసు. అందుకే వారు ఒత్తిడి తెచ్చారు. నెలసరి పంపబడే జీతాలు పంపడం మానివేసారు. చాలా ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. తినడానికి తిండి లేని పరిస్థితి. ఆ సమయంలో లలితాదేవి మెడలోని 12 తులాల చంద్రహారం బంగారం గొలుసు అమ్మివేసి ఆ డబ్బుతో ఎలాగో రెండు నెలల కాలం గడిపారు. తరువాత కరీంనగర్ నుంచి ఒక మిత్రుడు పంపిన డబ్బుతో మరో రెండు మాసాలు గడిచాయి. ఆ తర్వాత తీవ్ర ఇబ్బంది ఎదుర్కోవాల్సి వచ్చింది. పెద్దవారు ఎలాగోలా తట్టుకుంటారు.

చిన్నపాప అరుణ పరిస్థితి దారుణం. ఆకలికి తట్టుకోలేదు కదా. పస్తులుండలేదు కదా. ఈ సమయంలో కూడా లలితాదేవి గారు మొక్కవోని ధైర్యంతో ఎలాంటి నిరాశ నిస్పృహకు లోనుకాకుండా భర్తకు అనుక్షణం సహకరిస్తూనే ఉన్నారు.

డబ్బులు లేక రేషన్ లేక పడ్డ బాధలు వర్ణనాతీతం. ఒకరోజు ఎలాగోలా శెనగలు సంపాదించి వాటితో నాలుగు రోజులు గడిపేసారు. ఇలాంటి దీనమైన పరిస్థితులలో వారి మేనమామ స్వాతంత్ర్య సమరయోధుడు కీ.శే. ఆనందరావు గారు తమకు కూతురు పుట్టిన సంతోషంతో పది రూపాయలు పంపించారు. ఆ పది రూపాయలే మహాభాగ్యం. ఎంతో సంతోషంతో ఆ డబ్బులతో ఒకపూట మంచి బిర్యానీ వండుకుని అందరు తినాలని నిర్ణయించుకొని మసాలాలు కొని తెచ్చేపని మగ్దూం గారికి అప్పగించగా వారు సంతోషంగా సరుకులు కొని తెచ్చారు. వారు తెచ్చిన సరుకులతో బిర్యానీ వండుకుని తిందాం అని నోట్లో పెట్టుకొనేసరికి నోర్లు మండిపోయాయి. మసాలాలలో షాజీరా మోతాదుకి మించి ఉపయోగించామని అర్థం చేసుకుని బిర్యానీని వృధాగా పారెయ్యడం ఇష్టం లేక బిర్యానీని కడిగి ఆరబెట్టుకుని హాయిగా భుజించారు.

ఈవిధంగా దినదిన గండంగా రోజుకొక యుగంగా ఆనాడు పడ్డ కష్టాలు చెప్పనలవి కానివి. ఈ కష్టాలను లలితాదేవి చిరునవ్వుతో ఓర్చుకున్నారు. భర్తకు అన్ని విధాలా సహకరించారు. ఏనాడు భర్తను ప్రశ్నించలేదు, కష్టాలకు కుంగిపోలేదు.

ఇలా ఉండగా ఒకరోజు ఇంటికి వచ్చేసరికి శ్రీమతి సుశీల, శ్రీమతి లలితాదేవిలు నిండుగా దుప్పటి కప్పుకొని పడుకొని ఉన్నారు. పాప నిద్రపోతోంది. నిశబ్దంగా ఉన్నారు. ఏమి జరిగింది అని ప్రశ్నిస్తే జవాబు లేదు. పదే పదే అడగగా లలితాదేవి గారు కోపంగా పార్టీకి ద్రోహం చేసి శత్రువులతో కలిసిపోతున్నారని పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇలాంటి ద్రోహం ఎలా చెయ్యగలరనుకుంటున్నారు అని లలితాదేవి గారు ఉక్రోషంతో, ఆవేశంతో అడగగా రావు గారు ఆశ్చర్యపడి మేము పార్టీకి ద్రోహం చెయ్యడమేమిటని ప్రశ్నించగా లలితాదేవి గారు చెప్పారు. ఇంతకుముందే పార్టీ కార్యదర్శి గారు వచ్చి వెళ్ళారు. దాదాపు రెండు గంటలు మాతో మీ గురించి చర్చించారు. పార్టీలో వుంటారా ? పార్టీకి ద్రోహం చేస్తున్నారా ? అని మాట్లాడారు. నేను, సుశీల వారికి సర్ది చెప్పాం. పార్టీని వదిలి వెళ్ళే ఖర్మ రానేరాదని చెప్పాము అని లలితగారు చెప్పగానే రావు గారికి అర్థం అయిపోయింది. లలిత గారికి పార్టీ మీదున్న అభిమానానికి రావు గారికి చాలా సంతృప్తి కలిగింది.



రాజకీయ అభిప్రాయ బేధాలు కుటుంబాల్ని బాధపెట్టే దశకు చేరిపోయాయని రావు గారు గ్రహించి చాలా బాధపడిపోయారు. తరువాత మగ్దూం గారికి అంతా వివరించి చెప్పగా వారు ఇద్దరు మహిళలను కూర్చోబెట్టుకుని సుదీర్ఘ పాఠాన్నే వారికి బోధించారు.

మగ్దుం గారు చేసిన బోధనతో ఆ ఇద్దరు మామూలు మనుషులు కాగలిగారు.

**కల్పన జననం :**

రహస్య స్థావరాలను భద్రతా అవసరాలను బట్టి తరుచూ మార్చుకోవాల్సి వచ్చేది.

అలా ఒకానొక స్థావరంలో రావు గారి కుటుంబంతో పాటుగా మగ్దూం గారు, రావు గారి సోదరుడు హనుమంతరావు గారు కలిసి ఉండేవారు. అక్కడ రావు గారి పేరు రమణారావు. అడ్వకేటు పని నేర్చుకుంటున్నట్లుగా రాత్రిపూట అడ్వకేటు కార్యాలయానికి వెళ్ళి వస్తున్నట్టు మగ్దూం గారేమో మాధవరావు గారని స్వయంగా రావు గారికి అన్నగారని ఇటీవలే భార్య మరణించిన కారణంగా అలా వుంటారని, వారిది నల్లగొండ జిల్లా అని, భూస్వాములని, కమ్యూనిస్టు బాధితులని చెప్పుకొని మారు పేర్లతో రహస్య జీవితం గడుపుతున్నారు.

ఆ చుట్టుపక్కల చాలామందికి న్యాయపరమైన సలహాలు ఇచ్చేవారు. వారికి ఎలాంటి అనుమానం వచ్చేది కాదు. వారిని అందరూ ఆదరించేవారు, గౌరవించేవారు.

అప్పుడే 1950 సం. నవంబర్ 24వ తేదీన లలితాదేవి గారికి రెండవ అమ్మాయి కల్పన జన్మించింది. లలితాదేవి గర్భవతిగా ఉన్నప్పటి నుండి బాలింత వరకు సపర్యలు చేయడానికి ఇంట్లో ఆడదిక్కు లేదు. ఇది చాలా ఇబ్బందులు కలిగించింది.

లలితాదేవి గారే ఆరోగ్యం బాగాలేక వున్నా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎంతో ఓర్పుతో, సహనంతో తన ఆరోగ్యాన్ని చూసుకుంటూ కుటుంబానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేవారు.

సహచరులుగా ఉన్న మగ్దూం, హన్మంతరావు గార్లు ఎంతో తోడ్పడ్డారు. గర్భవతిగా ఉన్న లలితాదేవి గారిని తరుచుగా వైద్య పరీక్షల నిమిత్తం మొజంజాహి మార్కెట్‌లోని బన్సీలాల్ ఆస్పత్రికి తీసుకెళ్లడం, తీసుకురావడం హన్మంతరావు గారు

అతి జాగ్రత్తగా చూసుకునేవారు. తర్వాత లలితాదేవి ప్రసవం తర్వాత కూడా హన్మంతరావు గారే ఆసుపత్రిలో దగ్గర ఉండి సేవచేయడం ఎంతో అభినందనీయం.

ఇక మగ్దూం గారు చంటిపాపతో లలితాదేవి ఇంటికి వచ్చిన తరువాత పెద్దమనిషి తరహాలో సలహాలు ఇస్తూ లలితాదేవి పెద్దపాప అరుణ ఆలనా పాలనా చూసుకునేవారు. అరుణకు చీర కట్టుకోవడం ఇష్టమని చిన్న చీరను పోలిన గుడ్డను తెచ్చి చీరగా కట్టించి లాలించేవారు, ఎంతో ఆప్యాయంగా చూసుకునేవారు.

చాలాసార్లు డబ్బు లేక పస్తులుంటూ శనగలు, జొన్నలు దొరికినప్పుడు వాటిని తింటూ సమయం గడిపిన సమయంలో మగ్దూం గారు వారి చేతి రుమాలులో బయటి నుండి అన్నం తెచ్చి చిన్న పాప అరుణకు తినిపించేవారు. ఇలా చాలాసార్లు చేసారు. ఇది వారి ప్రేమ, దయకు నిదర్శనం. ముఖ్యంగా రావుగారి పట్ల ఆయనకున్న అభిమానాన్ని తెలుపుతుంది.

ఇలా ఇద్దరు పిల్లలతో లలితాదేవి గారు ఎంతో ఓర్పు సహనంతో కుటుంబాన్ని ఇంటి బాధ్యతలను చక్కగా చూసుకునేవారు.

ఎన్నోసార్లు రావుగారు ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు లలితాదేవి గారు తన ఇద్దరు పిల్లలతో ఎంతో ధైర్య సాహసాలతో రహస్య స్థావరాలలో గడిపిన రోజులు ఎన్నెన్నో.

భర్త పైన గల అచంచల ప్రేమ, గౌరవం కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతానికి మనసా, వాచా కట్టుబడి ఉండడం, వివేకవంతురాలుగా, సమయస్ఫూర్తితో మెలుగు కోవడం, నరనరాన స్వాతంత్ర్య కాంక్ష కలిగి ఉండటం లలితాదేవి గారి గొప్పతనం.

రాజేశ్వరరావుగారు 1950 సం. ప్రాంతంలో కలకత్తాలో బాంబుల తయారీ శిక్షణకు హాజరైనప్పుడు అడవుల్లో దళ నాయకుడిగా ఉన్న పెండ్యాల రాఘవరావు గారిని ప్రాణాలకు తెగించి కలవటం.

**1950** జనవరి **26** నాడు కలకత్తాలో బ్లాక్‌డేగా నిర్వహించినప్పుడు కలకత్తాలో అఖిల భారత శాంతి మహాసభల హాజరు బొంబాయి యాత్ర, బాబా సాహెబ్ అంబేద్కర్‌ను **1946**లో స్వయంగా బొంబాయి నగరంలో కలవడం, వారి భావజాలాన్ని తెలుసుకోవడం ప్రత్యేక ఘట్టాలు.



ఇవన్నీ కూడా లలితాదేవి గారిపైన పరోక్షంగా ప్రభావం చూపాయి. వారిలో ఇంకా పార్టీకి సేవ చేయాలనే భావం పెంపొందింది.

**1951** తర్వాత తెలంగాణా సాయుధ పోరాట విరమణ తర్వాత కూడా పోలీసుల అరెస్టులు, చిత్రహింసలు తప్పలేదు. చివరకు రాజేశ్వరరావు గారు ఉండే స్థావరం గురించి కూడా పోలీసులకు తెలిసిపోయింది. అక్కడ రావుగారు, లలితాదేవి, రావి నారాయణ రెడ్డిగారు వారి సతీమణి సీతాదేవి గారు, సిహెచ్. హన్మంతరావు గారు, సికింద్రాబాద్ పార్టీ నాయకులు శ్రీధర్, కార్మిక నాయకులు బలరాం గార్లు వుండేవాళ్ళు. వీరితో కొరియర్ వ్యవస్థ నెలకొల్పిన వారు అరెస్ట్ అయినట్టుగా, వారిని చిత్రహింసలు పెట్టినట్లుగా తెలిసి వెంటనే ఆ రహస్య స్థావరం ఖాళీ చేసి వెళ్ళాలని నిర్ణయించుకొని రావి నారాయణరెడ్డి గారు షోలాపూర్ అక్కడి నుండి బొంబాయికి, హన్మంతరావు నల్లగొండ జిల్లాకు, శ్రీధర్ బలరాం గార్లు హైదరాబాద్‌లోనే సురక్షిత ప్రాంతాలకు, రావుగారు ఇతర సహచరులతో బొంబాయి వెళ్ళాలని నిర్ణయించుకుని ఆచరణలో పెట్టారు.

ఇంట్లో ఉన్న లలితాదేవి, సీతాదేవి గార్లను ఎ. గురువారెడ్డి ఇంటికి పంపించి వేసారు. ఇంటికి తాళం వేసారు.

లలితాదేవి గారు తన కూతుళ్లు ఇద్దరితో కలిసి గురువారెడ్డి గారింట చాలాకాలం ఉన్నారు.

ఇక్కడ గురువారెడ్డి దంపతుల గురించి చెప్పుకోవాలి. వీరు జైలు నుండి విడుదలైన వారికి, రహస్యంగా ఉన్నవారికి ఉత్తరాలు పంపించడంలో అత్యంత నేర్పరులు. పోలీసులకు దొరకకుండా వీరు అందించిన సేవలు కొనియాడదగినవి.

లలితాదేవి వీరి ఇంట్లో సురక్షితంగా, తల్లిగారింట్లో ఉన్నంత ప్రేమ, ఆప్యాయతను పంచి లలితాదేవి ఇద్దరు పిల్లలని, సీతాదేవి గారిని వారు కాపాడిన విధం మరువలేనిది.

నెలరోజులు గడిచిపోయాయి. అందరు తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. మళ్లీ రహస్య స్థావరాలు కావాలి కాబట్టి వెతికారు, చాలా ఇబ్బంది పడ్డారు. ఇంతకుముందు తాళం వేసి ఉన్న స్థావరాన్ని పోలీసులు వదిలివేసారు.

రహస్య జీవులు తిరిగి అందులోకి చేరుతారు అని పోలీసులు యుక్తిగా ఆ ఇంటిని స్వాధీనపరచుకోలేదు. అందరు చేరిన తరువాత దాడి జరిపి పట్టుకోవచ్చని తెలివిగా పోలీసులు ప్రణాళిక వేసారు. ఇవేవి ఆలోచించని రావుగారు, వారి సహచరులులంతా తిరిగి ఆ ఇంటికి చేరుకున్నారు.

చేరుకున్న రెండు రోజులకే పోలీసులు దాడి జరిపి రావు గారిని, బలరాం, శ్రీధర్ గార్లని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి పట్టుకెళ్ళారు. అంతకు ముందు రోజే రావి నారాయణ రెడ్డి గారు రాజా బహద్దూర్ వెంకట రామి రెడ్డి గారి ఆరోగ్యం బాగా లేనందున రహస్యంగా కలవడానికి వెళ్ళారు. అందుకని వారు పట్టుబడలేదు.

అరెస్ట్ చేసి హెడ్‌క్వార్టర్స్ ప్రక్కనే ఉన్న క్యాంప్‌లో శ్రీధర్, బలరాం గారిని ఒక గదిలో రావు గారిని పడవేశారు. చేతులు, కాళ్లకు గొలుసులతో బంధించి మంచానికి కట్టివేసి నలుగురు సాయుధ పోలీసులను కాపలా పెట్టారు. 9 రోజులు చిత్రహింసల పాలు చేశారు. రహస్యాలను రాబట్టే విశ్వప్రయత్నం చేశారు.

రావు గారు అరెస్ట్ అయ్యారని తెలియగానే మొదటిరోజు లలితాదేవి గారు భోజనం తీసుకువెళ్ళారు. దానికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. సరికదా ఇకముందు భోజనం తేవద్దని కఠినంగా హెచ్చరించారు. ప్రభుత్వమే భోజన నిమిత్తం 6 అణాలు ఇచ్చేవారు. దానితోనే మూడు పూటలు భోజనం చేయాలి. అందులో సగం పోలీసులే తీసుకునేవారు.

అక్కడ ఉన్నన్ని రోజులు అనుభవించిన కష్టాలు చెప్పనలవి కానివి. చిత్రహింసల పాలు చేశారు. కాలకృత్యాలకు వెళ్ళినా వెంట పోలీసులు వచ్చేవారు. గొలుసులతోనే తీసుకొని వెళ్ళేవారు.

ఆ సమయంలో రావు గారు చాలా ఆలోచించేవారు. వయసుమళ్ళిన తల్లిదండ్రులు, పెళ్లి కాని చెల్లెళ్లు, భార్య ఇద్దరు ఆడపిల్లలు, చదువుకుంటున్న సోదరుల చిన్నారులు ఇలా వీరు నిర్వహించాల్సిన బాధ్యతలన్నీ కలవర పెట్టినా సామాజిక బాధ్యతలు వీరిని ఎప్పటికప్పుడు ధైర్యపరిచేవి.

వారి నాన్నగారు చెప్పిన గౌరవం, ధైర్యం, న్యాయం అనే మాటలు వీరిలో కొత్త ఊపిరి పోశాయి.



లలితాదేవి గారు ఇచ్చిన భరోసా, ధైర్యం, స్వాంతన చేకూర్చేవి. ఈవిధంగా నరకకూపం లాంటి క్వార్టర్స్ నుండి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆ జైలులో ఇంకా దుర్భర పరిస్థితులను అనుభవించాల్సి వచ్చింది. రావు గారిని, రావి నారాయణ రెడ్డి గారిని కలిపి ఒకే సెల్‌లో బంధించారు. మలమూత్రాలకు ఒక చిన్న డబ్బా, పడుకోవడానికి ఒక తట్టు, ఒక రాతిపళ్ళెం, నీళ్ల తాగడానికి ఒక లోటా, అపరిశుభ్రమైన భోజనం, నరకమే అనుభవించారు. చాలాసార్లు అధికారులతో పోరాడితే కొంచెం పెద్ద గదిలోకి మార్చారు.

ఈవిధంగా జైలు జీవితం ఒక శాపంలా సాగుతున్నప్పుడు మాత్రం ఒక చిన్న సదుపాయం, ఎంతో తృప్తిని ఇచ్చింది. వారానికి ఒకసారి జైలుకు బంధుమిత్రులను కలవడానికి అవకాశం ఇచ్చారు జైలు అధికారులు.

ఈ అవకాశాన్ని లలితాదేవి గారు సద్వినియోగం చేసుకున్నారు. వారం వారం క్రమం తప్పకుండా కలిసి వచ్చేవారు. ఎంతో ఊరట, సాంత్వన ఇచ్చేవారు.

భర్తతో దూరంగా పిల్లలతో గురువారెడ్డి గారింట్లో వుంటూనే లలితాదేవి ప్రతిసారీ ఏవో తినుబండారాలు తీసుకుని వెళ్ళేవారు. పిల్లల్ని కూడా వెంట తీసుకెళ్ళేవారు. కటకటాల వెనుక ఉన్న రావు గారిని చూసి వారి చిన్న పాప సంవత్సరం కూడా నిండనిది కల్పన లోపలికి వస్తానని మారాం చేసేది. ఏడ్చేది. రావు గారు లాలించేవారు.

జైలుకు తోడుగా యువకార్యకర్త సిహెచ్. హన్మంతరావు స్నేహితుడు యం. హన్మంతరావు లలితాదేవికి తోడుగా వచ్చి క్షేమంగా వారిని గురువారెడ్డి ఇంటి దగ్గర వదిలి వెళ్ళేవారు. లలితాదేవి గారు ఈ సమయంలో కనబర్చిన ధైర్య సాహసాలు చెప్పుకోదగ్గవి. ఇద్దరు పిల్లలను తీసుకుని తల్లివారింటికి వెళ్ళిపోకుండా వీరి వెంటే కష్టాలను, కన్నీళ్లను సమానంగా పంచుకున్న ధీరవనిత.

ఈవిధంగా జైలులో ఉన్న రావు గారిని 1952 ఫిబ్రవరి మొదటి వారంలో చంచల్ గూడా జైలు నుంచి విడుదల చేశారు.

సంవత్సరం పైగా జైలు జీవితం గడిపిన రావు గారిలో ఇంకా ధైర్యం, స్థైర్యం పెరిగింది.

అనుభవాల నుండి పరిపూర్ణత వస్తుంది. చేసిన తప్పొప్పుల నుండి పాఠాలు నేర్చుకోవడమే జీవితం. స్వయంకృషితో నిర్విరామ పరిశ్రమతో ఎదురీది రాష్ట్రంలోనే గొప్ప రాజకీయ దురంధరుడిగా ఎదిగినారు.

**1953లో జైలు జీవితం :**

పార్టీ కోసమే బ్రతకాలి, పార్టీని బ్రతికించాలి, పార్టీ నీడలో అశేష ప్రజానీకం సేదతీరాలి అంటూ రావు గారి శ్రమ, బాధ్యత వారిని మరింత బలోపేతం చేశాయి.

కరీంనగర్ జిల్లాలో రైతు సంఘ జిల్లా కార్యదర్శిగా వివిధ తాలూకాల్లో కనీసం వంద గ్రామాల్లోని భూస్వాములతో ఢీకొనడం జరిగింది. ఇలాంటి పరిస్థితులలో ఒక భూస్వామి స్థానిక డి.ఎస్.పి. గారికి లేఖ రాశారు. సిహెచ్. రాజేశ్వరరావు గారు పెరోల్ పైన ఉండి కరీంనగర్ జిల్లా దాటి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు అని వినతి పత్రం సమర్పించారు. దానిపై స్పందించింది ప్రభుత్వం. వారంరోజుల్లోనే ఉత్తర్వులు ఇచ్చింది. పెరోల్‌ను రద్దు చేస్తూ నిర్బంధిస్తున్నారని ఉత్తర్వులు ఇచ్చి వెంటనే అరెస్ట్ చేసి కరీంనగర్ జైలుకు పంపించారు. అక్కడి నుండి వరంగల్ సెంట్రల్ జైలుకు, అక్కడి నుండి హైదరాబాద్ ముషీరాబాద్ జైలుకు, ఆ తర్వాత గుల్బర్గా జైలుకు పంపించి ఐదు మాసాల కఠిన కారాగార శిక్షను అనుభవించారు.

అక్కడ జైలులో మంచి సదుపాయాలే ఉండేవి. దినపత్రికలు, పుస్తకాలు చదువుకోవటానికి అందుబాటులో ఉండేవి. అక్కడ ఏర్పడిన పరిచయాలు కీ.శే. కె.ఎల్. మహేంద్ర గారితో వారి సతీమణి కీ.శే. ప్రమీలాబాయి గారితో పరిచయం చిరస్మరణీయం.

జైలు నుంచి విడుదలైన తరువాత రెట్టించిన ఉత్సాహంతో రైతు సంఘ జిల్లా కార్యదర్శిగా బాధ్యతల్ని భుజాన వేసుకొని ఒక యజ్ఞంలా కొనసాగించటం, జిల్లా పార్టీ కార్యాలయ నిర్వహణ, జిల్లా నలుమూలలా పర్యటించటం అనేక ఆర్థిక ఇబ్బందులకు గురిచేసింది.

ఇక్కడ లలితాదేవి గారి గురించి ప్రత్యేకంగా చెప్పాలి.

ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పుడల్లా ఒంటిమీద ఒక్కొక్క బంగారు నగ తీసి



ఆ సమస్యను ఒడ్డెక్కించేవారు. ఏనాడు పార్టీ కార్యకలాపాలను విమర్శించటం, ఎత్తి చూపడం కాని చేయలేదు.

విశాలమైన కుటుంబ బాధ్యతను, ఆడబిడ్డల చదువు, మరుదుల చదువు, తన సొంత పిల్లల ఆలనా పాలనా అన్నింటిని ఎంతో సహనంతో ఓపికగా నిర్వహించారు.

అత్తమామల ఆలనా పాలనా బాధ్యతను వీరు చక్కగా నిర్వహించినారు.

వీరు అత్తమామలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్న విధానాన్ని చూసి అదేవిధంగా లలితాదేవి తన కుటుంబ బాధ్యతలను ఆనందంతో స్వీకరించేవారు.

పెద్ద భూస్వామి కుటుంబ స్థాయికి తగ్గట్టుగానే కుటుంబ గౌరవ మర్యాదలకు ఏ మాత్రం భంగం కలుగకుండా వీరు బాధ్యతలను నిర్వహించడం కత్తి మీద సాములాంటిదే.

ఆడబిడ్డల వివాహాలు, మరుదుల చదువులకు భర్తతో పాటుగా వీరు ఎంతో సహకారం ఇచ్చారు.

పరిస్థితులు అర్థం చేసుకున్న కుటుంబ సభ్యులు కూడా ఎంతో ఓర్పు నేర్పుతో ఎంతో కష్టపడి అనుకున్నది సాధించారు.

లలితాదేవి గారికి 1952 డిసెంబర్ 26వ తేదీన మూడవ కూతురు ప్రభావతి జన్మించారు.

ముగ్గురు ముద్దులు కురిపించే అమ్మాయిలను తాతయ్య, అమ్మమ్మ నానమ్మలు ఎంతో అపురూపంగా చూసుకునేవారు. వారి ప్రేమను పంచేవారు.

1956 ఫిబ్రవరి 3వ తారీఖు నాడు నాల్గవ సంతానంగా మగ శిశువు జన్మించాడు. అతడికి రమేష్ అని నామకరణం చేసారు. నలుగురు పిల్లల తండ్రిగా రావుగారు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారు.

ఈవిధంగా నలుగురు పిల్లలతో ఇల్లు తీపిగురుతుల లోగిలిగా నవ్వులు, ఆటలతో, చిలిపి చేష్టలతో ఆనంద లోగిలిగా మారిపోయింది.

**శాసన సభ్యులుగా :**

రాజేశ్వరరావు గారు మొట్టమొదటిసారి చొప్పదండి నియోజకవర్గం నుంచి 1957లో శాసన సభకు పి.డి.ఎఫ్. పార్టీ నుంచి ఎన్నికైనారు.

ఇంకా లలితాదేవికి కుటుంబ బాధ్యతలు పెరిగిపోయాయి. రావు గారిని వచ్చి కలిసే ప్రజలు, వాళ్ల బాధలు, వినతులు, విన్నపాలతో ఎప్పుడు ఇల్లు వచ్చి పోయే జనంతో కిటకిటలాడుతూ వుండేది. అందరిని ప్రేమగా పలకరిస్తూ, అన్నార్తులను అక్కున చేర్చుకుని కన్న తల్లిలా ఆదరించేవారు లలితాదేవి గారు.

26 సం. వయస్సుకే రావు గారికి పితృ వియోగం జరిగింది. 1959లో రాజేశ్వరరావు గారి తండ్రి గారు కాలధర్మం చెందారు. ఇది తీరని లోటు. బాధ్యతలు చాలా ఉన్నాయి. వీరి అవగాహన విస్తృతమైనది. సకల పార్శ్వాల నుంచీ సమస్యని పరిశీలించి ఎలా ఆచరణకి నడుం కట్టాలో బాగా తెలిసినవారు.

**రైతాంగ పోరాటాలు :**

జిల్లా పార్టీ కార్యదర్శి, రైతు సంఘ కార్యదర్శి బాధ్యతలతో 1946 - 1952 వరకు భూపోరాటాలు చాలా ఉధృతంగా జరిగాయి. జాగీరుదారులు, జమిందారులు, మఖ్తేదారులు చేతులలో ఉన్న వేల ఎకరాలను దున్నేవాడికే భూమి అనే నినాదం మేరకు ప్రత్యక్ష, పరోక్ష పోరాటాల ఫలితంగా సుమారు 3 లక్షల ఎకరాల వ్యవసాయ భూమిని రైతాంగానికి అందుబాటు లోనికి తెచ్చారు. పటేల్, పట్వారీల ఆకృత్యాలు, సంఘంలో ఉన్న అనేక దురాచారాలను వెలికి తీసి వాటి నిర్మూలనకు రాత్రింబవళ్ళు ఎంతో మంది కార్యకర్తలు, ఇతర నాయకులతో కలిసి పోరాటాలు చేసారు.

భూస్వాములతో, అధికార మదంతో విర్రవీగే జాగిర్‌దారులతో పోరాటం కత్తి మీద సాము లాంటిది. స్వంత గ్రామమైన మారుపాకలో కూడా అన్యాయాలను ఎదిరించి పోరాడి రైతులకు న్యాయం చేయాల్సి వచ్చింది. అవిద్య, అజ్ఞానం, మూఢ నమ్మకాలతో దోపిడికి గురి అవుతున్న రైతులను జాగృత పరచడం వారిని ప్రశ్నించేటట్లుగా తయారుచేయడం ఎన్నో సవాళ్ళతో కూడుకున్న క్లిష్టమైన పని. దేశ అభివృద్ధి తోనే మన అభివృద్ధి అని భావించవలెను.

అర్థరాత్రి, అపరాత్రి అని లేదు. 24 గంటలు ఎప్పుడు ఏ సమస్య వస్తుందో, ఎక్కడ భూస్వాములను ఎదిరించి భూములను రైతులకు పంచాలో అనే ఆలోచనలతో పనులతో రోజులు గడిచిపోయేవి.



ఈ సమయంలో కరీంనగర్‌లో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. ఇద్దరు చిన్న పిల్లలతో, ఐదుగురు ఆడబిడ్డలు, ముగ్గురు మరుదుల చదువుసంధ్యలు, వారి వివాహాలు, పురుళ్లు, ఇతర వేడుకలు, అత్తమామల ఆలనా పాలన, అన్నీ ఎంతో ఓర్పుతో లలితాదేవి గారు చేసేవారు.

ఎప్పుడైనా సమస్యలతో కుటుంబంలో ఏవైనా పొరపాట్లు జరుగుతాయేమో అని అనిపించగానే రాజేశ్వరరావుగారు లలితాదేవిని రెండవ ఆట సినిమాకు తీసుకొని వెళ్లి సమస్య పరిష్కారం అయ్యేట్లుగా చర్చించుకుని ఇంటికి తీసుకు వచ్చేవారు ఆమెను.

ఎందరో భూస్వాములు ఇంటికి వచ్చి లలితాదేవికి ఉద్బోధ చేసేవారు. వారి భర్తను పోరాటాలు మానుకోమని. కాని లలితాదేవి నిర్భయంగా వారితో తను భర్తను ప్రోత్సహిస్తానని చెప్పేవారు. ఏ ప్రలోభాలకు లొంగిపోని ధీనవనిత.

1962 ఎన్నికలలో ఓటమి. కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. ఇది రావు గారిలో ఎంతో ఆలోచన కలిగించింది. వారి కార్యకలాపాలకి ఒక నిర్దిష్ట దృక్పథం, సూత్ర బద్ధ పునాది ఏర్పరచుకోవడానికి సహాయం చేసింది.

**అడ్వకేట్‌గా :**

1962 ఎన్నికల వైఫల్యంతో రాజకీయ నాయకుడిగా, శాసన సభ్యునిగా, రైతు సంఘ నాయకుడిగా అనేక సాహసాలతో సాగిన జీవితం ఎంతో మారిపోయింది. రావు గారు కుటుంబ బాధ్యతల నిర్వహణకై మిగిలిన లాకోర్సు పూర్తి చేసి లాయర్‌గా ప్రాక్టీస్ చేయాలని 1964లో లాయర్‌గా బోర్డు పెట్టారు. కీ.శే. వేముగంటి మాధవరావు గారి దగ్గర ఒక సంవత్సరం జూనియర్‌గా పనిచేశారు. రైతు పోరాటాలు చేసినప్పుడు భూ చట్టాల గురించి లోతైన క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవడం వలన రెవిన్యూ సమస్యలు ఏవి వచ్చినా చాలా సులభంగా పరిష్కరించటంతో అతి తక్కువ కాలంలోనే చాలా మంచి లాయర్‌గా పేరు సంపాదించుకున్నారు.

ప్రతి కేసును లలితాదేవితో చర్చించేవారు. వారు తగిన సూచనలు చేసేవారు. రావు గారు వారి సూచనలను, సలహాలను తగినట్లుగా ఉపయోగించుకుంటూ ఉండి

విజయాలను సాధించేవారు. లలితాదేవి గారి తమ్ముడు శ్రీ జి. మోహన్‌రావు గారు కూడా ప్రసిద్ధి చెందిన లాయర్ కాబట్టి లలితాదేవి గారికి రావు గారు అడ్వకేట్‌గా పనిచేసినప్పుడు వారికి ఎంతో సహకరించారు.

వారి వాదనా పటిమతో ప్రతి కేసు సునాయాసంగా విజయం సాధించేట్లుగా మార్చుకునేవారు.

**ఆకునూరు, మాచిరెడ్డిపల్లి దురంతాలు :**

జనగామ తాలూకా ఆకునూరు, తెలంగాణా - కర్నాటక సరిహద్దులో వున్న మాచిరెడ్డిపల్లి గ్రామాలలో ప్రజలే తిరుగుబాటు చేసి లెవీ ఇవ్వ నిరాకరించి అధికారులను తరిమివేశారు. కాని ఆ గ్రామస్థులపై వెంటనే తీవ్ర దమనకాండ అమలు జరుపబడింది. ఆకునూరు, మాచిరెడ్డిపల్లి గ్రామాలలో స్త్రీలపై జరిగిన సామూహిక మానభంగాలు మానవత్వానికే మాయని మార్పు తెచ్చాయి.

ఈ ఘోర దురంతాలు స్థానిక పత్రికలలో ప్రచురించడం సాధ్యం కాదు కనుక రావి నారాయణరెడ్డి గారు బొంబాయి వెళ్లి అచ్చటి ముఖ్య పత్రికలలో ప్రచురింప చేశారు. ఈ వార్త చూసిన గాంధీజీ, సరోజినీ నాయుడు కుమార్తె పద్మజా నాయుడిని ఆకునూరు, మాచిరెడ్డి పల్లి గ్రామాలకు వెళ్లి విచారణ జరిపి తనకు నివేదిక అంద జేయవలసినదిగా చెప్పి పంపించారు. పద్మజానాయుడు ఆ గ్రామాలకు వెళ్లగా, ఆమెకు అచ్చట జరిగిన దురంతాలను తెలియజేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. అందువల్ల ఆమె కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభల సహాయాన్ని కోరింది. ఆంధ్ర మహాసభ కార్యకర్తలను పంపించి ఆమెకు తోడ్పడింది. పద్మజానాయుడు జరిపిన విచారణలో మొత్తం డెబ్బయి ఏడు మంది ధనిక, మధ్యతరగతి, పేద వర్గాల స్త్రీలు ఈ దురంతానికి బలయ్యారని తెలిసింది. పద్మజానాయుడు విచారణ జరిపి గాంధీ గారికి నివేదికను అందజేసింది. ఆయన అప్పటి నిజాం నవాబు ప్రధానమంత్రి అయిన అక్బర్ హైదరీకి తెలియజేయగా, న్యాయవిచారణకై హైకోర్టు జడ్జిని నియమించారు.

ఈ సంఘటనలు హైదరాబాదులోని విద్యావంతులైన స్త్రీలలో ఎంతో సంచలనం కలిగించాయి. అనేకచోట్ల స్త్రీలు తమంత తాముగా సభలు - సమావేశాలు జరిపి



ఈ దురంతాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ రెండు గ్రామాల సంఘటనలపై ఆకునూరు, మాచిరెడ్డిపల్లి దురంతాలు అనే చిన్న పుస్తకాన్ని కూడా ప్రచురించారు.

ఇట్టి సమస్యలపై ఆంధ్ర మహాసభ పెద్ద ఎత్తున ఆందోళనా ఉద్యమాన్ని నడిపింది. అప్పుడు అడవి బాపిరాజు గారు సంపాదకుడుగా 'మీజాన్' అనే పత్రిక ప్రచురణ ప్రారంభించారు. కలకత్తా వాలా అనే ముస్లిం వ్యాపారస్తుడు నడుపుతున్న 'మియోర్' పత్రిక కూడా ఈ ఉద్యమాభివృద్ధికి తోడ్పడింది.

రాష్ట్ర కమిటీ విజయవాడలో జరుపుతున్న రాజకీయ పాఠశాలల సిలబస్‌ను తెలంగాణా ప్రాంత రాజకీయ ఆర్థిక సమస్యలకు అన్వయించి సిలబస్ రూపొందించు కునేవారు. ఈ పాఠశాలల్లో అప్పటి వరకు తెలంగాణాలో ఉద్యమం నుంచి వచ్చి నాయకత్వ పాత్ర వహిస్తున్న అందరికీ రాజకీయ, నిర్మాణ, ప్రజా ఉద్యమ సమస్యలు బోధించేవారు.

వీటిలో బోధనాంశాలు :

1. రాజకీయ భూగోళం 2. జాతీయ ఉద్యమ చరిత్ర 3. హైదరాబాదు సంస్థాన ప్రజా ఉద్యమ చరిత్ర (ముఖ్యంగా ఆంధ్ర మహాసభ) 4. మహారాష్ట్ర, కర్నాటక ప్రజా పరిషత్తులు 5. ఆర్య సమాజం. ఇత్తెహాదుల్ ముసల్మీన్‌లు 6. స్టేటు కార్మికోద్యమం, విద్యార్థి ఉద్యమం 7. జాతీయ రాజకీయ పాలసీ, స్టేటులో రాజకీయ పాలసీ 8. పార్టీ నిర్మాణం - ప్రజా సంఘాలు.

ఈ క్లాసులు నడుపుటకు నల్లగొండ, వరంగల్లు జిల్లా కమిటీలు, సిటీ కమిటీ పూర్తి సహకారం అందించాయి.

ఈ శిక్షణా తరగతులలో కామ్రేడ్స్ చంద్ర రాజేశ్వరరావు, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, యస్.వి.కె. ప్రసాదు, ఆరుట్ల లక్ష్మి, నరసింహారెడ్డి, మగ్దూమ్ మొహియుద్దీన్‌లు బోధకులుగా వ్యవహరించేవారు.

1944 నుంచి ప్రారంభమయిన ఫ్యూడల్ వ్యతిరేక పోరాటం, 1947 - 48లలో నైజాం వ్యతిరేక సాయుధ పోరాటంగా రూపొందిన చరిత్రాత్మక విప్లవ పోరాటాలకు, ఉద్యమాభివృద్ధికి ఈ పాఠశాలలో తర్ఫీదు అయిన కారకర్తలు ఎంతో తోడ్పడినారు.

**1967 ఎన్నికలలో విజయం :**

**1969 జైలు జీవితం :**

ఈ ఉద్యమం చాలా విచిత్రమైన పోరాటం. తెలంగాణా ప్రజాసమితి నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం చరిత్రాత్మకమైనది. రావు గారు విశాలాంధ్రపై నిరంతర ఉద్యమాలు నడిపిన పార్టీలో క్రియాశీల వ్యక్తులు. తెలంగాణా వాదంలో హైదరాబాద్ నగరం అట్టుడికిపోతున్న సమయంలో రావుగారు కమ్యూనిస్ట్ పార్టీ నిర్ణయానుసారం విశాలాంధ్ర వర్ధిల్లాలని రాస్తారోకో చేసారు. దీనితో తెలుగు తమ్ముళ్ళే వీరిని శత్రువులుగా భావించి వీరిపై దాడికి దిగారు. పోలీసులు వీరిని అరెస్ట్ చేసి ముషీరాబాద్ జైలుకు పంపారు. అప్పటికే ఆ జైలు తెలంగాణా వాదులతో కిక్కిరిసిపోయి వీరు వస్తున్నారన్న సమాచారం తెలిసి వీరిపై దాడికి సిద్ధంగా ఉన్నారు. ఈ విషయం తెలిసి పోలీసులు అప్రమత్తులై సంజీవరెడ్డి కాలనీ జైలుకి పంపారు. ఇక్కడ వేల సంఖ్యలో తెలంగాణా వాదులున్నారు. వారంతా దాడికి దిగారు. ఆ గుంపులో అగ్రశ్రేణిలో కీ.శే. జి.వి. నారాయణరావు (మాజీ స్పీకర్), మల్లికార్జున్ (మాజీ కేంద్రమంత్రి) ఉన్నారు. తరువాత వారిద్దరు వీరిని గుర్తుపట్టి దాడి జరుగకుండా ఆపారు. తర్వాత ప్రత్యేక క్వార్టర్‌లో 2 రోజులు బంధించి విడుదల చేసారు.

అన్నదమ్ములె విద్వేషాలతో కొట్లాడుకునే పరిస్థితి దాపురించింది. ఈ సమయాన్ని లలితాదేవి గారు ఎంతో కష్టంగా గడిపారు. భర్త ఆచూకి తెలియక ఎంతో ఆందోళనకు గురైనారు. కాని భర్త సిద్ధాంతాలు తెలుసు కాబట్టి భర్త క్షేమంగా వస్తారని గట్టి నమ్మకంతో ఉండేవారు.

**రమేష్ - సెవ్స్ సంస్థ పాత్ర :**

ఎప్పుడు జర్మని దేశం నుంచి వచ్చినా రావుగారు ప్రజల కొరకు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామి అవుతూ, ప్రజల కష్టాలు వాటిని ఏవిధంగా తీర్చాలని ఎప్పుడూ ఆలోచిస్తూ పరిష్కారం కోసం అన్వేషిస్తూ 1991 లో SEWSI సెల్ఫ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీని జర్మనీ దేశంలోని GSE సంస్థ సహకారంతో విదేశీ నిధుల ద్వారా గ్రామాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను సమకూర్చడం, దీనితో అభివృద్ధి కార్యక్రమాలను విస్తరింపచేయడం 1994 నుండి



విస్తృతంగా కార్యక్రమాలు చేస్తూ దీనిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాల విస్తరణకు, సౌలభ్యానికి రాజకీయ పార్టీల నాయకులతో, ఇతర నాయకులతో రమేష్ మంచి సంబంధ బాంధవ్యాల్ని పెంపొందించుకోవటం సేవ్స్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు విజయవంతం కావడం, ప్రజలలో మంచి అభిమానాన్ని పొందడం, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజక వర్గాలలో ఎంతో పేరు పొందారు. శాసనసభ్యునిగా, మాజీ శాసనసభ్యుడిగా, సేవ్స్ సంస్థ అధ్యక్షుడిగా రావు గారికి కూడా ప్రజాసంబంధాలు బలపడినాయి.

వీరి సంస్థ ద్వారా వాటర్‌షెడ్ కార్యక్రమాలు, త్రాగునీటి సమస్యను నివారించటం, 500 పైగా బోర్లు వేసి త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించటం, 75 గ్రామాలలో ట్యాంకులు పైపులైన్ల నిర్మాణం ద్వారా ఇంటింటికి త్రాగునీటి సౌకర్యం, సుమారు 250 స్కూలు గదుల నిర్మాణం, ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు సౌకర్యం, కొన్ని స్కూళ్ళల్లో బెంచీలు ఇవ్వడం, వేములవాడలో 26 కి.మీ. పొడవున డ్రైనేజి సౌకర్యం ఏర్పాటు కోట్ల రూపాయలతో ఆధునీకరించి యాత్రికులకు మంచి వాతావరణాన్ని కల్పించడం శ్లాఘనీయం.

సంచార వైద్యశాల ఏర్పాటు చేసి గ్రామీణ మహిళా, వృద్ధ, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయడం.

వేములవాడ నియోజక వర్గంలో 40 గ్రామాలలో శుద్ధిచేసిన మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేసి 2 రూపాయలకే 200 లీటర్ల పరిశుద్ధమైన మంచినీటిని అందించడం విశేషం.

సిరిసిల్ల పట్టణంలో ప్రభుత్వ సహాయంతో ఆరోగ్య కేంద్రాన్ని నడపటం. విదేశి సంస్థ ఆలయన్స్ సహకారంతో కరీంనగర్ కేంద్రంగా 6-7 ఎయిడ్స్ నివారణ కేంద్రాలను నిర్వహిస్తూ ఎయిడ్స్ వ్యాధిని అరికడుతూ ప్రజలలో ఆరోగ్యం పట్ల అవగాహన కలిగిస్తున్నారు.

**డా. చెన్నమనేని రమేష్ రాజకీయ ప్రస్థానం :**

2009లో 13వ శాసనసభ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ద్వారా గెలుపొంది నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో ప్రేమానురాగాలు పంచుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నియోజక వర్గ నిధులు సమకూరకున్నా తమ స్వంత నిధులతో కార్యక్రమాలు పూర్తిచేయటం వీరి నిబద్ధతకు ప్రతీక. రాష్ట్ర ప్రభుత్వానికి చేదోడుగా విదేశీ నిధులను సమకూర్చుకొని గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించటం కత్తితో సాములాంటిదే. ప్రత్యర్థుల విమర్శలు, ప్రజల అనుమానపు చూపులు, అధికారుల సహాయ నిరాకరణ, అనాదరణలాంటి అనేక సవాళ్ళను ఎదుర్కొని, దొరికిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరుచుకుంటూ, సామాజిక స్పృహతో పేదవారి జీవితాలలో వెలుగులు నింపడానికి వారు నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు.

వీరు శాసన సభ్యుడిగా ప్రజా సమస్యలను తీర్చుతూ ఇంకా ఎన్నో నూతన ప్రణాళికలను రచిస్తూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నారు.

వీరి సంతానం లలిత్, అరుణ్, సంగీత. భార్య మరియా కూడా వీలున్నప్పుడు భారతదేశం రావడం, నియోజక వర్గ కార్యక్రమాలలో పాల్గొనడం, అవగాహన పెంచుకోవడం, సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రచించడం నిరంతరం సాగుతూనే ఉన్నాయి.

పిల్లల వ్యక్తిత్వ వికాసం తండ్రి, తాత, నానమ్మ గార్ల ప్రభావంతోనే రూపు దిద్దుకుంటున్నాయి. దృఢమైన వ్యక్తిత్వం కలవారిగా వారిని చేస్తున్నాయి. భారతదేశం, జర్మని దేశ విధి విధానాలు, రాజకీయాలు, ఇతర అభివృద్ధి పనులు వారు చక్కగా తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నాయి.

**తెలంగాణా అమరవీరుల స్మారక ట్రస్ట్ :**

కీ.శే. రావి నారాయణ రెడ్డి గారితో కలిసి 1983వ సం.లో అమరవీరుల స్మారక ట్రస్ట్ సంస్థను స్థాపించారు.

తెలంగాణా రైతాంగ పోరాటం, విమోచనోద్యమంలో సుమారు 4000 మంది అమరులు ఆత్మార్పణ చేసారు. ఇంకా ఎన్నో వేల మంది భూస్వామ్య దోపిడి, పటేల్ పట్వారీల ఆకృత్యాలకు రజాకర్ల దౌష్ట్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వారు ఉన్నారు. ప్రపంచాన్ని ఆకర్షించిన పోరాటాలు ఇవి. వారి ఆత్మలకు శాశ్వతత్వం రావాలని 5000 రూపాయలతో రావి నారాయణ రెడ్డితో కలిసి దీనిని స్థాపించారు. పేదరికంతో బాధపడుతున్న, ఎంతో విలువైన జీవితాలను పోరాటాలకు సమర్పించి, నికృష్టంగా



జీవిస్తున్న సమరయోధులకు పెన్షన్లకి, దరఖాస్తులు ఆహ్వానించి వారందరికి పెన్షన్ వచ్చే విధంగా చేయడం జరిగింది. ఈ పెన్షన్ తేవడానికి ఒక భగీరథ ప్రయత్నమే అయింది. ఎంతో వ్యతిరేకత. కాని ఢిల్లీ వెళ్ళి సాధించుకుని తెచ్చుకున్నారు.

పెన్షన్‌ను సాధించటమే కాకుండా ఒక భవన నిర్మాణం, అమరవీరుల స్మారక స్థూపాల ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఎన్నో ఆటంకాలు, ఎన్నో ఒడిదుడుకులు, వాటన్నిటిని అధిగమించి రావి నారాయణరెడ్డి ఆడిటోరియం, అమరవీరుల స్మారక స్థూపం, గ్రంథాలయంను నిర్మించుకోగలిగారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వారి సహకారంతో మానసిక వికలాంగుల పాఠశాలని నిర్వహించగలగడం ఎంతో సంతోషాన్ని ఇచ్చే విషయం.

ఈ ట్రస్టు కార్యక్రమాల్లో లలితాదేవి గారు వీరికి చక్కటి సూచనలు, సలహాలు ఇస్తూనే ఉన్నారు. అందులో జరిగే కార్యక్రమాలకు ఉత్సాహంగా హాజరవుతూ ఉన్నారు.

**ఆర్థిక రంగ నిపుణుడు హన్మంతరావు గారితో అనుబంధం :**

కోనారావు పేట నాగారం గ్రామంలో 1929లో జన్మించారు. అన్న చెన్నమనేని రాజేశ్వరరావు అడుగుజాడల్లో నడుస్తూ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకు కూడా వెళ్ళారు.

హన్మంతరావు గారితో లలితాదేవి గారి సంబంధం సీతా, లక్ష్మణుల సంబంధం లాంటిది. వీరు రహస్య జీవితం గడుపుతున్నప్పుడు లక్ష్మణుడి మాదిరిగా వెంట వుండి అన్న భార్య తల్లితో సమానమని భావించి ఎంతో సేవ చేసారు హన్మంతరావుగారు. ఆరోగ్యం క్షీణించి అత్యంత ప్రమాదకర పరిస్థితులలో హన్మంతరావు గారు జాల్నా జైలు నుంచి వచ్చినప్పుడు కంటికి రెప్పలా కాపాడి వారిని ప్రమాదం నుండి గట్టెక్కించారు. వారికి ప్రాణాదాన దాతలైనారు. ఇంట్లోనే వుంటూ పార్టీ సమాచారాన్ని తెలుసుకుంటూ గెరిల్లా దళాల అవసరం ఉన్నదన్న పార్టీ పిలుపు మేరకు పూర్తిగా ఆరోగ్యం కుదుట పడకున్నా అంతంత మాత్రం సహకరిస్తున్న ఆరోగ్యంతోనే దళయాత్రలు నిర్వహించాడు. ఇంకా ఆరోగ్యం పాడై నడవలేని స్థితికి చేరుకున్నారు. వారిని తిరిగి ఇంటికి పంపించి చికిత్స చేయించిన తర్వాత కోలుకొన్నారు. ఈ విశ్రాంతి సమయంలో కూడా రహస్య స్థావరంలో ఉన్న సభ్యులకు

రాజకీయ శిక్షణ అందించే బాధ్యతను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. తిరిగి మళ్ళీ అరెస్ట్ అయ్యారు. తిరిగి వచ్చిన తరువాత వారి జీవన విధానంలో చాలా మార్పులు వచ్చాయి.

ఇంటిదగ్గర ఉన్న మహిళా కార్యకర్తలకు రాజకీయ పాఠాలు చెబుతూ వారిని ఉద్యమాలకు సానుభూతి పరులుగా, ఉద్యమ కార్యకర్తలుగా తయారుచేసారు. రహస్య జీవితంలో హన్మంతరావు గారి తోడ్పాటు, సహకారం లేకపోతే లలితాదేవి గారికి జీవితం చాలా దుర్భరమయ్యేది. రాజేశ్వరరావుగారు జైల్లో ఉన్నా ఆయుధాల తయారీ శిక్షణలో ఉన్నా, ఎక్కడున్నా వీరు వారి కుటుంబాన్ని హనుమంతుడి మాదిరిగా కాపాడుతూనే ఉన్నారు. అందుకే లలితాదేవి గారికి వీరు సోదరునితో సమానం. సోదరప్రేమను పంచుతున్నారు. ఉద్యమాలు పరిసమాప్తి అయిన తరువాత వీరి ఇంట్లో ఉండి చదువుకున్నారు.

వ్యవసాయ రంగం, ఆర్థిక రంగంపై ప్రామాణిక గ్రంథాలు వ్రాసారు. రిజర్వు బ్యాంక్ డైరెక్టర్‌గా, వివిధ కమీషన్‌లలో సభ్యునిగా, ప్రణాళికా ఉప సంఘం చైర్మన్‌గా, తొమ్మిదో పంచవర్ష ప్రణాళికలోని భారీ, మధ్య తరహా నీటి పారుదల సంఘానికి ఛైర్మన్‌గా వ్యవహరించారు. పలు విశ్వవిద్యాలయాల్లో ఆర్థికశాస్త్రం గురించి కీలకోపన్యాసాలు చేశారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు వారు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యునిగా వ్యవహరించారు. 20 సూత్రాల ఆర్థిక ప్రణాళిక సంఘం ఛైర్మన్‌గా వారు సమర్థవంతంగా పనిచేశారు.

ఉభయ కమ్యూనిస్ట్ నేతలతో స్నేహభావంతో మెలుగుతూ ఆర్థికశాస్త్రంలోని అనేక అంశాలను వారితో చర్చించేవారు. ఉభయ పార్టీల రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆర్థికశాస్త్రం గురించి బోధించేవారు.

వీరికి రావి నారాయణ రెడ్డి స్మారక అవార్డు, ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ అవార్డుతో పాటు, పద్మవిభూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం సత్కరించింది. 1975లో రఫీ అహ్మద్ కిద్వాయ్ మెమోరియల్ అవార్డును, 1990 - 91లో రూరల్ లేబర్ జాతీయ కమీషన్‌కు ఛైర్మన్‌గా, ఇండియన్ సొసైటీ అగ్రికల్చర్ ఎకనామిక్స్‌కు ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. జాతీయ సలహామండలి సభ్యునిగా, హైదరాబాద్‌లోని ఎకనామిక్స్



అండ్ సోషల్ స్టడీస్ అధ్యక్షునిగా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీకి ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అగ్రికల్చర్ ప్రొడక్షన్స్, ఫంక్షన్స్, కాస్ట్ & రిటర్న్ ఇన్ ఇండియా, టాక్సేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ ల్యాండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ మొదలైన ఎన్నో పుస్తకాలు ప్రచురించారు. వీరి పెరుగుదలకు లలితాదేవిగారి సహకారం ఎంతో ఉన్నది.

**కుటుంబం :**

కుటుంబం అనుబంధాల పొదరిల్లు, అత్తమామలు సాత్విక స్వభావులు, ప్రజలందరిని అక్కున చేర్చుకుని కన్నీళ్లను తుడిచిన మాతృమూర్తులు, ఆదర్శ రైతులుగా గ్రామంలో అందరి చేత మెప్పుపొందినవారు, నిరాడంబర జీవులు, ఆడపడుచులు, అక్క చెల్లెళ్ళ మాదిరిగా పాలు నీరుగా కలిసిపోయి ఆత్మీయతను పంచుకున్నారు. కష్టాల కడలిలో రాజకీయ తుఫానులు, అన్నలు జైళ్లలో మగ్గిపోవడం, తల్లిదండ్రుల జీవితం, ఎందరో అన్నార్తులు, దీనజనుల కనీస అవసరాలను తీర్చడం, ఇంట్లో పనివారికి సహాయ సహకారాలు అందిస్తూనే వారంతా ఎంతో ఐక్యంగా, గుంభనంగా సంసారాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం ఎంతో గొప్ప విషయం.

ఆడపడుచులు ఏనాడు ఇది కావాలని కోరేవారు కాదు, కాని లలితాదేవి వారి అవసరాలన్ని కన్నతల్లి మాదిరిగా గుర్తెరిగి వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా కనీస సుఖ జీవనానికి పాటు పడేవారు. గంపెడు సంసారం, ఎలాంటి ఆదాయ వనరులు లేవు. ఉన్నదాంట్లోనే నలుగురికి పంచుతూ ఆత్మీయతను పంచిన గొప్పవ్యక్తి లలితాదేవి.

ఆడపడుచుల వివాహాలు ఇతర వేడుకలన్నీ జరపడానికి వారి ఒంటి మీద ఉన్న బంగారం ఒక్కొక్కటి కరిగిపోతున్నా ఎలాంటి బాధ, సంకోచం రెండవ ఆలోచన లేకుండా కుటుంబాన్ని విజయవంతంగా నెట్టుకొచ్చారు.

ఆడబిడ్డలు బుచ్చక్క, సత్యమ్మ, లలితమ్మ, యశోదమ్మ, రత్నమ్మ, పుష్పలత, సుగుణ, శ్రీదేవి గార్లు. మరుదులు : హన్మంతరావు గారు, వెంకటేశ్వరరావు గారు చివరి మరిది సిహెచ్. విద్యాసాగర్‌రావు గారు.

ఐదవ ఆడబిడ్డ రత్నమ్మ గారితో వీరికి ప్రత్యేక అనుబంధం ఉన్నది. సమ

వయస్కులు, వీరి మధ్య విడదీయరాని స్నేహం, కుటుంబంలో ఏ సమస్యలు వచ్చినా ఇద్దరు చర్చించుకొని వాటి పరిష్కారానికి కృషిచేసేవారు. వారు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు లలితాదేవి గారు కలిసి ఎంతో బాధపడ్డారు, ఒకరిని ఒకరు ఓదార్చుకున్నారు. నువ్వో నేనో ఎవరో ఒకరం ముందు పోవాల్సిన వారమే అని అనుకున్నారు.

విధి ఎంత విచిత్రం. రత్నమ్మగారు 2వ తేది సెప్టెంబర్ నాడు మరణిస్తే లలితాదేవిగారు సెప్టెంబర్ 14వ తేదీన మరణించారు. అంత ప్రగాఢమైనది వీరి స్నేహం.

ఆడబిడ్డలందరు మెట్టినింటిలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. క్షమాగుణం, సహనం, ఓర్పు, నేర్పు, మంచితనం వీరందరికి ఉగ్గుపాలతో నేర్పబడిన విద్య. వీరందరిది సహజీవనం. వీరికి మెట్టినింటిలో మంచిపేరు తెచ్చుకునే అవకాశం కలిగింది.

మరుదులు ముగ్గురికి అన్నగారితో రామలక్ష్మణుల లాంటి అనుబంధం. అన్న అడుగుజాడలలో నడిచిన మానవీయులు, హన్మంతరావు గారు కమ్యూనిస్ట్ తెలంగాణా సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని అన్నను వెన్నంటే ఉన్న త్యాగమూర్తి.

సీతాదేవిని లక్ష్మణుడు కాపాడినట్లుగా మాతృమూర్తికి సేవలందించినట్లుగా లలితాదేవి గారు గర్భంతో ఉన్నప్పుడు ఇతర ఆడవారి సహాయం లభించకున్నా తానే తల్లి, అక్క చెల్లియై ఆసుపత్రికి తీసుకెళ్లడం, ప్రసవ సమయంలో దగ్గరుండి సేవ చేయడం మరువలేనిది. కల్పన, అరుణ ఇద్దరు చిన్నవాళ్లే. వాళ్ళ ఆలనా, పాలనా అత్యంత శ్రద్ధగా చూసుకున్న మానవీయ కరుణామూర్తి హన్మంతరావుగారు.

కుటుంబ సమస్యలను, ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకున్న హన్మంతరావు గారు ఏనాడు నోరువిడిచి డబ్బు అడిగేవారు కాదు, వేసుకున్న దుస్తులు చిరిగిపోయినా కొత్తవి కావాలని ఎన్నడూ కోరేవారు కారు. లలితాదేవి గారే గ్రహించుకొని రాజేశ్వరరావు గారికి చెబితే వారు అప్పుడు కొత్తబట్టలు కుట్టించేవారు.

కుటుంబం మిగతా ఇద్దరు మరుదులు వెంకటేశ్వరరావు, విద్యాసాగర్ రావు గారలను తల్లిగా వారికి మాతృప్రేమను పంచారు. తన పిల్లలతో సమానంగా వారి



ఆలనా పాలనా చూసుకున్నారు. బాల్యంలో వారి అవసరాలను గ్రహించి ఎప్పటికప్పుడు నెరవేర్చేవారు. అందుకే వారు నేటికి లలితాదేవి గారిని మాతృమూర్తిగా భావిస్తారు.

విద్యాసాగర్ రావు గారు మహారాష్ట్ర గవర్నర్ పదవిని పొందగానే లలితాదేవి గారి ఆశీస్సులు తీసుకున్నారు. బంధువులను కూడా ఎంతో ఆప్యాయంగా, మర్యాదగా, గౌరవంగా చూసుకునేవారు. బంధుజనానికంతా లలితాదేవి గారు ప్రీతిపాత్రురాలు.

తన సంతానంలో పెద్దమ్మాయి అరుణ. వీరు డిగ్రీ పూర్తిచేసి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. వీరి భర్త రాజేశ్వరరావు గారి సోదరి కుమారుడు కీ.శే. రాజేశ్వరరావు గారితో వివాహం జరిపించారు. వీరి కూతుళ్ళు శ్రీలేఖ, శ్రీలతలు మంచి విద్యావంతులు. వారు భర్తలతో కలిసి చక్కటి ఆదర్శ కుటుంబాలను నడుపుతూ అందరికి ఆదర్శప్రాయులైనారు. వీరి సంతానం కూడా మంచి సంస్కారంతో విద్యావంతులై వారి వారి వృత్తులలో అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

అరుణగారు స్వాతంత్ర్యోద్యమం, హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమంలో చిన్నారిగా అనేక రహస్య స్థావరాలలో ఉంటూ అష్టకష్టాల పాలైనారు.

స్వేచ్ఛగా ఆడుతూ పాడుతూ చిన్నారులతో గడపాల్సిన బాల్యం తల్లిదండ్రులతో పాటు రహస్యంగా గడపటం, బాల్యాన్ని చాలా వరకు కోల్పోవడం చాలా బాధాకరం. అయినా రహస్య జీవితంలో ఎందరో ఉద్యమకారుల ప్రేమకు పాత్రురాలైనారు. చిన్నప్పుడే విప్లవోద్యమం వంట పట్టించుకున్నారు. అందుకే వివాహం తరువాత కూడా విద్యాభ్యాసం చేసి ఎన్నో వేల విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపారు. తన సంతానాన్ని కూడా మంచి పౌరులుగా తయారుచేయడంలో వీరుచూపిన మార్గదర్శకత్వం అభినందనీయం.

వీరి భర్త మరణానంతరం ఎంతో కృంగిపోయినా, తర్వాత తేరుకుని అధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో కూతుళ్ళకు, వారి సంతానానికి దిక్సూచిగా తన విజ్ఞానాన్ని పంచుతూ ఇటు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యతను నెరవేరుస్తూ ఆదర్శంగా నిలిచారు.

రెండవ అమ్మాయి కల్పన. రహస్య జీవితంలోనే జన్మించారు. అమ్మమ్మ, నానమ్మల ఆలనా పాలనా లేకుండా వారి ప్రేమను పంచుకునే అవకాశమే లేకున్నా రహస్య జీవితంలో ఉన్న ఉద్యమ నాయకుల ఆలనా పాలనతో వారి లాలిపాటలు, ఉద్యమాల ఉయ్యాల పాటలతోనే పెరిగారు. తండ్రి చంచలగూడా జైల్లో ఉన్నప్పుడు జైలు ఊచల నుండి నాన్నకు చేతులు చాపుతూ నాన్నతో ఆడుకోవాలని మారాం చేసే కల్పనను లాలిస్తూ లలితాదేవి గారు చిన్నారులైన ఇద్దరు ఆడపిల్లలను ఎంతో ప్రేమతో పెంచారు. వీరి వివాహం శ్రీ వి. రాంమోహన్ రావు (కొల్హాపూర్) గారితో జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. వీరు చక్కటి గృహిణిగా, ఓర్పు, నేర్పు, ప్రేమానురాగాలతో అటు మెట్టినింటి వారికి, పుట్టినింటి వారికి ఆదర్శప్రాయులైనారు. వీరు గృహిణి గానే వారి బాధ్యతలను చక్కగా నిర్వహించారు.

మూడవ అమ్మాయి ప్రభావతి. వీరు హోమియోవైద్యం చేసి ప్రభుత్వ హోమియో కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేసారు. వీరి భర్త లలితాదేవి గారి సొంత తమ్ముడే అయిన గొర్నేని సుధాకర్‌రావు గారు. వీరికి ఇద్దరు సంతానం. వారు మంచి విద్యాభ్యాసాన్ని చేసి జీవితంలో చక్కగా స్థిరపడ్డారు.

ప్రభావతి గారు ఉద్యమాల తరువాత పుట్టినా వీరిలో ఉగ్గుపాలతో ఉద్యమ స్ఫూర్తి నేటికీ కనిపిస్తుంది. తల్లిదండ్రులతో పాటు ఉంటూనే వారి నాన్నగారికి కుడిభుజంగా ఉంటూ, వారి బాధ్యతలలో తను పాలు పంచుకుంటూ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్యశీలి. అనేక ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ఎందరో పేదల ఆరోగ్యాన్ని బాగుచేస్తూ వారి కుటుంబాలలో వెలుగులు నింపుతున్నారు వారి తల్లిదండ్రుల ఎదుగుదలలో వారి పాత్ర కూడా శ్లాఘనీయం. జియ్యర్ ట్రస్ట్‌చే నిర్వహించబడుతున్న హాస్పిటల్‌లో ప్రతి శనివారం వారి సేవలను ఉచితంగా అందిస్తున్నారు.

ఎప్పుడు జాతరను తలపించే తన ఇంటిని కంటికి రెప్పలా కాపాడుతూ తన కుటుంబాన్ని, తన తండ్రి కుటుంబాన్ని, తన తమ్ముడు రమేష్ రాజకీయ ఎదుగుదలలో కూడా తన వంతు పాత్రను నిర్వహిస్తూ, తమ్ముడి నియోజక వర్గ ప్రజల సమస్యలను తీర్చుతూ ఇంటికి వచ్చే ఉమ్మడి అత్యంత విశాలమైన తన కుటుంబానికి, బంధు



వర్గానికి ఆత్మీయతను పంచుతూ సున్నితమైన, మృదువైన సంభాషణలతో, ఎల్లప్పుడు చిరునవ్వు ముఖంతో కనిపిస్తూ అలుపెరుగని సేవ చేస్తున్న వారి అమ్మా నాన్నల ఎదుగుదలలో ఎంతో భాగాన్ని తాను మోస్తూ వారి నాన్న విజయాలకు ఒక కేతనంగా తను బాధ్యతలు నిర్వహిస్తూ, పేరుకు దగ్గట్టుగా ప్రభావతి (ఎంతో తేజోవంతంగా) కుటుంబాన్ని దేదీప్యమానంగా వెలిగిస్తూ చిన్నాన్నలందరికి ముద్దుబిడ్డగా, వారి అవసరాలన్నిటికి చేదోడు వాదోడుగా వుంటూ అందరి తలలో నాల్కలా ఎదిగిన ప్రభావతి ధన్యురాలు.

తన అక్కలు స్వయంగా తెలంగాణా విమోచనోద్యమంలో అష్టకష్టాలు పడ్డా వీరు ఆ తరువాత గత 60 సం. నుండి తల్లిదండ్రులకు అలుపెరగని సేవ చేస్తున్నారు.

వీరి సహకారమే లేకపోతే ఎంతో కష్టాన్ని అనుభవించాల్సి వచ్చేది. పదవీ విరమణ తరువాత కూడా ఎప్పుడూ చిరునవ్వుతో సహనంగా అన్ని పనులు నెరవేరుస్తూ ఉంటారు ప్రభావతి గారు.

ఇక ఆఖరి సంతానం రమేష్. వీరు రహస్య జీవితం తరువాత పుట్టిన వారు కాబట్టి వీరి బాల్యం సామాన్య పిల్లల మాదిరిగానే జరిగింది.

రాజేశ్వరరావు గారు చొప్పదండి నియోజకవర్గంలో ప్రప్రథమంగా శాసనసభకి ఎన్నికైనప్పుడు రమేష్‌కు ఒక సం. వయసు మాత్రమే. రమేష్‌పై వీరి రాజకీయ జీవన ప్రభావం ఉంది. ఏడుసార్లు శాసనసభకి ఎన్నికవడం, అనేక రైతాంగ పోరాటాలు జరపడం, అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేయడం రమేష్‌పై చెరగని ముద్రవేసాయి. ఈనాడు రాజకీయ రంగంలో తనదైన ముద్రను వేసుకోవడానికి కారణం బాల్యంలో పడ్డ పునాదులే. వారి రాజకీయ విజయాలకీ, ప్రజాసమస్యల పరిష్కారాలకు వారి బాల్య అనుభవాలే కారణం.

కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్వహణలో త్యాగాలు, కృషి చేసిన వారి సంతానానికి తూర్పు జర్మని ఇతర కమ్యూనిస్ట్ దేశాలలో ఒకరికి ఉచితవిద్య అందించే అవకాశం ఉన్నందున రాజేశ్వరరావు గారు వారి చిన్న కుమారుడైన రమేష్‌ను తూర్పు జర్మనీకి ఉన్నత విద్య కోసం పంపించారు. వీరు వ్యవసాయ అర్థశాస్త్రంలో 1983లో గ్రాడ్యుయేట్ అయ్యారు. 1987లో పిహెచ్.డి. పూర్తిచేసి డాక్టరేట్ పట్టాను పొందారు. అక్కడే

హ్యాంబాట్టు విశ్వవిద్యాలయంలో 1988 నుండి అధ్యాపకుడిగా ఉద్యోగ ప్రస్థానాన్ని కొనసాగించారు.

అక్కడే ఫ్రెడరిచ్ వెల్జ్, శ్రీమతి మార్గరెట్ వెల్జ్ గార్ల కుమార్తె మరియాను 1984లో వివాహమాడారు. వారికి ముగ్గురు సంతానం. అరుణ్, లలిత్, సంగీతలు.

రావు గారు, లలితాదేవి గారు జర్మనీ వెళ్ళడం వారి అన్యోన్య దాంపత్యాన్ని కళ్ళారా చూసి ఆనందించడం, వారి సంతానంతో ఆడుకుని తృప్తి పడటం జరుగుతూనే ఉంది.

పిల్లలు కూడా ప్రయోజకులవుతున్నారు. రమేష్ వీలున్నప్పుడల్లా భారతదేశం రావడం, రావు గారితో చురుకుగా ప్రజాసమస్యల పోరాటాలలో పాల్గొనడం, రాజకీయాల గురించి లోతైన చర్చలు జరపడం, ఇతర ఉద్యమకారులతో పరిచయాలు, వారి ప్రేరణ, వారి ప్రోద్భలంతో ఆర్థికశాస్త్రాన్ని చదివినా, వచ్చినప్పుడల్లా చిన్నాన్న పద్మవిభూషణ్ సిహెచ్. హన్మంతరావు గారితో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికల గురించి చర్చించడం, క్రమంగా వీరిలో రాజకీయాలపై ఆసక్తి పెరగడం, భారతదేశ అభ్యున్నతికి రాజకీయ రంగ ప్రవేశం అనివార్యమని భావించడంతో 2009 ఎన్నికలలో 'వేములవాడ' నియోజక వర్గం నుండి శాసనసభ సభ్యుడిగా ఎంపికైనారు. తిరిగి 2014లో టి.ఆర్.ఎస్. నుండి ఎన్నికైనారు.

లలితాదేవి గారు భర్త రాజకీయ జీవితంతో పాటు కొడుకు రాజకీయ ప్రస్థానాన్ని చూస్తూ ఆనందించేవారు. కొడుకును ప్రోత్సహిస్తు ఉండేవారు. ప్రయోజకుడైన కొడుకుకు సలహాలు అందించేవారు.

**శ్రీమతి లలితాదేవి - శ్రీమతి రాధమ్మ గార్ల స్నేహబంధం :**

లలితాదేవి గారి బాల్య స్నేహితురాలు జోగినిపల్లి రాధమ్మ గారు. బాల్యంలో ఒకే గ్రామంలో పుట్టి పెరిగిన వీరు మంచి స్నేహితులు. ఇద్దరూ చిన్ననాడు శ్యామయ్యవారు, రంగాచార్యులు అనే సంస్కృత పండితుడి దగ్గర సంస్కృతం నేర్చుకున్నారు. వీరి గృహాలు వేములవాడలో దగ్గర దగ్గరగా ఉండేవి. అందుకే ఏ కొంచెం సమయం దొరికినా లలితాదేవి గారు రాధమ్మగారింటికి వెళ్ళి బొమ్మలాటలు,



చదరంగం, పచ్చీసు ఆటలు ఆడుకునేవారు. సాయంత్రంపూట పెరడు లోకి వెళ్ళి పూలు కోసుకొచ్చి నానమ్మకీ, దేవుడికి సమర్పించమని దండలు అల్లి ఇస్తూనే అమ్మ, అత్తలు, వదినలకీ పెద్ద పెద్ద మాలలు అల్లి ఇస్తుండేవారు. అందరితో కలివిడిగా బాగానే ఉండేవారు. శుక్ర, శని వారాలు ఊర్లో ఉన్న గుడికి వెళ్ళేవారు. ఊర్లో ఉన్న పాఠశాలలో ఉర్దూ మీడియంలో 2 నుండి 4వ తరగతి వరకు (చారుం) 2వ తరగతి వరకు ఆంగ్లం చదువుకున్నారు. ఈ ఇద్దరు తిన్నా, కూర్చున్నా, నిద్రపోయినా ఎప్పుడు ఒకరి కొకరు అన్నట్లుగా ఒకే ప్రాణం మాదిరిగా ఉండేవారు. విధాత రాసిన లీలలు చాలా ఆశ్చర్యంగా ఉంటాయి. సామాన్య మానవులకు అంతుపట్టవు కూడా. లలితాదేవి గారి వివాహం రాజేశ్వరరావు గారితో, రాధమ్మ గారి వివాహం రాజేశ్వరరావు గారి మేనమామ జోగినిపల్లి ఆనందరావుగారితో జరిగింది. రాజేశ్వరరావు అమ్మమ్మ గారి ఊరే మానువాడ, అదే ఊరు కోడలుగా రాధమ్మ గారు వెళ్లడం యాదృచ్ఛికం కాదేమో. దైవ లిఖితంగా భావించవచ్చు. ఈవిధంగా వీరి స్నేహం, వివాహం తరువాత బంధుత్వంగా మారి ఇంకా గట్టిపడింది. రాధమ్మగారు వివాహమాడిన జోగినిపల్లి ఆనందరావు గారు రాజేశ్వర రావు గారికి స్వయాన మేనమామ, అంతేకాకుండా ఇద్దరు సమవయస్కులు. బాల్యంలో ఎక్కువగా రాజేశ్వరరావు గారు వారి అమ్మమ్మ ఊర్లోనే గడిపేవారు. ఒక ఇంట్లో ఉన్నందున వీరి స్నేహం చాలా గట్టిపడింది. ఒకే ఆలోచన, ఒకే జీవిత లక్ష్యం కలిగిన ఇద్దరు భవిష్యత్ కాలంలో రాజకీయ నాయకులుగా, సమాజ సేవకులుగా రూపుదిద్దుకోవడంలో లలితాదేవి గారి, రాధమ్మ గారి పాత్ర శ్లాఘనీయం. తెలంగాణా సాయుధ పోరాటంలో వీరిద్దరు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్‌లో ఉన్నప్పుడు వారి భర్తల పేర్ల మీద వారంట్ వచ్చినప్పుడు కూడా ఎలాంటి తొణుకు బెణుకు లేకుండా వీరు సాయుధ పోరాట వీరులకు ఇచ్చిన ప్రోత్సాహం, సృజనాత్మక జ్ఞానం మరువలేనిది.

చాందా క్యాంప్‌లో కూడా ఈ ఇద్దరు స్నేహితురాళ్లు ఉండి ఎందరో వాలంటీర్లకు భోజనాలు పెడుతూ, కొరియర్ వ్యవస్థలో అత్యంత చాకచక్యంగా పాల్గొని ఎన్నో ముఖ్య విషయాలతో కూడిన ఉత్తరాలను చేరవేయడంలో వీరు చూపిన సాహసం చాలా గొప్పది. అంతేకాకుండా చాందా నుండి హైదరాబాద్‌కు రహస్యంగా ఆయుధాలను

చేరవేయడానికి కూడా ఎలాంటి సంకోచం, బెదురు లేకుండా వీరు ప్రదర్శించిన చాకచక్యం చాలా గొప్పది. పోరాటాలన్నీ సమసిపోయి, స్వాతంత్రం లభించిన తరువాత కూడా వారి భర్తలు రాజకీయాలలో ప్రవేశించినప్పుడు వారి వెన్నంటే ఉంటూ వారికి ప్రోత్సాహం ఇస్తూ, ఇంటికి వచ్చిన అతిథులకు చక్కటి ఆతిథ్యాన్ని ఇస్తూ, వచ్చిన మహిళా కార్యకర్తలకు, ఇతర మహిళా అధికారులకు వీరు ఎన్నో అమూల్యమైన సూచనలు, సలహాలు ఇస్తుండేవారు.

చాందా క్యాంప్‌లో చాలా కఠినమైన జీవన విధానం ఉండేది. నీటి సౌకర్యం అంతగా లేని రోజులు. వీరు చాందా గ్రామం నుంచి ఎన్నో కిలోమీటర్లు నడిచి వెళ్ళి స్నానాలు చేసి నీళ్ళు తెచ్చుకోవడం ఎంతో శ్రమతో కూడుకున్న పని అయినా వారు ఎంతో సంతోషంతో పాటలు పాడుకుంటూ ఆ శ్రమను మరిచిపోయేవారు. వీరు కమలాదేవి, సుశీలాదేవి, ఇందిర గార్లతో పోరాటాలలో పాల్గొంటూనే చక్కటి స్నేహాన్ని కొనసాగించారు.

మల్లు స్వరాజ్యం గారు మనువాడ గ్రామాన్ని అనేకసార్లు సందర్శించారు. వారు సందర్శనకు వచ్చినప్పుడల్లా వారికి చక్కటి ఆతిథ్యం ఇచ్చి వారి మన్ననలను పొందారు. రాధమ్మ గారు నల్లకుంట (హైదరాబాద్) లో నివాసంలో ఉన్నప్పుడు ఎందరికో చదువుకోవడానికి సహాయం చేసారు. చెన్నమనేని హన్మంతరావు గారిని 5 ఏండ్లు వారింట్లో పెట్టుకొని చదివించారు.

ఇలా వీరిద్దరి స్నేహం బాల్యం నుంచి ఎంతో ఆప్యాయంగా కొనసాగింది.

**అత్త, మామలతో లలితాదేవి అనుబంధం :**

శ్రీయుత చెన్నమనేని శ్రీనివాసరావు, చంద్రమ్మ గార్ల సంతానం ఎనిమిది మంది ఆడపిల్లలు, నలుగురు మగపిల్లలు.

ఇద్దరు ఆడపిల్లల తరువాత రావు గారి జననం, వీరి వివాహం లలితాదేవి గారితో జరిగిన తరువాత ఈ విశాల కుటుంబంలోనికి అడుగుపెట్టింది. వారిది భూస్వాముల కుటుంబం. వీరికి 16 సం.లకే వివాహం 1944లో జరిగింది. వీరు స్వయంగా మేనత్త, మేనమామలే కాబట్టి వారి దగ్గర చనువు వుండేది. భక్తితో కూడిన గౌరవం కూడా ఉండేది. మామగారు చాలా సాత్త్విక స్వభావులు. ఏనాడు గట్టిగా



మందలించిన రోజులేదు. అదేవిధంగా అత్తగారు చంద్రమ్మ కూడ ఓర్పు, నేర్పు, సహనం, మంచితనానికి మారుపేరు. పేరుకు తగ్గట్టుగానే ఎప్పుడూ చల్లదనాన్ని పంచే కరుణామూర్తి. ఎప్పుడు పల్లెత్తు మాట ఎవరిని ఒక్కమాట అన్న దృశ్యం వారి జీవితంలో కనిపించదు.

వీరు రావుగారి దుర్భర పరిస్థితులను, అజ్ఞాతవాసంలో అనేక కష్టాలను అనుభవిస్తున్నప్పుడు వారి అత్తమామల మాటలు, మనసులో ప్రతిధ్వనించేవి. రూపాలు కంటిముందు కనిపించి లలితాదేవికి ఎంతో ఊరట కలిగేది. ఓటమి ఆలోచన వచ్చేది కాదు. అందుకే అత్తగారి సహన శీలాన్ని, నేర్పరితనాన్ని ఒంటబట్టించుకొని లలితాదేవి గారు నేటివరకు కుటుంబానికి, సమాజానికి ఒక గొప్ప ఆదర్శవంతులుగా కనిపిస్తున్నారు.

**సంతానంతో అనుబంధం :**

ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయితో వీరి అనుబంధం పొదరిల్లే. ఎంతో కలిసిపోయి వారితో స్నేహితురాలిగా ఉంటూ చిన్ననాటి నుండే వారితో పాటు కష్టాలు పడ్డ అరుణ, కల్పన అంటే లలితాదేవి గారికి ప్రాణం. వారికి ఏ చిన్న ఇబ్బంది వచ్చినా వెంటనే వారిని చేరి వారికి స్వాంతన చేకూర్చడం వారికి అలవాటు.

ప్రభావతి, రమేష్‌లతో స్నేహభావం ఎక్కువ. ఎన్నో ఒడిదుడుకులు, అష్ట కష్టాల నుండి జీవితంలో ఆరితేరిన తరుణంలో పుట్టిన వీరిద్దరికి తల్లిదండ్రుల స్థితప్రజ్ఞత, సహనం, ఓర్పు, మంచి ఔదార్యం ఉగ్గుపాలతోనే అబ్బాయి. అందుకే వారు వారి వయస్సుకు మించిన పరిణితతో ప్రజల కష్టాలు తీరుస్తూ ప్రజాసేవలో మమేకమైపోయి తల్లిదండ్రుల అడుగుజాడలలో నడుస్తున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా లలితాదేవి గారితో చర్చించి, వారి అపార అనుభవం నుండి వచ్చే సలహాలను స్వీకరిస్తూ ఉంటారు. అమలుచేస్తూ ఉంటారు.

**సోదర సోదరీమణులతో అనుబంధం :**

వీరికి నలుగురు సోదరులు. జి. మోహన్‌రావు, జి. ప్రభాకర్ రావు, జి. సుధాకర రావు, జి. కమలాకర రావు గార్లు. సోదరీమణులు జి. రాధమ్మ, జి. శోభగార్లు. వీరందరూ లలితాదేవి కన్నా చిన్నవారే. వీరే కుటుంబంలో మొదటి బిడ్డ. గారాల పట్టి. గౌర్నేని

ఇంటి లక్ష్మి లలితాదేవి గారే. వారు ఇంటికి గారాల పట్టీ అయినా తన సోదర సోదరీమణులకు అవాజ్యమైన ప్రేమను పంచారు. కుటుంబ పెద్ద బిడ్డగా తన కన్నా చిన్నవారికి మార్గదర్శకులైనారు. తన ముద్దుల తమ్ముడు సుధాకర రావు గారికి తన ప్రియమైన 3వ కూతురు ప్రభావతినిచ్చి వివాహం చేసి తన ఆత్మీయతను చాటుకున్నారు. కుటుంబంలో ఏ వేడుకలైనా, పండుగ, పబ్బాలైనా, ఇతర ఏ కార్యాలైనా వారు బాధ్యతతో, ఉత్సాహంతో పాల్గొని తనకన్నా చిన్నవారినందరిని అందులో పాల్గొనేటట్లు చేసేవారు.

ఏ సమస్య వచ్చినా ఐకమత్యంతో ఆ సమస్య పరిష్కారం చేసుకోవాలని వారి సోదర సోదరీమణులకు మార్గదర్శకత్వం వహిస్తూ వారందరి సహకారంతో పరిష్కారాన్ని కనుక్కునేవారు.

అందరికీ లలితాదేవిగారు తలలో నాలుక వంటివారు. ఏ సమస్యనైనా చిరునవ్వుతో పరిష్కరిస్తూ ముందుకు సాగిన గారాల పట్టి.

రహస్య జీవిత కాలంలో ఎన్నోసార్లు తినడానికి తిండి లేని పరిస్థితులు ఎదురైనా తన సోదర సోదరీల సహకారం తీసుకోలేదు. వారు ఎంతగా వేడుకున్నా భర్తతో పాటే కష్టాలు పడ్డారు కాని ఏనాడు చేయి చాపి వారి సహకారం తీసుకోనటువంటి స్వాభిమాని లలితాదేవి గారు.

విశాలమైన బంధువర్గం కుటుంబాలతో చక్కటి అనుబంధాన్ని పాటిస్తూ వారందరికి ప్రేమను పంచుతూ వారందరి ఆప్యాయతను పొందిన లలితాదేవి గారు ధన్యులు. వీరు 2016 సెప్టెంబర్ 14వ తేదీన తుదిశ్వాస విడిచినారు.





బంధుమిత్రులతో లలితాదేవి





యుక్త వయసులో రాజేశ్వరరావుగారు లలితాదేవి



కొడుకు రమేష్, కోడలు మరియా, మనుమలు అరుణ్, లలిత్‌లతో
రాజేశ్వరరావు దంపతులు



కూతుళ్ళు కల్పన, ప్రభావతి, అరుణలతో రాజేశ్వరరావు దంపతులు



ఆడబడుచులు ఇతర బంధువర్గంతో లలితాదేవి





భర్త రాజేశ్వరరావు, మరుదులు హనుమంతరావు,
వెంకటేశ్వరరావు, విద్యాసాగర్ రావు గార్లు



జర్మనీలో మనవడు అరుణ్‌తో రాజేశ్వరరావు దంపతులు



మనువడు సుశాంత్‌తో రాజేశ్వరరావు దంపతులు



తాజ్‌మహల్ సందర్శనలో మనవడు మిళింద్‌తో రాజేశ్వరరావు దంపతులు





60 సం. వివాహ మహోత్సవ వేడుకలలో బ్రిజ్‌రాణిగౌర్, రాజేశ్వరరావు దంపతులు



75 సం. వివాహ మహోత్సవ వేడుకలలో రాజేశ్వరరావు దంపతులు



అన్యోన్య దాంపత్యం





## ఇతర ఉద్యమకారులు

**అణభేరి ప్రభాకరరావు :**

దేశ్‌ముఖ్‌ల కుటుంబంలో పుట్టినా దేశసేవయే ధ్యేయంగా, సిరిసంపదలు, భార్యా పిల్లలను వదులుకొని ప్రజల కోసం పోరుబాటన నడిచి తెలంగాణా సాయుధ పోరాటంలో చిరస్థాయిగా నిలిచిన అమరజీవి. వీరు కరీంనగర్ జిల్లాలోని పోలంపల్లి గ్రామంలో 1910 ఆగస్ట్ 15న జన్మించారు. వీరి నాన్నగారు. 15 గ్రామాలకు జాగీర్దార్. వీరి విద్యాభ్యాసాన్ని హైదరాబాద్‌లో పూర్తిచేసి బెనారస్‌లోని కాశి విద్యాపీఠ్‌లో ఉన్నత విద్య అభ్యసించడానికి వెళ్ళినప్పుడు పూర్తిగా స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. తన 27వ ఏట సరళాదేవిని వివాహమాడారు. నిజాం ప్రభువుపై అణభేరి రణభేరి పూరించినారు. నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరిస్తూ తుపాకిని పట్టినారు.

పోలంపల్లి గ్రా. కరీంనగర్ జిల్లాకు చెందిన చురుకైన యువకుడు అణభేరి. ఆయుధాలు పట్టడంలో శిక్షణ తీసుకుని దళ కమాండర్‌గా అడవుల్లో విధులు నిర్వహిస్తున్నప్పుడు దానిని పసిగట్టి అభేద్యమైన వలపన్ని పోలీసులు, రజాకర్లు అతి కిరాతకంగా వీరిని హతమార్చారు.

వీరు గొప్ప త్యాగి. వీరు భూస్వాములైనా ఎల్లప్పుడు పేద ప్రజల కష్టాలు చూసి చలించిపోయేవారు. వారి సంక్షేమానికై ఎల్లప్పుడు కృషి చేస్తుండేవారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా పనిచేసారు. 1947 జూన్‌లో దళాలుగా ఏర్పడి 13 మాసాలు నిజాం వ్యతిరేక పోరాటాన్ని అత్యంత చాకచక్యంగా గ్రామ గ్రామాన ప్రజలను నిజాం వ్యతిరేక కార్యక్రమాల గురించి జాగృతపరుస్తూ, రైతుల సమస్యలను పరిష్కరిస్తూ వెట్టి నుండి విముక్తులను చేస్తూ ప్రజల జీవితాలలో వెలుగులు నింపారు. వీరిని పోలీసులు 1948లో కాల్చి చంపారు. వీరితో పాటు భూపతిరెడ్డి అనే నాయకుడు కూడా హతమయ్యాడు.

నిజాం నవాబ్ కలెక్టర్ పదవి ఇస్తానని ఆశచూపినా కాదని తుదిశ్వాస వరకు పోరు బాటలో నడిచిన అమరజీవి.

అనేకమంది యువకులను సమీకరించి నిజాంసేనలు, రజాకర్ల దాడి నుండి రక్షణ పొందేందుకు శిక్షణ ఇచ్చారు.

1938లో ఆంధ్ర మహాసభకు జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనారు. భారత కమ్యూనిస్ట్ పార్టీకి జిల్లా నుండి నాయకత్వం వహించిన మొదటి వ్యక్తి వారు.

చేనేత పారిశ్రామిక సంఘం స్థాపించి 1942 - 1946 వరకు చేనేత ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా అధ్యక్షులుగా ఉండి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. దుర్మార్గులు, దుష్టులైన పటేల్, పట్వారీల దస్తావేజులను గ్రామ చావిళ్లలో కాలబెట్టారు. 1946లో వీరిపై ప్రభుత్వం నజర్‌బంద్ ఆర్డర్ జారీ చేశారు. అప్పుడు వారు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. వీరి గురించి రజాకర్లు ఊరూరా తిరుగుతూ ప్రజలను చాలా హింసించారు. వీరు స్వయంగా ప్రభాకర్ దళం ఏర్పాటు చేసుకొని ఇల్లంతుకుంట పోలీస్ స్టేషన్‌పై దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకొని పోలీసులను హతమార్చారు. నిజాం ప్రభువు వీరి ఆగడాలు భరించలేక వీరిని పట్టించిన వారికి యాభైవేల రూపాయల బహుమతి ప్రకటించింది.

1948 మార్చి 14వ తేదీన వీరి దళాన్ని మహ్మదాపూర్ గ్రామ పటేల్ నమ్మించి భోజనానికి పిలిచి ఈ సమాచారాన్ని రజాకర్లకు అందించారు. ఈ విషయం కొరియర్ల ద్వారా తెలుసుకున్న దళం గుట్టలపైకి వెళ్ళింది. రజాకర్లు గుట్టను చుట్టుముట్టి కాల్పుల వర్షం కురిపించారు. అయినా ఎంతో సాహసంతో వీరు గంటసేపు వీరోచితంగా పోరాడినారు. సింగిరెడ్డి భూపతి రెడ్డితో పాటు మరో పదకొండు మంది నేలకొరిగారు.

వీరి ధైర్యం, సాహసం, నిరాడంబరత, పట్టుదల, దీక్ష ఈనాటి యువతకి చక్కటి స్ఫూర్తి.

**మగ్దూం మొహియుద్దీన్ :**

1908 ఫిబ్రవరి 4వ తేదీన మెదక్ జిల్లాలో ఆందోల్ గ్రామంలో జన్మించారు. వీరి అసలుపేరు అబూ సయాద్ మొహమ్మద్ మగ్దూం. కానీ అందరూ వీరిని మగ్దూం మొహియుద్దీన్ అనే పిలిచేవారు. బాల్యం నుండే మాటలను ప్రాసలుగా మార్చి పలికేవాడు. చిన్నప్పుడే పెయింటింగ్స్ వేసి అమ్మేవాడు. ట్యూషన్లు చెప్పేవాడు. పత్రికలకు వ్యాసాలు వ్రాసేవాడు. వీరి పినతండ్రి బహిరుద్దీన్ గారు వీరిలో అభ్యుదయ భావాలు రగిలించారు. వీరికి 1933లో రాబే బేగంతో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు సంతానం. 1937లో ఎం.ఎ. పట్టా పొంది రాష్ట్ర దస్తారీలో గుమస్తాగా చేరాడు. వీరు మందిర్ మసీదును సమంగా చూసేవారు. మానవత్వం, సమానత్వం వెల్లి విరియాలని కోరుకునేవారు. 1934 నుండే కమ్యూనిస్ట్ పార్టీతో రహస్య సంబంధాలు పెట్టుకున్నారు. 1939లో కామ్రేడ్స్ అసోసియేషన్ ఆవిర్భవించింది. దీనికి వీరు సభ్యులుగా ఉన్నారు. వీరు 1940లో కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శిగా, రాజబహదూర్ గౌర్ సహాయ కార్యదర్శిగా ఉన్నారు.



ఆంగ్లేయుల దమననీతిని ఖండిస్తూ వారి విధానాలకు వ్యతిరేకంగా ఉపన్యసించి నందుకు జైలులో శిక్ష అనుభవించారు. వీరు జైలు గోడల మధ్య అద్భుతమైన కవితలు రాశారు. జైల్లో ఉన్న ఖైదీలలో ఆంగ్లేయులపై నిజాంపై వ్యతిరేక భావాలను నాటారు. మగ్దూం కవిత్వం, కామ్రేడ్‌తత్వం రెండు నయనాల వంటివి. మగ్దూం సిటీ కాలేజిలో లెక్చరర్‌గా పనిచేస్తున్నప్పుడు యువరాజుపై కవితలల్లమని ఆదేశం వస్తే మనస్సాక్షి అందుకు ఒప్పుకోనందుకు 1941లో ఉద్యోగానికి రాజీనామా చేశాడు.

నిజాం స్టేట్‌లో రైల్వే ఉద్యోగుల సమ్మెకు నాయకత్వం వహించారు. అదేవిధంగా సింగరేణి కార్మికులు యూనియన్ పెట్టుకోవడానికి సహకరించినారు. 1947లో ఆయుధాలు చేతబట్టి సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. 1958లో ఎమ్మెల్సీగా ఎన్నికై లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నాయకుని పాత్రను సమర్థవంతంగా పనిచేశారు.

కార్మిక నాయకునిగా చైనా, రష్యా, ప్రాచ్య యూరప్, ఆఫ్రికా దేశాలను పర్యటించారు. వీరు 1958లో కాగజ్ కీ ఫూల్ అనే సినిమాకు పాటలు రాసారు. ఆ పాటలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. 1968లో బర్సాత్ అనే సినిమాకు పాటలు వ్రాసారు. తరువాత కార్మికుల జీవితాలలో వెలుగులు నింపారు.

1969 ఆగస్టు 24న ఆనాటి భారత రాష్ట్రపతి వి.వి. గిరి ఢిల్లీలో ఏర్పాటు చేసిన ముషాయిరాలో పాల్గొని నవ్వుల పువ్వులు పంచినారు. ఆగస్ట్ 25న గుండెపోటు వచ్చి ఆగస్ట్ 26న మరణించారు.

**ఆరుట్ల కమలాదేవి :**

తెలంగాణా మట్టి కొలనుపాక నుండి లేచి మహామనిషిగా, వికసించిన అగ్ని పుష్పం ఆరుట్ల కమలాదేవి. మహిళా విముక్తి కోసం, తెలంగాణా విముక్తి కోసం అలుపెరగని సమర పోరాటం చేసిన వీరవనిత. తుపాకి చేతబూని శత్రువుల నిద్రను

దూరం చేసిన సాహసి. అరణ్య అజ్ఞాతవాసాలు భరించిన సాహసి. జైల్లో హక్కులకోసం పోరాడిన ధీశాలి.

ఆనాటి నిజాం సంస్థానంలోని నల్లగొండ జిల్లా ఆలేరు తాలుకాలోని మంతపూరి గ్రామంలో **1920**లో మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించింది. వీరి తల్లిదండ్రులు లక్ష్మీ నరసమ్మ, పల్లా వెంకటరెడ్డి గార్లు. తల్లిదండ్రులు పెట్టిన పేరు 'రుక్మిణి'. ఆ రోజుల్లో గ్రామాల్లో పాఠశాలలు లేవు. అందుకని ఇంటి, వంట పనులు నేర్చుకుంటూ పెరిగింది రుక్మిణి. ఆమెకు **11** సం. వయస్సులో మేనమామ కొడుకు ఆరుట్ల రామచంద్రారెడ్డితో **1932**లో వివాహం జరిగింది. వీరిది కొలనుపాక గ్రామం. విద్యార్థి దశలోనే జాతీయోద్యమ ప్రభావానికి లోనై ఆదర్శ భావాలు కలిగిన వారు పెళ్లిలో రెండు షరతులను విధించారు. **1.** వైదిక మంత్రాలతో కాకుండా ఆర్య సమాజ వివాహం **2.** పెళ్ళి తర్వాత భార్యను చదివించడానికి అనుమతి. ఈ షరతులకు ఇరు కుటుంబాలు అనుమతించాయి. పెళ్ళిలో తన భార్య పేరు 'రుక్మిణి' నుండి కమలాదేవిగామార్చారు. ఆరోజుల్లో జాతీయోద్యమ నాయకురాలు కమలాదేవి ఛటోపాధ్యాయ ప్రేరణతో ఆ పేరు పెట్టినారు. ఆ పేరు వారు చరితార్థం చేశారు.

హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్‌లో ఉంటూ రామచంద్రారెడ్డి చదువుకుంటున్నారు. ఆ రోజుల్లో భార్య కమలాదేవిని మాడపాటి హన్మంతరావు గారు స్థాపించిన ఆంధ్ర గరల్స్ హైస్కూల్‌లో చేర్పించారు కాని ఉండటమెక్కడ ? అప్పటికి ఆడపిల్లలకు హాస్టల్స్ లేవు. రాజ బహద్దూర్ వెంకట్రామిరెడ్డి గారిని ఒప్పించి రెడ్డి హాస్టల్‌కు అనుబంధంగా బాలికల హాస్టల్ ప్రారంభింపచేసినారు. ఈ హాస్టల్‌లో మొదటి బోర్డర్ శ్రీమతి ఆరుట్ల కమలాదేవి. వీరు హైస్కూల్‌లో చదువుతున్న రోజుల్లోనే **1934** నుండి ఆంధ్ర మహాసభలకు తీసుకొని వెళ్ళుతుండేవారు. అందులో వాలంటీర్‌గా పనిచేసేవారు. వీరికి రావి నారాయణ రెడ్డి, మగ్దూం, బద్దం ఎల్లారెడ్డి, చెన్నమనేని రాజేశ్వరరావు గారలతో పరిచయం అయింది. ఆమెలోని చైతన్యం వెలికి తీసినట్లయింది. స్కూల్ ఫైనల్ పాసై కమలాదేవి కొలనుపాకలో 'వంటశాల' పేరుతో ఒక వయోజన విద్యా కేంద్రాన్ని, గ్రంథాలయాన్ని స్థాపించి నిర్వహిస్తుంటే ఆ కాలంలో పాఠశాల, గ్రంథాలయం నిర్వహణ నిషేధం ఉండేది. ఈ విషయం తెలుసుకొని



పాఠశాలను జాగీర్దార్ మూయించి వేస్తే, కొలనుపాకలోని జైనదేవాలయ అధికారులకు ఈ విషయం తెలిసి గుడి ప్రాంగణంలో పాఠశాల నిర్వహణకు అనుమతి ఇస్తే అక్కడే ఏడాదిపాటు పాఠశాల నిర్వహించి గ్రామీణ వయోజనులను అక్షరాస్యులుగా మార్చారు.

చిలుకూరులో జరిగిన **10**వ ఆంధ్ర మహాసభల్లో చురుకుగా పాల్గొని ఎందరో మహిళలను తీసుకొని వెళ్ళారు. ఆకాలంలో నల్గొండ జిల్లాలో ప్రజోద్యమ జ్వాలలతో అట్టుడికిపోతున్న వాతావరణం ఈ నేపథ్యంలో మహిళలకు ఆత్మరక్షణ అవసరమని భావించి విజయవాడలో మహిళా ఆత్మరక్షణ శిక్షణా శిబిరానికి పంపించి సైనిక శిక్షణ పొందారు.

తిరిగి రాగానే భువనగిరిలో పదకొండవ ఆంధ్ర మహాసభ సన్నాహాల్లో ఊరూరా తిరిగి ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ఆ వేదికకు ఎందరినో రప్పించారు. ఈ సభ రావి నారాయణ రెడ్డి నేతృత్వంలో అతివాదుల హస్తగతమైంది. దౌర్జన్యాలు, పీడనలకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి ఈ సభ పిలుపునిచ్చింది. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్ట్ పార్టీ సభ్యత్వం తీసుకున్న కమలాదేవి రాజకీయ సైనిక శిక్షణ పొంది ఆరితేరిన వీరవనితగా శత్రువులకు దడపుట్టించారు.

**1944**లో కమలాదేవికి కొడుకు పుట్టాడు. అతడికి విప్లవకుమార్ అని పేరు పెట్టారు. **1946**లో మార్షల్ లా విధించారు. నిర్బంధం బాగా పెరిగింది. చంటి బిడ్డను బంధువుల దగ్గర వదిలేసి భర్తతో పాటు రహస్య జీవితంలోకి వెళ్ళి భువనగిరి, ఆలేరు మొదలైన తెలంగాణాలోని ఇతర ప్రాంతాల్లో రామచంద్రారెడ్డితో కలిసి సాయుధ దళాల్లో పనిచేసారు. నిజాం పోలీసులతో ప్రత్యక్ష పోరాటాలు జరిపారు. చల్లూరు గుట్టల్లో జరిగిన చారిత్రాత్మక పోరాటంలో వీరకాళిగా విజృంభించారు. ఆయుధాలు చేపట్టి దళానికి నష్టం కాకుండా కాపాడుకున్నారు.

**1947** ఆగస్టు **15**న యావద్భారతానికి స్వాతంత్ర్యం వస్తే హైదరాబాద్‌లో నిజాం పరిపాలన కొనసాగుతుంటె, రజాకర్ల పేరుతో గ్రామాలపై దాడులు జరుగుతుంటే బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్ పిలుపుతో తెలంగాణా సాయుధ పోరాటానికి పిలుపు వచ్చింది. ఆరుట్ల దంపతులు అగ్రభాగాన నిలిచారు. కమలాదేవి, వందలాది మహిళలు నల్లగొండ జిల్లాలో సాయుధ పోరాటంలో పాల్గొనేట్లు చేసారు.

1948లో పోలీసులు వీరిని అరెస్ట్ చేసి వరంగల్ జైలుకు అక్కడి నుంచి ఔరంగాబాద్, సికింద్రాబాద్ జైళ్ళలో రెండున్నర సంవత్సరాల పాటు కఠిన కారాగార వాసాన్ని అనుభవించిన వీరు 1951 చివరలో విడుదలయ్యారు. 1952 మొదటి సార్వత్రిక ఎన్నికల్లో ఆలేరు నుండి అత్యధిక ఓట్లతో గెలిచి శాసనసభకు ఎన్నికై 1967 వరకు నియోజక వర్గానికి ఎంతో సేవ చేసారు. 1962లో శాసనసభ ఉపనాయకులుగా 1964 నుండి ప్రతిపక్ష నాయకురాలిగా ఎంతో చాకచక్యంగా బాధ్యతలు నిర్వహించినారు.

భారత దేశ రాష్ట్రాల్లో మొట్టమొదటి ప్రతిపక్ష నాయకురాలిగా చరిత్ర సృష్టించారు.

1955లో బల్గేరియా, జెకోస్లోవేకియా, జి.డి.ఆర్, ఆస్ట్రియా దేశాలు పర్యటించారు. 1983లో ఆరుట్ల రామచంద్రారెడ్డితో కలిసి సోవియట్ యూనియన్ సందర్శించారు.

ప్రజల సమస్యలపై బయట శాసనసభలో పోరాడుతూనే 1973లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కార్యదర్శిగా ఎన్నికై బాధ్యతలు నిర్వహించారు.

65 సం. పూర్తయ్యాక కమలాదేవి క్రియాశీల రాజకీయాల నుండి స్వచ్ఛందంగా విశ్రమించి విశ్రాంత జీవితం గడిపారు.

1985లో వీరి భర్త మరణించారు. గుండె నిబ్బరంతో పతీ వియోగాన్ని భరించిన ధీశాలి కమలాదేవి. 1998లో ఆమెకు కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. వీరు 2001లో తుదిశ్వాస విడిచారు.

**మల్లు స్వరాజ్యం :**

1930లో నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలంలోని కర్విరాల కొత్తగూడెం గ్రామంలో భీమిరెడ్డి రాంరెడ్డి, చుక్కమ్మ దంపతులకు స్వరాజ్యం జన్మించారు. వీరు పెద్ద భూస్వామి. వీరి తండ్రి వీరికి, అక్క శశిరేఖకు ఇంటి దగ్గరనే ఉపాధ్యాయుడిని పెట్టించి చదువు చెప్పించారు. వారిద్దరికి గుర్రపుస్వారి, కత్తిసాము నేర్పించారు.

వీరు ఆంధ్రమహాసభ కార్యక్రమాల్లో భీంరెడ్డి నరసింహారెడ్డి గారితో కలిసి చురుకుగా పాల్గొన్నారు.

అక్కచెళ్ళెలిద్దరిలో పోరాట బావుటాను ఎగరవేయడానికి కారణం వాళ్ల అమ్మ చుక్కమ్మ. చుక్కమ్మ గారు మాక్సిమ్ గోర్కి వ్రాసిన అమ్మ నవలను చదివి తన



పిల్లలకు వినిపించి వారిని ఉద్యమోన్ముఖులుగా చేసారు. 1942లో 12 ఏండ్ల వయసులో కొలనుపాకలో జరిగిన సమావేశానికి అక్క శశిరేఖతో పాటు హాజరై బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి ఉపన్యాసాలకు ఉత్తేజితురాలై భూస్వాములపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.

అన్న భీంరెడ్డి నరసింహారెడ్డి అడుగుజాడలలో 12 సం.లకే ఉద్యమ బాట పట్టింది. వరంగల్‌లోని దేవరుప్పులలో స్వరాజ్యం మేనత్త ఉండేది. అక్కడికి వెళ్ళి ఆమె భూస్వాముల వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటం జరిపారు. అదేసమయంలో విసునూరి రామచంద్రారెడ్డి దురాగతాలను విన్న స్వరాజ్యం రక్తం మరిగిపోయింది. సాయుధ దళాలతో ఆ గ్రామానికి వెళ్ళి బాధితులకు ధైర్యం చెప్పింది. ఉయ్యాల పాట ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసింది.

ఆ పాట అందరిని ఆకట్టుకుంది. అప్పుడు స్వరాజ్యం వాడ వాడ తిరుగుతూ, ఊరు ఊరు తిరుగుతూ ఈ పాటను పాడి 30 గ్రామాల ప్రజలను పోరాటం వైపు మళ్ళించారు. దొడ్డి కొమరయ్య మరణం తర్వాత ఆంధ్ర మహాసభ కొద్దిమంది వాలంటీర్లను ఎంపికచేసి కర్రసాము, కొడవళ్ళు, వడిసెలు విసరడం, కండ్లలో కారం చల్లడం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చింది. ఈ శిక్షణతో పాటు పేదలకు భూపంపిణీ కూడా ప్రారంభమైంది.

ఒక్కొక్క రైతుకు 10 ఎకరాల భూమి చొప్పున భూపంపిణీ చేసారు. లెవీ పేరుతో పండిన పంటను దోచుకోవాలని ప్రయత్నించిన పోలీసులను స్వరాజ్యం చుట్టుముట్టి వారిని ముప్పుతిప్పలు పెట్టారు. గ్రామాల్లో పోరాటాన్ని ఉధృతం చేసి గుర్రంపై తిరుగుతూ రజాకర్లను హడలగొట్టింది. ఆమెను పట్టి ఇస్తే స్వరాజ్యం తలకి 10 వేల రూపాయల బహుమానం అని నైజాం ప్రభుత్వం వెల కట్టింది. ఆమే ప్రజలలోని అభద్రతా భావాన్ని పోగొట్టడానికి గ్రామ రక్షక దళాలను ఏర్పాటు చేయడంలో కీలకపాత్రను పోషించారు. పేదలకు భూమి పంచుతూ గ్రామ రాజ్యాలను ఏర్పాటు చేశారు.

ఆకునూరు, మాచిరెడ్డి పల్లెలలో పోలీసులు చేసిన దురాగతాలను గూర్చి దేవులపల్లి వెంకటేశ్వరరావు గారు వ్రాసిన పుస్తకం చదివి ప్రజలను మేల్కొలిపింది. అనేక బహిరంగ సభలలో ఉపన్యాసాలు ఇచ్చి ప్రజలను ఉత్తేజితులను చేసింది.

14 ఏండ్ల వయసులోనే పోలీసులకు, నైజాం సర్కార్‌కు, దొరలను సవాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపే విధంగా మాట్లాడుతూ, పాటలు పాడుతూ ఆమె ప్రచారం చేసింది.

మాచిరెడ్డి పల్లి - ఆకునూరు దురంతాలను మహిళలకు వివరిస్తూ వారిని జాగృతులను చేసింది. 1946 - 1951 వరకు జరిగిన తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు.

1947లో సంపూర్ణ పోరాటానికి పిలుపు నిచ్చిన బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొయినుద్దీన్‌ల పిలుపు మేరకు ఏరియా పార్టీ కమిటీలో కార్యదర్శి వర్గ సభ్యురాలుగా, గ్రామ పరిపాలనా ఏరియా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యురాలుగా ఉండి దళాలను ఏర్పాటు చేస్తూ పోరాటం నిర్వహించిన స్వరాజ్యం పోరాట సమయంలో తాలూకా, జిల్లా కమిటీ నాయకురాలిగా ఎదిగారు.

తెలంగాణా పోరాట సబ్‌కమిటీకి ఓంకార్ కార్యదర్శిగా, మిలటరీ విభాగానికి మల్లు వెంకట నర్సింహారెడ్డి ఇన్‌ఛార్జిగా ఉంటే దళాల నిర్మాణం, గ్రామ పరిపాలన సబ్ కమిటీకి స్వరాజ్యం కార్యదర్శిగా వ్యవహరించారు.

తెలంగాణా సాయుధ పోరాటంలో స్వరాజ్యంకు సహచరుడైన మల్లు వెంకట నర్సింహారెడ్డితో 1954లో దేవులపల్లి వెంకటేశ్వరరావు, ఉప్పల మల్సూరులు వివాహం జరిపించారు.

పెళ్లయ్యాక నర్సింహారెడ్డి పూర్తిస్థాయి సమయం కేటాయించగా స్వరాజ్యం కొత్తగూడెంలో పొలం అమ్ముకొని సూర్యాపేట సమీపంలోని రాయినిగూడెంలో పొలం కొన్నారు. వ్యవసాయం చేశారు. కొడవలి పట్టి వరి కోసింది. ముగ్గురు పిల్లలకు తల్లి అయ్యింది. వ్యవసాయం చేస్తూ పిల్లలను చూసుకుంటూ పార్టీలో పని చేసేవారు. అన్న భీంరెడ్డి నర్సింహారెడ్డి అసెంబ్లీకి పోటీచేస్తే ఈమె ప్రచార భారాన్ని తన నెత్తిన వేసుకొని ప్రచారం చేసేది. మహిళా ఉద్యమాల్లో అగ్రభాగాన నిలిచిన స్వరాజ్యం 1978 సార్వత్రిక ఎన్నికల్లో తుంగతుర్తి శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీచేసి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1983లో మళ్ళీ తుంగతుర్తి నుంచి గెలిచారు.

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, అవినీతి, భూసంస్కరణలపై



అసెంబ్లీలో ప్రశ్నలు లేవనెత్తారు. మోటూరు ఉదయంతో కలిసి ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం అభివృద్ధికి రాష్ట్రమంతటా పర్యటించారు. జాతీయస్థాయిలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘంలో కూడా ఆమె అగ్రభాగాన నిలిచారు.

మంజరి గుప్తా, సుశీలా గోపాలన్, విమలా రణదీవె, అహల్యా రంగ్నేకర్, కెప్టెన్ లక్ష్మీ సెహగల్, కనక ముఖర్జీ, మోటూరు ఉదయంతో కలిసి జాతీయస్థాయిలో అనేక మహిళా ఉద్యమాలు నడిపారు. 1981 నుంచి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘానికి ఉపాధ్యక్షులుగా కొనసాగినారు.

రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షులుగా 10 సం. లు పనిచేశారు.

**దేవులపల్లి శ్రీరంగమ్మ :**

క్రీ.శ. 1928లో పిల్లలమర్రి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు గోరెంట గ్రామ వాస్తవ్యులైన ఆకునూరు చక్రగిరిరావు, రుక్కుణమ్మలు. వీరిని రంగనాయకమ్మ అని కూడా పిలుస్తారు. ప్రాథమిక విద్య పూర్తిచేసి భారత, భాగవతములలోని కొన్ని పద్యాలు కంఠస్తము చేశారు. వీరికి ఆర్థికంగా తండ్రిగారు, చిన్నాన్న గారైన ఆకునూరి సీతారామారావు, పెద్దమామ ఉమ్మెత్తల వెంకట అప్పారావు గార్లు సహాయపడ్డారు. వీరి దృష్టిలో డి.వి. గారు వీరివి ఒక స్వతంత్రమైన జీవితాన్ని సృష్టించి సమాజంలో వీరొక వ్యక్తిగా జీవించడానికి కావలసిన స్వేచ్ఛను ఇచ్చారు.

వీరికి 5 సం. వయస్సులోనే పెళ్ళి అయింది. అతడు సంవత్సరం తిరగక ముందే చనిపోయాడు. బాల్యం సొంత ఊర్లో స్నేహితురాళ్లతో గడిచిపోయింది. వీరికి మళ్ళీ పెళ్ళి చేయాలని తల్లిదండ్రులు వెతకగా డి.వి గారి గురించి తెలిసింది. డి.వి. గారికి కూడా చిన్న వయస్సులోనే వివాహం జరిగి ఆమె టైఫాయిడ్‌తో చనిపోయింది. వారి కుటుంబ సభ్యులు కూడా వారికి వివాహం చేయదలచినప్పుడు డి.వి. గారు తనలాగే చిన్న వయస్సులో వివాహం జరిగి భర్తను కోల్పోయిన అమ్మాయిని చేసుకోవాలని వారి అభిప్రాయాన్ని వెలిబుచ్చితే, కుటుంబ సభ్యులు వ్యతిరేకతను తెలిపారు. అయినా డి.వి గారు పట్టుదలతో శ్రీరంగనాయకమ్మను 1939లో వివాహం చేసుకున్నారు. డి.వి గారి కుటుంబ సభ్యులకు ఇష్టంలేదు కాబట్టి వారెవరు రాలేదు. వీరి మేనమామ పెండ్లికి వచ్చిన ఐదువందల మంది బంధువులతో సంతకాలు పెట్టించుకున్నారు, ఎందుకంటే వీరిని కులం నుండి బహిష్కరించకుండా.

ఇంట్లో అంతా సవ్యంగానే ఉండేది. ఉమ్మడి కుటుంబం, సంప్రదాయ కుటుంబం. డి.వి. గారు పార్టీ పనుల మీద వేరే ఊరు వెళ్ళినప్పుడల్లా వీరు వీరి అమ్మమ్మ గారింటికి వెళ్ళేవారు.

ఎనిమిదవ ఆంధ్ర మహాసభ చిలుకూరుకు వీరు డి.వి. గారితో పాటు వెళ్ళి సభలో పాల్గొని మహిళా ప్రతినిధిగా గోషా పద్ధతి, స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యము అనే అంశంపై శ్రీరంగమ్మగారు ప్రసంగించారు. వీరి ఉపన్యాసం పత్రికల్లో వచ్చింది.

ఉమ్మడి కుటుంబంలో దుబారా ఖర్చులు, అప్పులు చేసి జీవితాన్ని వెళ్ల పోయడం, కష్టించి పని చేయకపోవడం వలన డి.వి. గారు వేరు కాపురం పొలంలో చిన్న పూరి పాక వేసుకుని నివసించడం ప్రారంభించారు.

కొన్నాళ్ళకి కూతురు పుట్టింది. ఇల్లు ఎప్పుడూ కార్యకర్తలతో కళకళలాడుతూ ఉండేది. ఎక్కువగా గుంటూరు జిల్లాకు చెందిన మునిపల్లె రామారావు గారు వచ్చేవారు.

విజయవాడలో పార్టీ కార్యకలాపాల గురించి క్లాసులు జరిగాయి. శ్రీరంగమ్మ కూడా పాల్గొన్నారు. క్లాసులు చాలా చక్కగా జరిగాయి. పార్టీ పాటలు, మహిళా సంఘాల పాటలు నేర్పించారు. వేగరావోయి కార్మికా వేగరావోయి కర్షకా అనే పాటను క్లాసు ప్రారంభంలోనే ఒకరు చదవుతుంటే అందరు కలిపి పాడేవారు. స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీల ఇతర సమస్యల గురించి విపులంగా వివరించినారు.

ఇంతలో హైదరాబాద్‌లో 10వ ఆంధ్ర మహాసభ వచ్చింది. ఈ సభలో శ్రీరంగనాయకమ్మ పాల్గొన్నారు. ఈ సభలో ఎల్లాప్రగడ సీతాకుమారిని కలిసారు.

భువనగిరిలో 11వ ఆంధ్ర మహాసభ సమయంలో వీరు భువనగిరిలో ఉండేవారు. అక్కడ వీరికి ఆరుట్ల కమలాదేవి గారితో పరిచయమయింది. సన్నిహితులు కాగలిగారు. ఈ భువనగిరి సభలో మహిళా సమావేశం ఏర్పాటు చేయలేదు. ఆ సభకు అధ్యక్షత రావి నారాయణరెడ్డి గారు. వారిని ఊరేగింపుగా తీసుకొని వెళ్ళితే ఆ సభలో వీరు కూడా పాల్గొన్నారు. మండుటెండలో నెత్తిన కొంగు వేసుకొని పాపకు కొప్పె నిండుచూలాలిగా ఉండి కూడా పాల్గొన్నారు. వీరు వారి స్వంత ఊరు వదిలినప్పటి నుండి డి.వి. గారితో పాటు తిరుగుతూనే ఉన్నారు. భువనగిరి, సూర్యాపేట్, హైదరాబాద్ ఇలా ఎన్ని ఊర్లు తిరిగారో.



తిరగలేని సమయంలో వెళ్ళి అమ్మమ్మ వాళ్ల ఊర్లో ఉండేవారు. అమ్మాయి, అబ్బాయి పుట్టినప్పుడు డి.వి. గారు ఉన్నది చాలా తక్కువ రోజులు. అందుకే ఎప్పుడైనా డి.వి. గారు వస్తే పిల్లలు వదిలిపెట్టకుండా ఉండేవారు. డి.వి. గారు ఎప్పుడు వస్తారో, ఎన్ని నెలలకు వస్తారో తెలియని రోజులు. పార్టీ పనులు పెరిగి డి.వి. గారు ఇంటికి వచ్చే రోజులు చాలా తగ్గిపోయినాయి. వచ్చినా ఏ రాత్రిపూటో వచ్చేవారు. ఎవరికీ తెలియదు. పిల్లలు నిద్రపోతుండేవారు. చిన్ని చీకటి దీపాలలో వారి ముఖాలు కనిపించవని టార్చిలైటును వెలిగించి పిల్లలను బాగా చూసుకుని వెళ్లేవారు. అలా పిల్లల బాల్యమంతా తండ్రి లేకుండానే గడిచిపోయింది.

కొన్నినెలల్లోనే నిర్బంధ విధానం ప్రారంభం కావడం, డి.వి గారు రహస్య జీవితం ప్రారంభించడం, అతి జాగ్రత్తగా పోలీసుల కండ్లు గప్పి ఎప్పుడైన ఒకరోజు రాత్రి వచ్చి తెల్లవారుజామునే వెళ్ళిపోయేవారు. ఒకసారి పరగణా నుండి 16 మైళ్ళు నడిచి వచ్చారట. వారున్న ఇంటికి పోలీసులు రావడంతో తరువాత వీరకి ఇల్లు కిరాయికి ఇచ్చే వాళ్ళే దొరకకుండా అయిపోగా వీరు వీరి అమ్మమ్మ గారింట్లోనే ఉండిపోవాల్సి వచ్చింది.

అప్పటికే సూర్యాపేట తాలుకు గ్రామాలలో పార్టీ, ఆంధ్ర మహాసభల నాయకత్వాన ప్రజలు జైత్రయాత్రలు సాగించడం, ప్రతి ఊర్లో సంఘాలు ఏర్పడడం క్రమంగా సాయుధ పోలీసులు, మిలటరీ వారు గ్రామాల మీద దాడిచేసి కాల్చి చంపడాలు మొదలైనవి ప్రారంభం కాగానే, వీరి బాబుకు మూడవ ఏడు వచ్చి వారి తాతయ్య పుట్టు వెంట్రుకలు తీయించే వేడుక ఘనంగా జరపాలని బంధువులందరిని పిలిచారు. ఆ రాత్రి 300 మంది సాయుధ పోలీసులు డి.వి. గురించి ఇంటికి వచ్చి సోదా చేసి వెళ్ళారు.

కొన్ని నెలల తర్వాత డి.వి. గారి పిలుపు మేరకు మునగాల పరగణాలోని ఒక గ్రామంలో వీరికి రక్షణ దొరికింది. తిరిగి డి.వి. గారితో ఉండే అవకాశం దొరికింది శ్రీరంగమ్మకు.

ప్రతి ఊళ్లో సంఘ నాయకత్వంలో సర్కారుకు లెవీ ధాన్యం కొలవకుండా, పన్నులు చెల్లించడం లేదని, గ్రామాల మీద రజాకర్లు దాడిచేసి దౌర్జన్యాలు చేసి ప్రజల

ఇండ్లను ప్రత్యేకించి నాయకుల ఇండ్లను తగులబెట్టేవారు. వీరి గ్రామంలో కూడా వీరు ఉండివచ్చిన పాకను కూడా తగులబెట్టారు, తగుల బెట్టేటప్పుడు కక్షతో ఖాళీ పాకే అయినప్పటికీ, 'ఇందులోనే కమ్యూనిజం పుట్టిందిరా' అనుకుంటూ కిరసనాయిలు పోసి నిప్పు అంటించారని చూసినవారు చెప్పగా విన్నారు.

ఈ ధాన్య సేకరణలో డి.వి గారి అన్నగారి ధాన్యాన్ని పార్టీ వారు స్వాధీనం చేసుకుంటే వారు వచ్చి డి.వి. గారిని కలిసినప్పుడు వారు పార్టీ సిద్ధాంతాన్ని స్పష్టంగా చెప్పడంలో వారి అన్నగారు కోపంతో వెళ్ళిపోవడం మళ్ళీ వారు ఎన్నడు డి.వి. గారిని కలవక పోవడం అదే ఆఖరి చూపు అయింది.

ఇంకొకసారి డి.వి. గారి మేనత్త కూతురు వచ్చి తన ఇంటిమీద పార్టీవారు దాడి చేశారని, బంగారు నగలన్నీ తీసుకున్నారని, వాటిని తిరిగి ఇప్పించమని అడిగింది. అప్పుడు డి.వి. గారు విచారించి, తిరిగి ఇప్పిస్తానని చెప్పి వారు విచారణ జరిపించగా పార్టీ కార్యాలయం నుండి గ్రామాలలో చాలామంది ఆడవారు చెట్లపాదుల్లో, మట్టి కుప్పల్లో వేసి తమ నగలు ఎత్తుకు పోయారని గొడవ చేస్తున్నారని స్థానిక నాయకుల నుంచి సమాధానం వచ్చింది. అదే విషయం ఆవిడకి చెప్పితే ఆవిడ చాలా కోపంగా వెళ్ళిపోయింది. తరువాత డి.వి. గారు విచారణ జరిపిస్తే తుదకు ఆ ప్రాంత దళ నాయకుడొకడు బంగారం కాజేశాడని తెలిసింది. అతడు పార్టీ నుండి దూరమైనాడు.

ఈవిధంగా ఈ పార్టీ కార్యకలాపాలవల్ల బంధువులతో కూడా దూరం అవడం జరిగింది. అంతేకాకుండా ఆత్మీయులు అనారోగ్యం పాలైనా, మరణించినా, అవసాన దశలో ఉన్నా చూడలేక ఎందరినో కడసారి చూపుకీ నోచుకోకనే కాలం వెళ్ళదీయాల్సి వచ్చింది.

కొన్నిసార్లు డి.వి. గారు ఎంత కష్టించి పనిచేసేవారంటే వారు భోజన సమయంలోనే వారితో మాట్లాడే అవకాశం లభించేది. నాయకుల భార్యలు కూడా రిపోర్ట్స్ రాయడం, పత్రికలకు పంపడం లాంటి పనులు చేసేవారు.

ఇలా ఎన్నోరోజులు గడవలేదు మళ్ళీ పోలీసు దాడులు అక్కడి నుంచి మకాం ఎత్తివేసి విజయవాడ చేరినారు. విజయవాడ చేరడానికి ఎడ్ల బండ్లలో, బస్సులో ప్రయాణం చేసి చేరినారు. అక్కడ అక్కడ కొన్ని కొన్ని రోజులు ఉంటూ బ్రతకాల్సి వచ్చింది.



సొంత ఖర్చులకు పార్టీ డబ్బు ఉపయోగించరాదని, వంటి మీద ఉన్న బంగారాన్ని కొంత అమ్మి ఖర్చుపెట్టుకొమ్మని పార్టీ నుంచి తీసుకోవద్దని, డి.వి. గారి నుంచి లేఖ రాగానే వారి సూచన మేరకు వీరు కొంత బంగారాన్ని అమ్మి పిల్లలకు పాలు, పండ్లు తెప్పించుకునేవారు.

మళ్ళీ దాడులు జరుగుతున్నాయని, అక్కడి నుండి వేరే ప్రదేశానికి వెళ్ళి పోవాలని ఆదేశాలు వచ్చాయి. అలా తెలిసిన వారి ఊరికి వెళ్ళితే మేనమామ చనిపోయారని తెలిసి చాలా బాధపడ్డారు.

అక్కడ ప్రతిరోజు ఇల్లు మారాల్సిన పరిస్థితి. కొద్దిమంది ఆప్యాయత చూపించేవారు, ఇంకొద్దిమంది అసలు పట్టించుకునేవారుకాదు. ఎన్నోసార్లు సరైన బట్టలు లేక, సరైన భోజనం లేకుండా గడపాల్సి వచ్చింది. పిల్లలు చాలా కష్టాలు పడ్డారు.

మళ్ళీ మకాం మార్చారు. ఒకసారి డి.వి. గారి నుంచి ఉత్తరం వచ్చింది. ఒక ఊరికి పిల్లలను తీసుకొని రమ్మని ఒక మనిషిని ఇచ్చి పంపారు. వీరు వెళ్ళేసరికి డి.వి. గారు కార్యకర్తలతో మాట్లాడుతున్నారు. అది రాత్రంతా సాగింది. ఇంతలో డి.వి. గారు వెళ్ళే సమయం వచ్చింది. వారు వెళ్ళుతూ నిద్రపోతున్న పిల్లలను చూసి వీరి వద్దకు వచ్చి నీతో మాట్లాడే సమయం లేకపోయింది. తొందరగా వెళ్ళాలి. ఈరోజు మనం స్నేహితులుగా విడిపోదాము అని చెప్పి వెళ్ళిపోయారు.

మరి కొన్నాళ్ళ తరువాత డి.వి.గారితో మూడు రోజులు కలిసి ఉండే అవకాశం దొరికింది. మూడు రోజులు మూడు యుగాల్లా గడిచిపోయాయి. డి.వి. గారు పార్టీ కేంద్రం నుండి తెలంగాణాలోని పోరాట ప్రాంతాలకు వెళ్ళడానికై ప్రయాణమై పోతున్నట్లు చెప్పి సాయుధ పోరాటం వల్ల వచ్చే సాధక బాధకాలను చెపుతూ వీరు భవిష్యత్తులో ఎలా ఉండాలో సలహాలు ఇచ్చినారు. పిల్లలను చూసుకోవడమే కాకుండా పార్టీకి సహాయం చేయమని చెప్పినారు. అప్పుడు వెళ్ళినారంటే తిరిగి నాలుగు సంవత్సరాల పాటు వీరికి డి.వి. గారిని కలిసే అవకాశమే రాలేదు, కనీసం వారి జాడ కూడా తెలియదు.

కొద్దిరోజులకే పోలీస్ యాక్షన్ జరిగింది. తెలంగాణ నుండి కాందిశీకులుగా

వచ్చిన వారంతా వెళ్ళిపోయారు. డి.వి. గారి జాడ తెలియదు. అందరు వెళ్ళిపోతున్నారు. వీరు కూడా వారి నాన్నగారి దగ్గరికి వెళ్ళాలని నిశ్చయించుకుని మూడురోజులు అష్ట కష్టాలు పడి వారి నాన్నగారి ఊరు చేరుకున్నారు.

ఆ రోజుల్లో తల్లిదండ్రులు మిలటరీ వారికి భయపడి రక్షణ ఇచ్చేవారు కాదు. వీరికి మాత్రం వీరి నాన్నగారు పూర్తి రక్షణ ఇచ్చారు.

కొన్ని సం.లు అమ్మమ్మ వాళ్ళ ఇంట్లోనే ఉండి పాపను, బాబును స్కూలుకు పంపించి చదివించారు. ఇంకొన్నాళ్ల తర్వాత సూర్యాపేటలో మకాం పెట్టారు. పిల్లలను బడిలో వేసి చదివించారు. అక్కడ ఉన్నప్పుడే డి.వి. గారి నుంచి లేఖ వచ్చింది కలవమని, పిల్లలతో సహా వెళ్లి మూడు రోజులు ఉండి వచ్చారు. మరోసారి విజయవాడ కూడా వెళ్ళి కలిసి వచ్చారు. పిల్లలు తండ్రిని గుర్తించే స్థితిలో లేరు. డి.వి. గారిని వారి అబ్బాయి తాతయ్య అని పిలిచాడు. వీరిలాగే బి. సరోజిని గారు కూడా ఇద్దరు పిల్లలతో సూర్యాపేటలో వుండేవారు. వారు చాలా ఇబ్బందులు పడుతూ ఉండేవారు. ఆమెకు వీరు శక్తికొద్దీ సాయం చేశారు. ఇద్దరు కలిసి మెలిసి ఉండేవారు.

ఇంతలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. డి.వి. గారిని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అప్పుడు అందరు డి.వి. గారు ఎలా ఉంటారా అని ఆసక్తిగా చూసారట.

వీరి తండ్రిగారు వారిని, పిల్లలను డి.వి. గారికి అప్పగించి మీరే పోషించుకోవా లన్నారట. డి.వి. గారు అప్పుడు భార్యా పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోని యం.ఎల్.ఏ. క్వార్టర్లకు మకాం మార్చారు. కాని పరిస్థితి చాలా ఘోరం. వచ్చిపోయే వారితో కూర్చోవడానికి స్థలం కూడా ఉండేది కాదు. అక్కడ నుండి మరొక యం.ఎల్.ఏ. గారి క్వార్టరుకు మారిన తరువాత ప్రశాంతత దొరికింది శ్రీ రంగమ్మ గారికి.

అప్పుడే దసరా పండుగ వచ్చింది. డి.వి. గారిని తలంటి పోసుకొమ్మని అంటే వారు నా సహచరులు ఇంకా జైళ్ళలో ఉన్నారు. నేను అప్పుడే ఎలా పండుగ చేసుకోవాలి. వాళ్ళంతా జైళ్ళ నుండి విడుదలైనరోజే నాకు పండుగ అని అన్నారు.

తరుచుగా జిల్లాల నుంచి కార్యకర్తలు వచ్చేవారు. వారితో గంటల తరబడి మాట్లాడేవారు. ఎందరికో భోజనాలు పెట్టడం నిత్యకృత్యమైంది. ఇంటికి వచ్చినవాడు శత్రువు అయినాసరే, అన్నం పెట్టి లేదా మంచినీళ్ళిచ్చి పంపాలని డి.వి. అనేవారు.



పోరాటకాలంలో భూములంతా కౌలుకు ఇచ్చారు. ఆ భూమిని స్వాధీనం చేసుకొని వ్యవసాయం చేయిస్తేనే కాని పూట గడవని పరిస్థితి. డి.వి. గారికి భూమి పూర్తిగా తీసుకోవడం ఇష్టంలేదు. అందుకే 3 : 2 నిష్పత్తిలో తీసుకొని వ్యవసాయం చేయడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది, ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇలా రెండు సం.లు గడచిన తరువాత ఎన్నికలు వచ్చాయి. డి.వి. గారు పార్లమెంట్‌కు ఎన్నిక అయ్యారు. వీరు తిరగడం ఇంకా పెరిగింది. తరుచుగా ఢిల్లీ వెళ్ళి వచ్చేవారు. ఒకసారి రంగనాయకమ్మగారు ఢిల్లీకి వారితోపాటు వస్తాను అని అంటే డి.వి. గారు అక్కడ వారు పనులలో మునిగి ఉంటారని, ఎక్కడా తిప్పి చూపించడం కుదరదని, అంతే కాకుండా ఢిల్లీకి వెళ్ళే ఛార్జీలు జైళ్ళల్లో ఉన్న కార్యకర్తల కుటుంబాల ఖర్చులకు ఉపయోగపడతాయని వివరించి చెప్పారు.

ఈకాలంలోనే అమ్మాయి పెళ్లి రిజిస్టర్ మ్యారేజి చేసినారు. 1962 వరకు హైదరాబాద్‌లో ఉండి తిరిగి ఇద్దరు వారి స్వంత గ్రామం చేరుకున్నారు. ఆస్తి నుంచి ఆదాయం లేదు. పార్టీ నుండి ఆదరణ లేదు. కుటుంబ పోషణ కష్టసాధ్యమై పోయింది. అందుకే బాబును హైదరాబాద్‌లో వదిలి వీరు గ్రామానికి వచ్చారు. వీరు గ్రామానికి చేరుకున్న కొద్ది కాలానికే రంగనాయకమ్మ గారి తండ్రి మరణించారు. వారికి సేవచేసి, దగ్గరుండి ఋణం తీర్చుకున్నారు. అదే సమయంలో డి.వి. గారిని పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో వేసారు. వీరు అదే పూరి పాకలో అత్తగారిని తోడుగా పెట్టుకొని ఉన్నారు. వీరి అన్నయ్య కూడా చనిపోయారు. డి.వి. గారు 8 నెలల తర్వాత జైలు నుంచి విడుదలైనారు. తర్వాత వీరు మార్కిస్ట్ పార్టీ తరపున ఉన్నారు. ఈ పనిలో బాగా తిరిగేవారు. 1964 డిసెంబర్ నెలలో డి.వి. గారిని మళ్ళీ అరెస్ట్ చేసారు. 18 నెలల నిర్బంధం తర్వాత 1966 మే నెలలో విడుదల చేశారు. డి.వి. గారి తల్లిగారు చనిపోయారు. అప్పుడే ఎన్నికలు వచ్చాయి. మార్కిస్టు పార్టీలో కూడా చీలికలు వచ్చాయి.

డి.వి. గారు రెండుసార్లు టైఫాయిడ్‌తో బాధపడినారు. ఇంతలో కాంగ్రెస్ పార్టీ దాడులు ప్రారంభమైనాయి. ఇక డి.వి. గారు ఇంటికి రారని అర్థమైపోయింది. కొన్నాళ్ళకు వీరి అబ్బాయి వివాహం నిశ్చయమైంది. ఉద్యోగం కూడా వచ్చింది.

హైదరాబాద్‌లో రిజిస్టర్ పెళ్ళి చేశారు. పెళ్ళి ఆంధ్ర సారస్వత పరిషత్తు హాలులో జరిపారు. రహస్యంగా ఉన్నందున డి.వి. గారు పెళ్ళికి రాలేకపోయినారు. డి.వి. గారికి అరెస్టు వారెంటు లేదు. అయినా రహస్యంగా ఉండాలనే పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండి అరెస్ట్ చేయరని తెలిసి కూడా పెండ్లికి రాలేదు. ఒక నెల రోజులు ఉండి వారి కాపురానికి కావలసిన ఏర్పాట్లు అన్నీ చేసి తిరిగి ఊరికి వచ్చి వ్యవసాయం చేసుకుంటూ ఉండేవారు. కొడుకు కోడలు హైదరాబాద్‌లోనే ఉండేవారు.

ఇంతలో డి.వి. గారు మద్రాస్‌లో అరెస్ట్ అయి హైదరాబాద్‌కు ముషీరాబాద్ జైలుకు తెచ్చారు. కేసు విచారణ పూర్తి అయింది. శిక్ష పడింది. హైకోర్టుకు అప్పీలు చేసుకున్నారు. జమానాత్ మీద విడుదలయ్యారు. కొన్నాళ్ళ పాటు కలిసి ఉన్నారు. మనుమలతో సంతోషంగా కాలం గడిపారు. డి.వి. గారు దినం విడిచి దినం కోర్టుకు వెళ్ళడం, బాగా తిరగడం వల్ల క్రమంగా రక్తపోటు పెరిగిపోయింది. డాక్టరు కొన్ని రోజుల విశ్రాంతి అవసరమని చెప్పినా విశ్రాంతి తీసుకునే అవకాశం లేనందున డి.వి. గారికి గుండెపోటు వచ్చి ఆస్పత్రిలోనే నెలరోజులు ఉన్నారు. వారికి సేవ చేస్తూ కంటికి రెప్పలా వీరు కాపాడుకున్నారు. నిద్ర లేని సమయంలో డి.వి. గారు వీరితో కులాసాగా మాట్లాడేవారు. ఇన్ని ఏండ్లలో ఇప్పుడు మాట్లాడుకునే సమయం దొరికిందని సంతోషించారు.

క్రమంగా డి.వి. గారికి పని హెచ్చింది. ఇంగ్లీష్, తెలుగు పత్రికలకు వ్యాసాలు రాసి వారే స్వయంగా పోస్ట్ చేసి వచ్చేవారు. ఇంటికి వచ్చేవారితో గంటల తరబడి మాట్లాడేవారు. పూర్తిగా విశ్రాంతి లేకుండా పోయింది. ఇంట్లో ఉన్నప్పుడు ఎప్పుడు సి.ఐ.డి.లు వచ్చిపోతూ ఉండేవారు. హైదరాబాద్‌లో ఇబ్బందిగా ఉన్నదని వీరి అబ్బాయి ఖమ్మంకు బదిలీ చేయించుకొని అంతా అక్కడే కలిసి ఉన్నారు.

డి.వి. గారు రహస్య జీవితం గడుపుతూనే ఉన్నారు. ఇంతలో వారికి జులై , 12 1984లో తిరిగి గుండెపోటు రావడం వారు అంతిమ శ్వాస వదలడం జరిగింది. వారికి ఇష్టమైన స్వగ్రామంలోని మామిడితోటలోనే దహన సంస్కారాలు చేసారు. ప్రతి సం. జులై 12న సంస్మరణ సభ జరుగుతూ ఉంటుంది నేటికికూడా.

శ్రీరంగమ్మ గారు డి.వి. చనిపోయిన ఇరవై రెండు సంవత్సరాలకు మరణించారు. 2006లో 78 సం.ల వయసులో స్వర్గప్రాప్తి పొందినారు.



ఇలా జీవితం చివరి వరకు డి.వి. గారితో కలిసి వారి ఆశయ సాధన కొరకు పాటుపడిన నిగర్వి, ఆశయసాధకురాలు శ్రీ రంగమ్మగారు. వారు అందరికి ఆదర్శప్రాయులు.

**కొండపల్లి కోటేశ్వరమ్మ :**

చిన్నతనంలో జాతీయోద్యమం వైపు ఆకర్షితురాలైన కోటేశ్వరమ్మ బాలవితంతు. కృష్ణాజిల్లా పామర్రు గ్రామంలోని రైతు కుటుంబానికి చెందిన ఆరుమళ్ళ అంజమ్మ, సుబ్బారెడ్డి కూతురు. ఆంధ్రదేశ పర్యటనలో పామర్రు గ్రామానికొచ్చిన గాంధీజీకి తన వంటి మీద నగలు తీసివ్వటంతో మొదలు పెట్టి తనూ, తన కుటుంబమూ కమ్యూనిస్టు ఉద్యమంలో భాగమయ్యేంతవరకు కోటేశ్వరమ్మ గారి జీవితయాత్ర సాగింది. 1938లో కమ్యూనిస్టు పార్టీ చొరవతో ఆ ఆశయాలు గల కొండపల్లి సీతారామయ్యతో ఆమె వివాహం జరిగింది. 1939 - 1942 మధ్య కమ్యూనిస్టు పార్టీ రహస్యంగా నడుపుతున్న "స్వతంత్ర భారతి" పత్రిక సైక్లోస్టైల్ కాపీలు తీసివ్వటం నుంచి గ్రామాలలోకి వెళ్ళి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలలో చైతన్యం తెచ్చేవరకూ ఎన్నో కార్యక్రమాలలో భాగమయ్యారు. కృష్ణ కాలువ తవ్వకాలలో భాగమై వేలాదిగా వచ్చిన రైతుకూలీలను ఉత్సాహపరుస్తూ పాటలు పాడారు. "కన్యాశుల్కం" నాటకంలో బుచ్చమ్మగా నటించి ప్రశంసలు పొందారు. బెంగాల్ కరువు సమయంలో కరువు బాధితుల సహాయార్థం నాటకాలు వేశారు. తెలంగాణా రైతాంగ పోరాట కాలంలో అజ్ఞాత జీవితం గడిపి, పార్టీ నిర్దేశించిన పనులన్నీ చేశారు. రహస్యోద్యమంలో పనిచేసే స్త్రీలకు పసిపిల్లలుంటే ప్రతిబంధకమని నన్ను గర్భస్రావం చేయించుకోమంటే "డాక్టరు వైద్య సౌకర్యం బొత్తిగా లేనిచోట నాటుమందులతో గర్భస్రావం చేయించుకొని అనారోగ్యానికి గురయ్యాను" అన్నారు కోటేశ్వరమ్మ. కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని విరమించిన తర్వాత ఆమె మహిళా సంఘంలో పనిచేశారు. వివాహ జీవితంలో రేగిన కలతల వల్ల ఆర్థికంగా స్వతంత్రురాలు కావాలనుకుని ఆంధ్ర మహిళ సభలో చేరి చదువుకున్నారు. "మా అమ్మగారిచ్చిన గుండె నిబ్బరం, పుచ్చలపల్లి సుందరయ్యగారి మాటలూ నా చూపులను మలిచాయి. అమరుల త్యాగాలు నా మొదటి రచనకు ప్రేరణ అయ్యాయి" అనే కోటేశ్వరమ్మ ప్రస్తుతం హైదరాబాదులో చంద్ర రాజేశ్వరరావు పేరుమీద నిర్మించబడ్డ వృద్ధాశ్రమంలో ఉన్నారు.

**కె.ఎల్. మహేంద్ర :**

1921లో హైదరాబాద్‌లో జన్మించారు. వీరి పూర్తి పేరు ఖుష్ బదన్‌లాల్ మహేంద్ర. వీరు సామాన్య కుటుంబంలో జన్మించినా ఆరవ తరగతి చదువుతున్నప్పుడే ఉప్పు సత్యాగ్రహం, బెంగాల్‌లో టెర్రరిస్టుల ఉద్యమాల గురించి, బెంగాల్ విప్లవకారుల గురించి తెలుసుకొని తాను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలని 1936లో హైదరాబాద్‌లో జరిగిన సత్యాగ్రహంలో పాల్గొని గాంధీజీ ప్రబోధాలకు ప్రేరణ చెందారు. 1938లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతరం గేయం పాడరాదని నిషేధించారు. దీనికి విద్యార్థులు సమ్మె చేసారు. దానిలో వీరు పాల్గొన్నారు.

మహేంద్ర బంధువులు ఎక్కువగా నైజాం ప్రభుత్వంలో ఉద్యోగాలు చేసేవారు. వారికి మహేంద్ర రాజకీయాలు నచ్చేవి కావు. అందుకే బంధువుల ఒత్తిడితో శాంతినికేతన్‌కు వెళ్ళి చదువుకున్నారు. అక్కడ అనేక గ్రంథాలతో పరిచయం, సరోజినినాయుడు ప్రసంగం అన్నీ వీరిలో కొత్త ఆలోచనలను కలిగించాయి. ఇంకా నలుగురు విద్యార్థులతో కలిసి జపాన్‌పై చైనా సాగించే గెరిల్లా పోరాటంపై నాటకం వేసినందుకు కాలేజీ నుంచి బహిష్కరించారు. అక్కడి నుండి బర్ద్వాన్‌లో కాలేజీలో చేరారు. అనేకమంది కమ్యూనిస్ట్ నాయకులను కలిశారు. అందులో పూర్తిస్థాయి కార్యకర్తగా చేరారు. వీరిని లిసన్‌సోల్ వెళ్ళి కార్మికులతో పనిచేయమని పంపించారు. అక్కడ తొందరలోనే ఎఐటియుసి నాయకుడిగా పేరు తెచ్చుకున్నాడు. 10వేల మంది కార్మికులకు నాయకుడైనాడు. బెంగాల్ రాష్ట్రంలో బొగ్గుపని కార్మికుల సమస్యల సాధన కోసం కూడా శ్రమించారు. నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం కావడం మూలంగా మహేంద్రను హైదరాబాద్ పంపమని మగ్దుం గారు కోరగా 1946 జులైలో హైదరాబాద్ చేరి ప్రతిరోజు ఎన్నో కొత్త సంఘాలను స్థాపిస్తూ పోయినారు.

1946లో అక్టోబర్‌లో ట్రేడ్ యూనియన్‌ను నిషేధించారు. అందరు నాయకులు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. 1947 సెప్టెంబర్ నుండి తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. అప్పుడు వీరిని ట్రేడ్ యూనియన్‌ల నుంచి తప్పించి ‘టెక్’ రంగానికి పంపారు. టెక్ అంటే ఆయుధాల సేకరణ, రవాణా, వార్తా సంబంధాలు, పార్టీ సాహిత్యం అందించటం, జైళ్ళ నుంచి తప్పించడం లాంటి బాధ్యతలు అప్పజెప్పారు.



వీరు 1947లో ప్రమీలాతాయిని వివాహం చేసుకున్నారు. 1969లో పార్టీ వీరిని బెర్లిన్ పంపించింది. కె. ఎల్. మహేంద్ర, ప్రమీలాతాయి 4 1/2 సం. రహస్య జీవితాన్ని అత్యంత దుర్లభంగా గడిపారు.

తెలంగాణా సాయుధ పోరాట విరమణ తరువాత వారికి ట్రేడ్ యూనియన్ బాధ్యతలు అప్పగించారు. కార్మిక సంఘాల ద్వారా సమస్యల సాధన కోసం నిరంతరం పోరాటాలు జరిపారు. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎ.ఐ.టి.యు.సి.) కార్మికుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండి కార్మికుల హక్కుల సాధనకు ఎన్నో పోరాటాలు చేసారు.

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్యకు అధ్యక్షులుగా ఉండి అంతర్జాతీయ స్థాయిలో కూడా వీరు కీర్తిని గడించారు.

ముఖ్యంగా బొగ్గుగని కార్మికుల గురించి వీరు చేసిన సేవ మరువలేనిది. ప్రమీలాతాయి 1995లో మరణించగా వీరు ఒంటరివారైపోయారు. వీరు 2007లో మరణించారు.

నిరంతరం కార్మికుల సమస్యల సాధనకోసం పోరాడే ప్రపంచ కార్మికోద్యమ నేత కె.ఎల్. మహేంద్ర.

**టి.బి. విఠల్‌రావు :**

1916లో సికింద్రాబాద్‌లో జన్మించారు. వీరు ఇంటర్‌మీడియట్ వరకు చదువుకొని దక్షిణ మధ్య రైల్వేలో అకౌంటెంట్‌గా చేరినారు. ఉద్యోగం చేస్తూనే మగ్దూంతో సంబంధాలు కొనసాగిస్తూ రైల్వే కార్మికుల సమస్యలపై అవిరళ కృషి చేసారు. ఒక రైల్వేనే కాకుండా ఇతర కార్మిక సంఘాల ద్వారా సమస్యలను పరిష్కరించేవారు. సింగరేణి బొగ్గుగని కార్మికులకు 1961 - 1964 వరకు వచ్చిన లాభాలను బోనస్‌గా కార్మికుల వారికే పంచాలని కోర్టు ద్వారా సాధించి వారికి లభ్యమయ్యేట్లుగా చేసారు.

1952లో మొదటిసారిగా పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1954లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ 4వ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. రైల్వే బోర్డు సభ్యునిగా, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

పార్లమెంట్ సభ్యునిగా ఉంటూనే రైల్వే కార్మికుల సమస్యలు, బొగ్గుపని కార్మికుల సమస్యలపై నిత్యం పోరాటాలు సాగిస్తూనే వుండేవారు. వీరు ట్రేడ్ యూనియన్ నాయకునిగా అనేక దేశాలు సందర్శించారు. 1965లో తుదిశ్వాస విడిచారు. 1964లో ఖమ్మంజిల్లా కార్యదర్శిగా పనిచేసేవారు. వీరి భార్య బ్రిజ్ రాణి గౌర్.

**రాజ్ బహదూర్ గౌర్ :**

1940కి పూర్వమే ఉర్దూలో యం.బి.బి.యస్. పూర్తిచేసుకున్నారు. కానీ ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షితులైనారు. మగ్దూంతో కలిసి కామ్రేడ్స్ అసోసియేషన్‌ను స్థాపించారు. 1930లో విప్లవోద్యమం వైపు ఆకర్షితులైనారు. 1935లో లక్నోలో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల తొలి సభ జరిగింది. ఈ సభకు గౌర్ హాజరయ్యారు. వందేమాతరం పాటను నిషేధించినందుకు 1938లో మెడికల్ కాలేజీలో జరిగిన సమ్మెకు నాయకత్వం వహించారు. 1939లో కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యునిగా చేరారు. చాలాకాలం రహస్య జీవితాన్ని గడిపారు.

అనేక కార్మిక సంఘాల అధ్యక్షులుగా, ఎన్నో చిన్నా చితక కార్మిక సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా పనిచేశారు. 1947లో సాయుధ పోరాటంలో అగ్రభాగాన నిలిచారు.

1952 నుండి రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై కర్షక, కార్మిక వర్గాల హక్కుల కోసం కృషిచేశారు. అనేక దేశాలు సందర్శించారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్యలకు హాజరైనారు.

**జ్ఞానకుమారి హెడా :**

1918లో ఉత్తరప్రదేశ్‌లోని బులందర్ షహర్ జిల్లా కుర్జాలో జన్మించారు. హైదరాబాదులో స్థిరపడ్డారు. వీరి భర్త కే.శే. హరిశ్చంద్ర హెడా. ఆంధ్రప్రదేశ్‌లోని నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. వీరు బి.ఎ. పట్టభద్రులు. పన్నెండేండ్ల వయసులోనే ఇతర బాలికలతో కలిసి సత్యాగ్రహం చేసినందుకు కుర్జాలో 3 మాసాలు డిటెన్యూగా వుంచారు. 1938 నుండి హరిజనాభ్యుదయానికి కృషిచేస్తూ హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ క్రియాశీల



కార్యక్రమాలను చేపట్టారు. 1940 - 46 సం.రాలలో ఖాదీ ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. 1942 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా బహిరంగ సభ ఏర్పాటు చేసి ఉపన్యసించినందుకు 10 రోజులు కిషన్‌ప్రసాద్ దేవిడీలో డిటెన్షన్‌లో ఉంచారు.

1947 - 48లో ఇండియన్ యూనియన్ జెండాను ఎగురవేసినందుకు గాను సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించారు.

మహాత్మాగాంధీ అనుచరులు ఆచార్య భన్సాలీ గారితో కలిసి హైదరాబాదు రాష్ట్రమంతా పాదయాత్రలు చేశారు. ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. కస్తూర్బా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్టుకు హైదరాబాదు స్టేట్ ప్రతినిధిగా 1945 - 63 వరకు బాధ్యతలు నిర్వహించారు.

1946 - 49 సం. మధ్య స్టేట్ కాంగ్రెస్‌లో వీరు ఒక్కరే మహిళా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్‌గా 1948 - 53 మధ్య స్టేట్ రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

ముఖ్యంగా మహిళలను చైతన్యవంతులను చేయడానికి అనేక మహిళా వయోజన విద్యా కేంద్రాలను స్థాపించారు.

**అహల్యాబాయి :**

వీరు 1920లో హైదరాబాద్‌లో జన్మించారు. జాయిన్ ఇండియన్ యూనియన్ ఉద్యమంలో ఈమె సత్యాగ్రహం చేసినందుకు గాను 5-9-1947 నుండి 3-12-1947 వరకు జైలుశిక్ష అనుభవించారు.

**బ్రిజ్‌రాణి గౌర్ :**

వీరు 1921లో హైదరాబాద్‌లో జన్మించారు. వీరి భర్త రాజబహదూర్ గౌర్. జాతీయ భాష హిందీని ఉత్తమ పరీక్ష వరకు చదివారు. 1944 నుండి కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు. 1947 ఆగస్ట్ 15న హైదరాబాదులో భారత జాతీయ జెండాను ఎగురవేసినందుకు హైదరాబాద్ సెంట్రల్ జైల్లో ఆరుమాసాల జైలుశిక్షను అనుభవించారు.

**కొండవీటి ఇందిరమ్మ :**

1917లో నల్గొండ జిల్లాలోని తాళ్లవెల్లంల గ్రా. జన్మించారు. ప్రాథమిక విద్యను వీధిబడిలో అభ్యసించారు. వీరికి బుచ్చిరెడ్డి గారితో వివాహం జరిగింది. వీరు గొప్ప ఆదర్శవాది. క్విట్ ఇండియా ఉద్యమం నుంచి గాంధీజీ బోధనలకు ఆకర్షితులైనారు. హైదరాబాద్ సంస్థానం విముక్తి పోరాట దశ పూర్తిస్థాయిలో ఉన్నప్పుడు వీరు కమ్యూనిస్ట్ పార్టీలో ప్రవేశించి మరణించేంత వరకు పార్టీలోనే ఉండి సేవలందించారు. ఇందిరమ్మ గారు ప్రజాహిత కార్యక్రమాలలో పాల్గొంటూ బతుకమ్మ పాటలు స్వయంగా పాడి స్త్రీల కష్టాలను గూర్చి, గ్రామాల్లో వెట్టిచాకిరి గురించి మహిళలను చైతన్య పరిచేవారు. గాంధీజీ పిలుపు మేరకు అందరు ఖద్దరు ధరించాలని, రాట్నం వడికి నూలు తీయాలని ప్రచారం చేసారు. 1940లో మల్కాపురంలో జరిగిన 7వ ఆంధ్ర మహాసభలకు మహిళా ప్రతినిధిగా హాజరయ్యారు.

నల్గొండ జిల్లాలో అంటరానితనాన్ని నిరసించి అంటరాని వారిని ఇంట్లోకి రానిచ్చిన మొదటి మహిళ.

ఆంధ్ర మహిళా సభ స్థానిక శాఖను వారి గ్రామం తాళ్లవెల్లంలలో స్థాపించినారు.

1947 ఏప్రియల్ నెలలో రజాకర్ల గ్రామాలపై చేస్తున్న దౌర్జన్యాలను ఎదిరించినారు. కమ్యూనిస్ట్ పార్టీ ఏరియా కమిటీవారు వైద్య శిక్షణాలయాలను ఏర్పాటు చేశారు. కమిటీ ఆదేశం మేరకు వీరు వైద్యంలో శిక్షణ తీసుకున్నారు. ఈ శిక్షణ భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం గార్ల నేతృత్వంలో జరిగింది. శ్రీమతి ఇందిర గారు శిక్షణ పొంది క్షతగాత్రులైన పార్టీ కార్యకర్తలను, ఇతర గ్రామీణ ప్రజలకు చక్కటి వైద్యం చేసారు. వీరికి తుపాకి ప్రయోగించడం నేర్పించారు. తాళ్లవెల్లంల గ్రామం, చుట్టూ ఉన్న పరిసర గ్రామాల ప్రజలకు సేవచేయుటకు పంపారు. రజాకర్ల దాడిలో క్షతగాత్రులైన 10 మంది గెరిల్లా వీరులకు చికిత్స చేసి కాపాడారు. కలరా సోకినప్పుడు వారికి వాక్సినేషన్ ఇచ్చి ఆ వ్యాధి బారిన పడకుండా గ్రామీణ ప్రజలను ఆదుకొన్నారు.

1948లో పోలీసులకు దొరక్కుండా, చాకచక్యంగా తప్పించుకొని హైదరాబాద్ చేరుకొని అనేక కష్టనష్టాలు భరించారు. స్వయంగా వారు చదువుకొని 1949లో



కుటుంబ పోషణ నిమిత్తం ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి సావిత్రీ కన్యా పాఠశాలలో 1949 - 1953 వరకు పనిచేసారు. 1955లో వీరి భర్త జైలు నుండి విడుదలై వచ్చిన తరువాత వారి స్వగ్రామం తాళ్లవెల్లంలలో 1989లో బ్రాంచి పోస్ట్ ఆఫీస్ తెరిచి ఇందిరమ్మ గారే స్వయంగా బ్రాంచి పోస్ట్‌మాస్టర్‌గా ఉద్యోగం చేసినారు.

**ఎస్.కె. సుగుణ :**

వీరిది నల్లగొండ జిల్లా బీబీనగరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామం. వీరు చిన్న భూస్వాముల కుటుంబంలో జన్మించారు. వీరి నాన్నగారు రామచంద్రారెడ్డి, తల్లి గారు లక్ష్మమ్మ. వీరి పెద్దమ్మ రుక్మమ్మ బాల వితంతువు. సుగుణ గారు కుటుంబంలో నాలుగవ సంతానం. వీరి కుటుంబ బరువు బాధ్యతలన్నీ పెద్దమ్మ గారే చూసుకునేవారు.

వీరికి ఊహ తెలిసే నాటికే వీరి ఇంట్లో శాకాహారం, ఘోషా పద్ధతిని పాటించక పోవడం, ఆడపిల్లలకు చదువు చెప్పించటం ఉండేవి. దీనికి కారణం వీరి అన్నయ్య నరసింహారెడ్డి జాతీయోద్యమం వైపు ఆకర్షితుడు కావడం, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభలు కమ్యూనిస్ట్ పార్టీల ప్రభావంతో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా తను నమ్మిన సిద్ధాంతాలకు, ఆశయానికి అహర్నిశలు కృషిచేసినారు. కుటుంబంలోని వారందరిని ఆచరించేటట్లు చేయడంలో వారు సఫలీకృతులైనారు. అందుకే వీరిని ఆడపిల్లల పెంపకానికి భిన్నంగా పెంచారు.

ఆర్యసమాజం వారు అనేక సంఘ సంస్కరణ కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా అనేక పాఠశాలలు స్థాపించారు. వీరి గ్రామంలో జంగం వీరభద్రయ్య అనే టీచరు ఒక ప్రైవేటు పాఠశాలను నడుపుతుండేవారు. ఆరవ తరగతి వరకు చెప్పేవారు. చదువుతో పాటు వ్యాయామం, కర్రసాము, సైకిల్ తొక్కడం, ఈత, గుర్రపు స్వారీ మొదలగునవి ఆ రోజులలోనే నేర్పించేవారు. వీరు నిక్కరు షర్టు వేసుకునేవారు. ఈ పాఠశాల నిర్వహణకు నరసింహారెడ్డి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. అనేక జాతీయ గీతాలను ఆలపించేవారు. పాఠశాల ఆవరణలో పూలమొక్కలు, చెట్లు నాటేవారు. సెలవు దినాలలో, ప్రతి శుక్రవారం ఆటపాటలు, కోలాటం వంటి కార్యక్రమాలు ఉండేవి.

సహజంగా ఆడపిల్లలు కోరుకునే అలంకారాలకు వీరు దూరంగా ఉండేవారు. ఈవిధంగా చిన్న వయసులోనే కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏర్పడడానికి వీరికి వీధిబడి తోడ్పడింది. వీరిలో ఆత్మవిశ్వాసం, మానసిక దారుఢ్యం పెంపొందించి రాజకీయ పరిజ్ఞానానికి పునాది వేసింది. ఆరోజుల్లో రాత్రిపూట వయోజన విద్య, రాత్రి పాఠశాలలు నడిపేవారు.

హరిజనోద్ధరణలో భాగంగా వీరు వీరి ఇంటిముందు అరుగు మీదనే కూర్చోబెట్టి హరిజనులకు రాత్రిపూట పాఠాలు చెప్పేవారు. వీరిలో కొందరు పాలేరులు కూడా ఉండేవారు. కల్లు త్రాగటం వల్ల కలిగే నష్టాలను ప్రబోధించే గేయాలతో ఊరేగింపులు చేసేవారు. "కల్లు మానండోయ్ బాబు ... కళ్లు తెరవండి బాబూ" అనే పాట ఆరోజులలో బహుళ జనాదరణ పొందింది. మత్తు పదార్థాలను వాడటం వల్ల కలిగే నష్టాలను వివిధ రూపాలలో ప్రదర్శించేవారు.

రోజు నాంచా (గ్రామ పోలీసు అధికారి దినచర్య) జనన మరణాల రిజిస్టరులు, రహదారీ చిట్టీలు వీరు వ్రాసేవారు. ఆంధ్ర మహాసభ, రైతు సంఘాల సభ్యత్వాలు చేర్పించేవారు. వినాయకచవితి, గోకులాష్టమి, దసరా, దీపావళి మొదలైన పండుగలప్పుడు జరిగే ఉత్సవాలలో వీరు కూడా పాల్గొనేవారు.

ఆరుట్ల కమలాదేవి వివాహం తరువాత కూడ హాస్టల్‌లో ఉండి చదువు కుంటున్నదని తెలిసి ఆమె భర్తతో పాటు సమావేశాలకు సభలకు వెళ్ళి ఉపన్యాసాలు ఇస్తుందని విని ఆమెను చూడాలని, ఆమెలాగే జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని ఆరాటపడేవారు. ఒకసారి వీరి ఊరి దగ్గరలో ఒక గ్రామంలో కమలాదేవి వస్తున్నారని తెలిసి వీరు, వీరి అక్కగారైన శశికళ వెళ్ళి ఆ సమావేశంకు హాజరై కష్టజీవి బుర్రకథ విని, కమలాదేవి గారిని చూసామనే ఆనందంతో వీరు ఉక్కిరి బిక్కిరి అయినారు.

ఆంధ్ర మహాసభ పదకొండవ మహాసభకు వీరి కుటుంబం అంతా హాజరైంది. అదో జన సందోహం, వీరు స్వరాజ్యం గారిని మొదటిసారి చూసినారు. వారితో కలిసి వాలంటీర్‌గా పనికూడా చేశారు. ఈ సభలు వీరిలో ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఈ సభల ప్రభావం కుటుంబంపైన కూడా పడింది.



వీరి అక్కగారి పెళ్ళి సోషలిస్టు పార్టీలో కార్యకర్తగా ఉన్న కరీంనగర్ జిల్లా వెన్నంపల్లి గ్రామానికి చెందిన కాల్వ నారాయణ రెడ్డితో జరిగింది. వీరు మంచి స్నేహితులుగా ఉండేవారు. సుగుణ గారు ఆరవ తరగతి వరకు ఉర్దూ మీడియంలో చదువు పూర్తిచేశారు.

బీబీనగర్‌పై ఖాసిం రజ్వీ **1948** జనవరి నెలలో మొదటిసారి దాడి చేసినప్పుడు బీబీనగర్‌కు దగ్గరగా ఉన్న గ్రామము దాడికి గురిఅయ్యే అవకాశమున్నందున వీరు మొదటిసారిగా కారంపొడి పొట్లం దగ్గర పెట్టుకుని చీకట్లో బావి దగ్గరకు పరుగెత్తి ఆ రాత్రంతా గడిపారు. ఇది వీరి మొదటి అనుభవం. తరువాత అనేకసార్లు రాళ్ళ గుట్టలలోకి వెళ్ళి ప్రాణాలు రక్షించుకున్న సందర్భాలున్నాయి. వీరి ఇంటిపై అనేకసార్లు దాడులు జరిగాయి. ఏరోజు ఏమి జరుగుతుందో నని అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రోజులు వెళ్ళదీసేవాళ్ళు.

ఇంకొకసారి లారీ నిండా పోలీసులు వచ్చారని తెలిసి వీరు వెంటనే పరుగెత్తుకుని వెళ్ళి దగ్గరలో ఉన్న గౌండ్ల వారి ఇంట్లో దూరి, పోలీసులు గుర్తు పట్టకుండా వుండటం కోసం వారిలాగే కుడి పమిటతో చీరకట్టి వీరి వేషం మార్చేశారు. పోలీసులు వెతుక్కుంటూ ఈ ఇంటికి వచ్చారు. ఆ ఇంటామె మాత్రం మేము కల్లు అమ్ముకుని బ్రతుకుతాం దొర మాకేమి తెలియదని చెప్పి ఆ ఇల్లాలు సుగుణ గారిని రక్షించింది.

ఈ దాడుల నుండి రక్షణ కొరకై హైదరాబాద్‌కు మకాం మార్చారు. వీరు హైదరాబాద్ వచ్చిన కొన్ని రోజులకే ఖాసీం రజ్వీ తమ్ముడు తయ్యార్ రజ్వీ స్వయంగా రజాకర్లతో వచ్చి వీరి వూళ్లో వారి ఇంటి చాకలితో సహా పొలానికి నీళ్ళు పెడుతున్న మరో ఎనిమిది మంది పాలేర్లను పట్టుకుని, వారిచేతనే ఇంటిని కాల బెట్టించి, వారందరిని ఊరు బయటకు తీసుకువెళ్ళి వరుసగా నిలబెట్టి కాల్చి చంపారు.

హైదరాబాదులో కూడా ఎన్నో ఇండ్లు మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పటికప్పుడు నిద్రలేని రాత్రులు ఎన్నో. ఇంతలో హైదరాబాద్‌లో భారత సైన్యాలు ప్రవేశించాయి. **1948** సెప్టెంబర్ **13**వ తేదీన మొదలైన సైనిక చర్య **17**వ తేదీన ముగిసింది. రజాకర్ల పీడ వదిలింది. తిరిగి కుటుంబం అంతా గ్రామానికి వెళ్ళిపోయారు. కాలిపోయిన ఇంటిని బాగు చేసుకుని అక్కడే ఉన్నారు.

ఈ సంతోషం ఎంతకాలమో నిలువలేదు. మళ్ళీ సైనికుల దాడులు ప్రారంభమైనాయి. ఇంటిపై దాడిచేసి వీరి నాన్నగారిని చిత్రహింసలు పెట్టారు. వారి అన్నయ్య సలహా మేరకు తిరిగి హైదరాబాద్‌లో రహస్య జీవితం ప్రారంభించారు.

1949 జనవరిలో వీరి నాన్నగారికి వైద్యం నిమిత్తం సికింద్రాబాద్‌లోని సీతాఫల్ మండిలో ఒక అద్దె ఇంట్లో ఉండేవారు. వీరి నాన్నగారిని చూడడానికి రాజ బహదూర్ గౌడ్ ఎస్.వి.కె. గారు వచ్చారు. వీరు రెండు రోజులు ఉండి వెళ్ళారు. సుగుణ గారు వారికి తెలుగు రాదేమో అనుకున్నారట, వారంతా మారుపేర్లతో ఉండేవారు. యస్.వి.కె. గారిని 'దేవుడు' అని అనేవారు. ఈవిధంగా మొదటిసారి యస్.వి.కె. గారిని చూడటం జరిగింది.

తరువాత వీరి ఇల్లే డెన్‌గా మారింది. ఇక్కడ దళ కమాండర్లకు శిక్షణా తరగతులు, మహిళలకు ప్రత్యేక శిక్షణా తరగతులు ఉండేవి. పుస్తకాలు ఈ శిక్షణా తరగతులు, రాజకీయ అవగాహనా శక్తిని పెంపొందించుకోవటానికి పనికి వచ్చాయి.

యూనియన్ సైన్యాల దాడులు తెలంగాణా అంతటా తీవ్రం అయినాయి. ప్రజలపైన, పార్టీపైన హింసాత్మక చర్యలు హెచ్చినాయి. ముఖ్యమైన దళ సభ్యులను కాల్చి చంపుతున్నారు. ఈవిధంగా వీరి అన్నగారిని కూడా కాల్చి చంపారు. వీరికి కొరియర్‌గా ఉత్తరాలు చేరవేసే పనిని అప్పగించారు. వారు ఆ పనిని ఎంతో సమర్థవంతంగా చేసేవారు.

వీరు అనేకసార్లు కొరియర్‌గా సేవలందించారు. వీరి మారు పేరు ప్రమద. ఒకసారి సెల్ సమావేశంలో రావి నారాయణరెడ్డి గారు పార్టీ సభ్యత్వం ఇవ్వాలని భువనగిరి ఏరియా కమిటీలో నిర్ణయించాం అని వారు చెప్పగానే సుగుణగారు చాలా సంతోషించారు. ఈవిధంగా వీరు కమ్యూనిస్ట్ పార్టీ సభ్యురాలయినారు. మళ్ళీ వీరిని మరొక రహస్య స్థావరానికి మార్చారు.

యస్.వి.కె. గారిని సం. నుంచి చూసిన వారు మితభాషి. భోజనానికి, స్నానానికి మాత్రమే గది నుండి బయటకు వచ్చేవారు. ఆయనంటే అందరికి గౌరవాభిమానం ఉండేది. వీరు ఒకసారి వారిని వివాహం చేసుకోవాలనే అభిప్రాయాన్ని ఉత్తరం ద్వారా తెలియజేశారు. వీరు వారి అక్క, బావలతో సంప్రదించి వారు నారాయణ రెడ్డితో సంప్రదించి ఈ వివాహానికి ఒప్పుకొనమని సలహా ఇచ్చారు.



1949 నవంబర్ 25 దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి అనిరెడ్డి అనంతరెడ్డి గార్ల సమక్షంలో రావి నారాయణ రెడ్డి గారు ప్రమాణపత్రం చదివించి, దండలు మార్పించారు. ఈవిధంగా వీరి వివాహం జరిగిపోయింది. ప్రతి నిమిషం ప్రమాదకరమైన పరిస్థితులున్న రోజుల్లో వీరి దాంపత్య జీవితం ప్రారంభమైనది.

1951 జులైలో యస్.వి.కె. గారు అరెస్టయ్యారు. దిక్కుతోచని స్థితి. అమ్మ పంపిన బంగారు నగలు అమ్మి ఆ డబ్బుతో కాలం వెళ్ళబుచ్చినారు.

కొద్దికాలం తర్వాత సుందరయ్యగారు వచ్చి రాష్ట్ర నాయకత్వం వుండే స్థావర నిర్వహణకు పంపించాలని నిర్ణయించామని చెప్పారు. కాని కొన్ని రోజుల తర్వాత వచ్చి తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆపేస్తున్నామని డెన్స్‌లో ఉండేవాళ్లను వేరేచోటికి పంపిస్తున్నామని చెప్పి యస్.వి.కె. తమ్ముడు నరసయ్య గారి దగ్గరికి పంపారు. పూనాలో కొన్ని రోజులు ఉన్నారు. అక్కడి నుండి గుంటూరు వెళ్ళారు. అక్కడి నుండి మద్రాసు వెళ్ళారు.

ఈవిధంగా ఎంతోకాలం డెన్‌లు మారుస్తూనే ఉన్నారు. ఇంతలో యస్.వి.కె. గారి నుంచి ఉత్తర వచ్చింది. బ్రాహ్మణపల్లి వెళ్ళి అక్కడే ఉండమని, నాలుగు సం. తర్వాత కుటుంబాన్ని కలుస్తున్నామనే సంతోషం వీరిని ఉక్కిరి బిక్కిరి చేసింది.

1952లో జనరల్ ఎలక్షన్స్‌లో ప్రచారంలో పాల్గొన్నారు. యస్.వి.కె. గారిని ఔరంగాబాద్ జైలులో బంధించారు. వారిని వీరు కలవడానికి వెళ్ళేవారు. 1953 నవంబరులో యస్.వి.కె. గారు విడుదలయ్యారు. హైదరాబాద్‌లోనే మకాం పెట్టారు. అక్కడే పిల్లల చదువుల గురించి వీరు ఉండేవారు. యస్.వి.కె. గారు మాత్రం తిరిగి వస్తూ ఉండేవారు. 1994 జులై 17రాత్రి యస్.వి.కె. గారు మరణించారు.

**సంగం లక్ష్మీబాయి :**

ఘట్‌కేసర్‌లో 1911లో జన్మించి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గుంటూరు శారదా నికేతన్ జాతీయ విద్యాలయంలో తెలుగు, సంస్కృతం భాషల్లో విద్య అభ్యసించి విదూషిమణి అయ్యారు. 1926లో ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లమా చేపట్టారు. పూనాలోని కార్వే విశ్వవిద్యాలయం నుండి 1942లో పట్టభద్రులైనారు.

1928లో సైమన్ కమీషన్‌ను బాయ్‌కాట్ చేసినందుకు ఒక సం. నెల్లూరు జైల్లో

ఉన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్షను అనుభవించారు. 1932లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని 1933లో జైలుశిక్ష అనుభవించారు. 1932లో గాంధీజీతో పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. 1951లో ఆచార్య వినోబాభావే తెలంగాణాలో ప్రారంభించిన భూదానోద్యమంలో పాల్గొన్నారు.

1952లో అనాథ బాలికల గురించి విద్యావ్యాప్తికి ఇందిరా సేవాసదన్‌ను సైదాబాద్‌లో స్థాపించారు.

1952లో హైదరాబాదు అసెంబ్లీకి ఎన్నుకోబడి డా. బూర్గుల రామకృష్ణారావు గారి మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1957 - 71 సం.లలో లోక్‌సభ సభ్యులుగా ఉన్నారు. 1972లో తామ్రపత్ర గ్రహీత అయ్యారు.

**కల్పనాదత్ :**

బ్రిటీష్‌వారి గుండెల్లో రైళ్ల పరుగెత్తించి, వారిని నిద్రకు దూరం చేసిన వీర నారీమణి. నిప్పురవ్వ, భయం అంటే తెలియని అజాతశత్రువు. వీరు 27 జులై 1913లో శ్రీపుర్ గ్రా. చిట్టగాంగ్ జిల్లా బెంగాల్ రాష్ట్రంలో జన్మించారు. స్వాతంత్ర్యం తరువాత బంగ్లాదేశ్‌లో కలిసిపోయింది ఈ ప్రాంతం. వీరు ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీ పార్టీలో పనిచేసారు. 1940లో కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. 1929లో చిట్టగాంగ్‌లో మెట్రిక్యులేషన్ పూర్తిచేసుకుని కలకత్తాలోని బెతూన్ కళాశాలలో సైన్స్ గ్రాడ్యుయేషన్‌లో చేరి అక్కడ చత్రి సంఘ అనే మహిళా విద్యార్థి సంఘంలో చేరి ఉత్సాహంగా పనిచేసినారు.

వీరు 1930లో సూర్యసేన్‌తో నడపబడిన దళంలో సభ్యురాలిగా చేరి బ్రిటీష్ వారి ఆయుధాలను (మందుగుండును) ఎత్తుకు వచ్చే పనిలో పాల్గొన్నారు. చిట్టగాంగ్‌లోని యూరోపియన్ క్లబ్ పైన దాడిచేసి ఆయుధాలను సేకరించడానికి ప్రీతిలతా వడ్డెదార్‌తో కలిసి పాల్గొన్నారు. వీరు చాలా ధైర్యస్థులు. ఎలాంటి జంకు, సంకోచం లేకుండా వీరు ఆ దాడిలో పాల్గొన్నారు. కాని దాడి కన్నా ముందే బ్రిటీష్ వారు జరిపిన సోదాలో పట్టుబడి అరెస్ట్ కాబడి 1933 ఫిబ్రవరి 17న బెయిల్‌పై విడుదలై అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. మళ్ళీ వీరిని 19 మే, 1933లో అరెస్ట్ చేసి ఉరిశిక్ష వేసారు. దానిని తరువాత జీవిత ఖైదుగా మార్చారు. వీరు జైలు నుండి 1939లో



విడుదలై 1940లో కలకత్తాలో డిగ్రీ పూర్తి చేసుకుని 1946లో కమ్యూనిస్ట్ పార్టీలో చేరి జీవితాన్ని పార్టీకే అంకితం చేసారు.

వీరు 1943లో పూరన్‌చంద్ జోషిని జనరల్ సెక్రటరీ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా గారిని వివాహం చేసుకుని వీరి పూర్తి సమయాన్ని ప్రజల సంక్షేమానికి త్యాగం చేసిన ధీరమూర్తి.

వీరికి చాంద్, సూరజ్ అని ఇద్దరు కుమారులు. అందులో చాంద్ జోషి ప్రసిద్ధ పాత్రికేయుడు. ఇతడు హిందూస్తాన్ టైమ్స్‌లో పనిచేసారు. వీరు 1985లో వ్రాసిన బ్రందన్ వాలి, మిత్ అండ్ రియాలిటీ చాలా ప్రసిద్ధి చెందిన రచనలు.

వీరి భార్య మానిని ఛటర్జీ గారు వ్రాసిన చిట్టగ్రామ్ ఆర్మర్స్ రెయిడ్ గురించి రాసిన డూ ఆర్ డై ద చిట్టగామ్ అప్ స్పింగ్ (1930 - 1934) అన్న రచన చాలా ప్రసిద్ధి గాంచినది. ఇందులో కల్పనాదత్ నిర్వహించిన వీరోచిత సాహసం మనకు కనిపిస్తుంది.

కల్పనాదత్ గారు గొప్ప ఫైరింగ్ స్పీకర్.

**ఆనాటి కష్టాలు**

కేసులు పెట్టి కోర్టు చుట్టూ తిప్పి వేధించడం, వాయిదాలకు రామన్నందుకు మరో కేసు పెట్టి తిరిగి జైల్లో పెట్టేవారు. కేసు విచారణ తరువాత శిక్షలు, జరిమానాలు ఉండేవి. జరిమానా కట్టని వారి ఆస్తులను జప్తు చేసేవారు. ఇండ్లపై దాడి చేసి వస్తువులన్నీ పగల గొట్టేవారు. బట్టలను కాల బెట్టేవారు. ధాన్యాన్ని నేలపాలు చేసేవారు.

పార్టీలలో పనిచేసే స్త్రీలకు రక్షణ కరువైంది. పోలీసు దాడులకు, నిర్బంధాలకు భయపడి కన్నవారు సైతం పార్టీ స్త్రీలను ఇళ్ళకు రావద్దని అనేవారు. అజ్ఞాతంలో ఉన్న భర్తల జాడ చెప్పమని పార్టీ స్త్రీలను ప్రభుత్వం, పోలీసులు నిత్యం వేధించేవారు. ఆచూకీ చెప్పకపోతే ఇంట్లో ఉన్న ఆహార పదార్థాలపై కిరోసిన్ పోసి కాల బెట్టేవారు. పచ్చడి జాడీలను పగుల గొట్టేవారు.

ఆనాడు గర్భవతులకు అబార్షన్ చేయించేవారు. ఎందుకంటే రహస్యంగా ఉన్న స్త్రీలు ఏ డాక్టరు దగ్గరికి వెళ్ళినా నాయకులకు ప్రమాదం జరుగుతుందనే ఉద్దేశ్యంతో. ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందో, ఏ బాధను ఎదుర్కోవాల్సి వస్తుందో అనుకుంటూ తప్పించుకునే వారల గురించి ఆలోచించేవాళ్ళు.

రహస్యంగా ఉన్న భార్యాభర్తలకు పిల్లలు కలగడం, పెంచడం కష్టమౌతుందన్న పార్టీ నిర్ణయంతో ఎందరో ఉద్యమకారులు పురుషుల ఆపరేషన్స్ చేయించుకున్నారు. పిత్రార్జితమైన ఆస్తులను పార్టీ కార్యక్రమాలకు రాసి ఇచ్చారు. వంట చేస్తే పొగ బయటకు వస్తుందని ఎన్నో రోజులు పస్తులు ఉండేవారు.

మగవారిని జైల్లో పడేసి ఆడవారిని నిత్యం వేధించేవారు. వారి పిల్లల ఆచూకి చెప్పమని, పంటభూములు కౌలుదార్లు సాగు చేయకుండా అడ్డుపడటం, పశువులను జప్తుచేయడం ఈవిధంగా అజ్ఞాత కామ్రేడ్ తల్లిదండ్రులకు ప్రభుత్వం నిత్యం నరకాన్ని చూపేది. జైల్లో ఉన్నవారిని ఆప్తులనుకునేవారు వెళ్ళి చూడవచ్చును. కాని అజ్ఞాతంలో వున్నవారికి ఆప్తులున్నా, ఆస్తులున్నా అవకాశాలుఉండవు.

మధ్యప్రదేశ్ నుండి దండకారణ్యం వరకు తెలంగాణ పోరాటానికి స్త్రీల ద్వారా ఆయుధాలు, ఆహార పదార్థాలు, నిషిద్ధ పత్రాలు, ప్రణాళికలు పంపేవారు. ఆనాటి నాయకత్వం, పిల్లలు కుటుంబాలు ఏమవుతారనే దానికన్నా డెన్‌లను ఎలా కాపాడాలి, ఉద్యమాన్ని ఎలా సక్రమంగా నడపాలి అనేదే చూశారు. పిల్లలు డెన్‌లలో, స్కూల్‌కి వెళ్లకుండా డెన్‌లోనే రహస్య జీవితం గడపాల్సి వచ్చేది.

చాలాచోట్ల డబ్బు లేక ఉద్యమ కారులు రిక్షా తొక్కటం, కంకర కొట్టడం, కొన్నిచోట్ల టైప్ చేసి డబ్బు సంపాదించేవారు. డెన్‌లో వచ్చిన డబ్బును బట్టి ఒక్కపూటనే తిండి తినేవారు. వీరు బరి తెగించిన స్త్రీలని, భర్తలు వొదిలేసిన స్త్రీలని, కిరస్తానీ స్త్రీలని సంచులు పట్టుకుని తిరుగుతూ కమ్యూనిస్ట్ మత ప్రచారం చేస్తున్నారని అవమాన పరిచేవారు. బాలింతలు పసిపిల్లల తల్లులను పోలీసులు తీసుకువస్తే పాలు గడ్డకట్టి స్థనాలు సలిపి జ్వరాలు వచ్చేవి.

లెవీ ఇవ్వ నిరాకరించినారని చాలా గ్రామాలలో దమన కాండలు జరిగాయి. స్త్రీలపై సామూహిక మానభంగాలు, పోలీస్ స్టేషన్‌లలో బంధువులను తీసుకువెళ్ళి చిత్రహింసలు పెట్టేవారు. కుటుంబ సభ్యులంతా కర్రలు, వడిసెలను ఉపయోగించటం, మహిళలకు కారంపొడి, రోకళ్ళతో, మరుగుతున్న నీళ్లతో శత్రువులను ఎదిరించే శిక్షణ ఇచ్చేవారు.

ఆత్మ రక్షణ కోసం వేట తుపాకులు, నాటు తుపాకీలు, రివాల్వర్ రైఫిళ్ల మొదలైన ఆయుధాలను ఆత్మ రక్షణ కోసం వినియోగించుకోవటానికి కుటుంబంలో అందరూ శిక్షణ పొందేవారే. కుటుంబ సభ్యులను నిర్బంధించటం, కోర్టుల చుట్టూ తిప్పటం, గ్రామాలపై 144వ సెక్షన్ విధించటం, నాయకుల అరెస్ట్ కోసం రాత్రింబవళ్లు దాడులు చేసి హింసించటం.



కిరాయి గూండాలతో భయభ్రాంతులను చేయడం. శవాలను దహన సంస్కారాలు కూడా చేయనిచ్చేవారు కారు. దొంగ కేసులు పెట్టి జైలు పాలు చేసేవారు. ఈటెలు, గొడ్డళ్లను ఉపయోగించటం నేర్పేవారు. తాటికాయలను ఈటెలకు గ్రుచ్చి బాంబులుగా భ్రమింపచేసేవారు. నిజాం సైనికులు గ్రామస్తులందరిని వరుసగా నిలబెట్టి కాల్చి చంపేవారు. గ్రామస్తులంతా తగులబెట్టి అల్లకల్లోలం చేసేవారు. సజీవ దహనాలు చేసేవారు. వారి చేతనే కట్టెలు తెప్పించి చితి పేర్పించి వారినే అందులో వేసి సజీవ దహనం చేసేవారు.

కొన ఊపిరిలో ఉన్నవారిని గడ్డి వాములలో వేసి కాల్చి చంపేవారు. ఐదు సంవత్సరాల నిరంతరాయ పోరాటం, అగ్ని పరీక్షలకు తట్టుకొని మూడు వేల మంది పైగా కార్యకర్తలు బలి అయిన తరువాత యాభయి వేలమంది దారుణమైన చిత్ర హింసలకు గురి అయిన పిదప స్వాతంత్ర్యం వచ్చింది. ఆర్థిక ఇబ్బందులు, పోషణ ఎంతో కష్టం అయింది.

ఉద్యమాలలో తిరిగిన కుటుంబాల వితంతువులు ఆనాడు తల్లిగారి ఇంట్లోనే ఉండేవారు. వీరు పెద్దమ్మ, మేనత్తలు, చిన్నమ్మలు వారి జీవితాలనే త్యాగం చేసేవారు. కష్టపడి వ్యవసాయం చేయించటం ఒంటరి పోరాటం. కుటుంబ పోషణ భారం వీరందరి త్యాగం మరువలేనిది.

ఆడవాళ్ళు కారం పొడి లేదా ఇసుక లేక మట్టి వారి కళ్ళల్లో చల్లి తప్పించు కోవాలని నేర్పించేవారు. చీటికి మాటికి ఉద్యమ కారుల కుటుంబ సభ్యులను పిలిచి వేధించేవారు. రోజుల తరబడి పోలీస్ స్టేషన్‌లలో ఉంచేవారు. అనేకసార్లు ఇండ్లపై దాడి చేసేవారు. ఏ రోజు ఏమి జరుగుతుందోనని, అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని రోజులు వెళ్ళదీసేవాళ్ళు. పోలీసులు, రజాకార్లు వస్తున్నారని తెలియగానే చేలలోకి, చెట్లు, పెద్దరాళ్ల గుట్టలలోకి పరుగెత్తి ప్రాణాలు కాపాడుకునేవారు. ఎన్నోరోజులు తిండి తిప్పలు లేకుండా గడిపారు.

## కుటుంబాల అగచాట్లు

బస్సులో, రైల్లో ఎలాంటి ప్రయాణ సాధనాన్ని వాడినా ఎక్కడ పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారోనని భయం. ఎన్నో రోజులు అజ్ఞాతవాసంలో ఉండాల్సి వచ్చేది ఎవరికీ తెలియవు. ఎప్పుడు ఏమి జరుగుతుందో, పేర్లు మార్చుకుని ఉండేవారు. మారు వేషాలలో తిరిగేవారు. ఎంతకాలం రహస్య జీవితం గడపాలో కూడా తెలియని పరిస్థితి.

ఏదైనా పుస్తకం నిషేధించబడిందంటే అది ఎలాగయినా సంపాదించి చదివేవారు. మార్క్సిస్టు సాహిత్యంపై మక్కువతో కాపిటల్‌తో మొదలుపెట్టి ప్రసిద్ధి చెందిన రాజకీయ సిద్ధాంత పరమైన ఎన్నో పుస్తకాలు క్షుణ్ణంగా చదివేవారు. విద్యార్థి సంఘాలు ఏర్పడటం, విద్యార్థుల సమ్మెలు లాంటి వార్తలు విని ఉత్తేజం పొందేవారు. విద్యార్థి ఉద్యమ ఐక్యతకు, ఉద్యమ పురోగమనానికి విద్యార్థులే పత్రికలు నడిపేవారు.

గాంధీగారు స్వాతంత్ర్యమో - మరణమో అనే ఉత్తేజకరమైన పిలుపుకు దేశమంతటా ఆందోళనలు, ప్రజల తిరుగుబాటు, రైల్వే లైన్లు, రోడ్లు ధ్వంసం చేయడం జరిగింది. 1942లో కమ్యూనిస్ట్ పార్టీ ప్రజాయుద్ధం ప్రకటించిన తర్వాత ప్రభుత్వం అన్ని పార్టీలపై నిషేధం ప్రకటించింది. ఏ రాజకీయ సమావేశాలు చేయాలన్నా రహస్యంగా వివిధ మారుపేర్లతో మారు వేషాలతో నిర్వహించాల్సి వచ్చేది.

నైజాం ప్రభుత్వం ధాన్య సేకరణ, లెవీ, రేషనింగు విధానాలు ప్రవేశపెట్టింది. రైతులను చాలా బాధలు పెట్టింది. రైతుల ఇండ్లలో జొరబడి ఉన్న ధాన్యాన్ని లాక్కుపోవటం, తూకంలోనూ, డబ్బు చెల్లించడం లాంటి విషయాలలో మోసం, అక్రమాలతో గ్రామ గ్రామాన రైతులు హాహాకారాలు చేసేవారు. ఇల్లు అద్దెకు దొరకటం కష్టంగా ఉండేది. కమ్యూనిస్ట్‌లు అని తెలిస్తే అసలే ఇచ్చేవారు కాదు. తరుచుగా ఇల్లు మార్చాల్సి వచ్చేది.



## నేటి తరానికి సందేశం

క్రీస్తు శకారంభం నుండి ప్రథమ భారత సంగ్రామం వరకు ఎందరో మహిళలు గృహిణులుగా, వీర వనితలుగా, త్యాగమూర్తులుగా, పరిపాలకులుగా, విద్యా వేత్తలుగా, వృత్తి నైపుణ్య నేర్పరులుగా, భక్తి ప్రచారకులుగా, రచయిత్రిగా, కవయిత్రిగా, వ్యవసాయికులుగా, నాట్యకత్తెలుగా, సంగీత మర్మజ్ఞులుగా, రాజకీయ నాయకురాలిగా, సమాజ సేవకులుగా, గొప్ప అధికారులుగా, వ్యాపారవేత్తలుగా వారు చేపట్టని వృత్తి లేదు. కార్యక్రమం లేదు.

***ఇందెందు గలడు ఎందెందు లేడు***

......... అన్నట్లుగా స్త్రీ పరాశక్తి, జగన్మాత.

ప్రపంచ దేశాలలో వికసించారు. ఎన్నో విదేశీ సంస్కృతులు మన దేశంలో వీర విహారం చేసినా వాటి విషాన్ని మాత్రం వాకిలిలోనికి రానివ్వలేదు భారతీయ మహిళ.

ఆమె పుణ్యఫలమే జాతిలో స్వాతంత్ర్య భావబీజాలు నాటుకోవడం, ఈ దేశం కొరకు, ధర్మం కొరకు, జాతి కొరకు నిత్య చైతన్యశీలురై శ్రమించిన మహిళలను ఎవ్వరూ మరిచిపోలేరు.

ఎన్ని పాత్రలలో రాణించినా ఎన్నో విజయాలను సాధించినా, ఆకాశాన్ని ముద్దాడినా, పాతాళాన్ని స్పృశించినా, భారతీయ స్త్రీ తన కుటుంబ వికాసానికి, వ్యక్తిలో సంస్కారాలు నాటడాన్ని ధర్మంగా, బాధ్యతగా భావించినప్పుడే అసలైన భారతనారి అవుతుంది.

❊ ❊ ❊

## ఆధార గ్రంథాలు


1. మహాత్మాగాంధీ జీవితం - సిద్ధాంతాలు - వేమూరి జగపతిరావు
2. ఆధునిక ఆంధ్ర దేశ చరిత్ర - క్రీ.శ. 1000 - 1956 - ముప్పాళ హన్మంతరావు
3. స్వాతంత్ర్య సమర సేనాని టి. హయగ్రీవాచారి స్మారక దీపిక ఆ.సా.స. సంస్థ, గాంధీభవన్.
4. A Survey of Freedom Movement in India - ఆర్. సూర్యనారాయణ మూర్తి
5. నిర్జన వారధి - కొండపల్లి కోటేశ్వరమ్మ
6. పోరాటాల బాటలో అనుభవాలు, జ్ఞాపకాలు - యస్.వి.కె. ప్రసాద్, సుగుణ
7. భారత దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర - తెలుగు అకాడమి
8. సత్యశోధన - చెన్నమనేని రాజేశ్వరరావు
9. అహింసాన్వేషణ - వినోబా - వేమూరి రాధాకృష్ణమూర్తి
10. పుచ్చలపల్లి సుందరయ్య వీర తెలంగాణా విప్లవ పోరాటం - గుణపాఠాలు - పుచ్చలపల్లి సుందరయ్య
11. హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర - వెల్దుర్తి మాణిక్యరావు
12. తెలంగాణ ప్రజల సాయుధ పోరాట చరిత్ర - దేవులపల్లి వెంకటేశ్వరరావు
13. తెలంగాణ ప్రజల సాయుధ పోరాట చరిత్ర - దేవులపల్లి వెంకటేశ్వరరావు


❊ ❊ ❊